www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 20-11-2025 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 232 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య మ.12:17 తదుపరి పాడ్యమి, నక్షత్రం: విశాఖ ఉ.10.59 తదుపరి అనూరాధ, వర్జ్యం: మ.3.28-5.16, దుర్ముహూర్తం: ఉ.10.09-10.53, మ.2.36-3.21, అమృతఘడియలు: రా.2.15-4.03, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 5.34

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హంతకుడిని పట్టించిన ల్యాప్‌టాప్

అమెరికాలో ఏపీ మహిళ హత్య కేసులో ట్విస్ట్

2017లో ఆమెతో పాటు కుమారుడి హత్య

తొలుత భర్తపై అనుమానం.. విచారణ.. భర్త సహోద్యోగి

హమీద్ హత్య చేసినట్లు తాజాగా గుర్తింపు

2

ల్యాప్‌టాప్‌పై అతడి డీఎన్ఏను కనుగొన్న అధికారులు

హత్య తర్వాత భారత్‌కు వచ్చేసిన హమీద్

అతడిని అప్పగించాలని కోరుతున్న అమెరికా అధికారులు



నర్రా శశికళ, అనీశ్ సాయి



హమీద్

నేటి నుంచి ఓటర్ల జాబితా

సవరణ

23న తుది జాబితా ప్రకటన





షెడ్యూల్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్

26న పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల?

వచ్చేనెల రెండో వారంలో పోలింగ్

రెండు దశల్లోనే ఎన్నికలు ఉండే అవకాశం

ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్‌ల నియామకం

నేడు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్

మొదటి వారంలో జిల్లాల పర్యటనకు సీఎం!

హైదరాబాద్, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరానికి ఈ నెలలోనే షెడ్యూల్ జారీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 26న షెడ్యూలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది. అనంతరం నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ పూర్తయి డిసెంబరు రెండో వారంలో పోలింగ్ జరుగుతుందని అంచనా. దీనికి అనుగుణంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కసరత్తు ప్రారంభించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను మరోసారి సవరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకుగాను గురువారం (ఈ నెల 20) నుంచి 23 వరకు గ్రామాల్లో ఓటరు జాబితాల సవరణ కోసం బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం.. గతంలో వెల్లడించిన జాబితాలో నమోదు కాకుండా ఇటీవల కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఇదివరకు ఉన్నవాటిలో తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణను గురువారం చేపట్టనున్నారు. 21న ఓటరు దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం చేపట్టి.. 23న పంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ చేపట్టనున్నట్లు ఎస్ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో స్థానిక పరిస్థితులు, ఎన్నికల సంసిద్ధత, నిర్వహణ కోసం ఏర్పాట్లు వంటి అంశాలపై వారితో చర్చించనున్నారు. దీంతోపాటు తుది ఓటరు జాబితా తయారీ షెడ్యూల్, పోలింగ్ సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, సామగ్రి, జోనల్ అధికారులు, పరిశీలకులు, శాంతిభద్రతలు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, మోడల్ కోడ్ కమిటీ, ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాల రూపకల్పన వంటి అంశాలపైనా చర్చించి నిర్ణయం తీసుకుంటారు. వీడియో కాన్ఫరెన్స్‌లో

మిగతా 13వ పేజీలో...



పోస్టుమార్టం కోసం నక్సల్స్ మృతదేహాలను తీసుకొచ్చిన రంపచోడవరం ఆస్పత్రి వద్ద బలగాలు

మరో ఏడుగురి ఎన్‌కౌంటర్

మారేడుమిల్లిలోనే మళ్లీ ఎదురుకాల్పులు

మృతులందరూ హిడ్మా దళ సభ్యులే..

వారిలో టెక్ శంకర్ అలియాస్ జోగారావు

37 ఏళ్ల క్రితం సిక్కోలు నుంచి ఉద్యమంలోకి.. ఏవోబీకి సారథ్యం

మిలిటరీ, టెక్నికల్ రంగాలపై గట్టిపట్టు

రాజమహేంద్రవరం/మారేడుమిల్లి/రంపచోడవరం, శ్రీకాకుళం/వజ్రపుకొత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలోని మారేడుమిల్లిలో బుధవారం ఉదయం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో మరో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఆంధ్రా-ఒడిశా బోర్డర్ (ఏవోబీ) కమిటీ నేత మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్

మిగతా 14వ పేజీలో...

అగ్రనేతలే లక్ష్యంగా ప్రణాళిక

కేంద్ర నిఘా వర్గాల ఆపరేషన్

తెలంగాణ, ఏపీ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ పోలీసులతో కలిసి అడవుల జల్లెడ

14

మావోయిస్టుల కొంపముంచిన డ్రోన్లు

పోలీసుల అదుపులో తిరుపతి?

ఆందోళనలో కుటుంబ సభ్యులు

విద్యుత్తుపై ఫోకస్

24న ప్రత్యేకంగా భేటీ కానున్న క్యాబినెట్

కొత్త డిస్కమ్ ఏర్పాటు, విద్యుత్తు డిమాండ్, థర్మల్ ప్లాంట్లు,

రాజధానిలో భూగర్భ కేబుల్ లైన్లపై చర్చించనున్న మంత్రివర్గం

కొత్త సంస్కరణలపై మంత్రులకు సమావేశంలో వివరణ

రూ.59,671 కోట్ల మేర నష్టాల్లో రెండు డిస్కమ్‌లు

వాటి పరపతి పెంచడానికి కొత్త డిస్కమ్ ఏర్పాటు

గ్రిడ్ రక్షణ కోసం కొత్త థర్మల్ ప్లాంట్ల నిర్మాణం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఈ మేరకు కొత్తగా తీసుకురానున్న సంస్కరణల మీద చర్చించేందుకు ఈనెల 24న ప్రత్యేకంగా క్యాబినెట్ భేటీ కానుంది. ఈ సందర్భంగా కొత్త డిస్కమ్ ఏర్పాటు, భారీ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు సరఫరా కోసం తీసుకోనున్న చర్యలు, థర్మల్ ప్లాంట్లు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాలను మంత్రివర్గంలోని సభ్యులందరికీ వివరించనున్నారు. విద్యుత్తు రంగం పరంగా ప్రధానంగా నాలుగు అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. కొత్తగా పరిశ్రమలు ఏర్పడటం, పట్టణీకరణ పెరగడం, వ్యవసాయ రంగం వృద్ధి చెందడం, గృహజ్యోతి పథకం కారణంగా రాష్ట్రంలో విద్యుత్తుకు డిమాండ్ పెరిగింది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డాక.. 2015 మార్చి 8న రాష్ట్రంలో విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 6,755 మెగావాట్లుగా ఉంది. ఈ ఏడాది మార్చి 20 నాటికి అది 17,165 మెగావాట్లకు చేరుకుంది. జాతీయ తలసరి విద్యుత్తు వినియోగం 1,395 యూనిట్లు ఉండగా... తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 2480 యూనిట్లుగా ఉంది.



2034-35 కల్లా ఇది 31,809 మెగావాట్లుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే అప్పటికి 47,119 మిలియన్ యూనిట్ల మేర లోటు ఉంటుందని తేల్చారు. 2034-35 కల్లా రెన్యూవబుల్ పవర్ అబ్లిగేషన్ (సంప్రదాయ విద్యుత్తును వాడుతుంటే విధిగా సంప్రదాయేతర విద్యుత్తు వాటా) 50 శాతంగా ఉండనుందని, దీనికోసం మరో 2034-35 కల్లా సౌరవిద్యుత్తు వాటా 33,644 మెగావాట్లుగా ఉండాలని గుర్తించింది. డిమాండ్‌ను తీర్చే

మిగతా 13వ పేజీలో...

కోర్టు తీర్పులకు విరుద్ధంగా చట్టాలా?

అలా చేయడానికి వీల్లేదు

కోర్టు తీర్పులను పార్లమెంటు పక్కన పెట్టలేదు

ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం విషయంలో

కేంద్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

చట్టంలో కీలక నిబంధనలను కొట్టివేస్తూ తీర్పు

గతంలోనూ కేంద్రంపై జస్టిస్ గవాయ్ ఫైర్



న్యూఢిల్లీ, నవంబరు 19: కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ట్రైబ్యునల్ సభ్యులు, ప్రిసైడింగ్ అధికారుల నియామకాలు, పదవీకాలం, సర్వీసు షరతులకు సంబంధించి ఈ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం రద్దు చేసింది. అవన్నీ పాతవేనని, చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టిందని పేర్కొంది. చట్టంలో చిన్న చిన్న మార్పులు చేయడం ద్వారా కోర్టు తీర్పులను పార్లమెంటు పక్కనపెట్టడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. కోర్టు

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువుపై నేడు సుప్రీం స్పష్టత!

చట్టసభలు ఆమోదించిన బిల్లుల ఆమోదం కోసం 3 నెలలు గడువు విధిస్తూ మేలో సుప్రీంకోర్టు తీర్పు

రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారికి గడువు పెట్టడంపై భిన్నాభిప్రాయాలు

ఆర్టికల్ 143 కింద తిరిగి సుప్రీంనే అభిప్రాయం కోరిన రాష్ట్రపతి ముర్ము

తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్రం, సమర్థిస్తూ పలు రాష్ట్రాల వాదన

తీర్పుపై సర్వత్రా ఆసక్తి

2





సత్యసాయి

పుట్టపర్తిలో సత్యసాయిబాబా మహా సమాధి వద్ద ప్రధాని మోదీ; బహిరంగ సభలో మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు

విశ్వప్రేమకు ప్రతిరూపం

'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అని బోధించారు

140 దేశాల్లో కోట్ల మందికి బాబా బోధనలు వెలుగుబాట

సత్యసాయి శతజయంతి వేడుకల్లో ప్రధాని మోదీ

బాబా స్మారక నాణెం, తపాలా స్టాంపుల ఆవిష్కరణ

భూమిపై మనం చూసిన దైవం సత్యసాయి: చంద్రబాబు

అనంతపురం/పుట్టపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశ్వప్రేమకు ప్రతిరూపం భగవాన్ సత్యసాయిబాబా అని ప్రధాని మోదీ అన్నారు. సేవే పరమ ధర్మమని మన నాగరికత చెప్పిందని.. సత్యసాయి పాటించిన ప్రేమ, సేవాభావనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. భక్తి, జ్ఞానం, కర్మ.. ఈ మూడు సేవలే భారతీయ నాగరికతకు మూలమని తెలిపారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు బుధవారం ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి

మిగతా 3వ పేజీలో...

అల్ ఫలాహ్ నుంచి 10 మంది పరారీ

గాలిస్తున్న దర్యాప్తు సంస్థలు

ఫరీదాబాద్ మాడ్యూల్‌తో సంబంధాలపై విచారణ

పాక్‌లో యాప్ ద్వారా విరాళాలు సేకరించిన జైషే

2

అల్ ఫలాహ్‌లో రూ.415 కోట్ల అక్రమాలు

నకిలీ గుర్తింపుతో ఫీజు వసూళ్లు

లెక్కల్లో విరాళాలుగా..: ఈడీ

వర్సిటీ వ్యవస్థాపకుడు సిద్దిఖీకి 13 రోజుల రిమాండ్



మహిళా సమాఖ్య ప్రతినిధులకు ఇందిరా మహిళా శక్తి చీరలను అందిస్తున్న సీఎం రేవంత్, భట్టి, మంత్రులు సీతక్క, సురేఖ, పొన్నం, కోమటిరెడ్డి, శ్రీహరి, పొంగులేటి

మహిళల ఉన్నతే.. ప్రగతి

మహిళా సంఘాల ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు..

ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం అమెజాన్‌తో సంప్రదింపులు

13

ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయం

రాష్ట్రంలోని కోటిమందికి ఇందిరా మహిళా శక్తి చీరలు

మొదటి విడతగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ

పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు 35 లక్షల చీరలు: సీఎం రేవంత్

మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్.. ఇందిరకు ఘన నివాళి



హిందువుల ఓట్లతోనే కేంద్రంలో బీజేపీ!

వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడం వెనుకా ఆ ఓట్లే

బల్దియా ఎన్నికల్లో 48 స్థానాలు గెలవడం వెనుకా హిందూ ఓట్లే

12

హిందుత్వ నినాదంతోనే ఇంటింటికీ..

మిగతా పార్టీలతోనూ జైశ్రీరాం అనిపిస్తాం

హుజూరాబాద్‌లో కేంద్రమంత్రి బండి..

ఈటల వ్యాఖ్యలకు కౌంటర్!

తప్పుడు ప్రచారం చేస్తే కేసులు

సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేయొద్దు

3

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు బీజేపీని బద్నాం చేస్తున్నాయి: రాంచందర్‌రావు

2047నాటికి.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 3 ట్రిలియన్ డాలర్లకు

జీడీపీకి రాష్ట్రం నుంచి 10% వాటా.. తలసరి ఆదాయం రెట్టింపే లక్ష్యం

రాష్ట్రం 3 ప్రాంతాలుగా సుస్థిరాభివృద్ధి.. 'తెలంగాణ రైజింగ్-2047' డాక్యుమెంట్

వచ్చేనెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరణ

ఏం చేయబోతున్నామో చెప్పేదే 'తెలంగాణ రైజింగ్' డాక్యుమెంట్

గ్లోబల్ సమ్మిట్ నాటికి రూపకల్పన పూర్తి చేయాలి: సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పాలనను పూర్తి చేసుకోబోతున్న రాష్ట్ర ప్రభుత్వం.. 2047 సంవత్సరం నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆ దిశగా ఏయే రంగాల్లో ఎలాంటి అభివృద్ధి సాధించాలి? ఏయే వర్గాలకు ఎలాంటి అవకాశాలు, సదుపాయాలు కల్పించాలనే అంశాలతో 'తెలంగాణ రైజింగ్-2047' పేరిట ఒక డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబరు 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో ఈ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనుంది. రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని.. ప్రస్తుతమున్న 210 బిలియన్ డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా



తీర్చిదిద్దుతామని ప్రభుత్వం తన విజన్ డాక్యుమెంట్‌లో వెల్లడించింది. అప్పటికల్లా 'జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ)'కి రాష్ట్రం నుంచి 10 శాతం వాటా అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. రాష్ట్ర తలసరి ఆదాయాన్ని పది రెట్ల మేర పెంచడమే తన సంకల్పమని

మిగతా 12వ పేజీలో...

'ఇండి' కూటమి విచ్ఛిన్నం?

బిహార్ దెబ్బతో కాంగ్రెస్‌తో కొనసాగడంపై పునరాలోచన

న్యూఢిల్లీ, నవంబరు 19: వరుస పరాజయాలతో కుదేలై పోతున్న ఇండి కూటమి, తాజాగా బిహార్‌లో ఘోర ఓటమి దరిమిలా విచ్ఛిన్నం అంచుకు చేరింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు సీట్లే దక్కడం, ఆ పార్టీతో కలిసి పోటీ చేసిన ఆర్జేడీకి గట్టి ఎదురుదెబ్బ తగలడం ఇండి కూటమిలోని పార్టీలను పునరాలోచనలో పడేసిందని పరిశీలకులంటున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నాయని చెబుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయేను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సారథ్యంలో ఏర్పాటైన ఇండి కూటమిలో టీఎంసీ, డీఎంకే, ఎస్పీ, ఎన్‌సీపీ, ఆర్జేడీ, ఆప్, శివసేన(యూబీటీ), జేఎంఎం, వామపక్షాలు కీలక భాగస్వామ్య పక్షాలు. వీటిలో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్ దాదాపు దూరమయ్యాయి. బిహార్ ఫలితాలతో తమిళనాడులో కాంగ్రెస్‌తో కొనసాగే విషయంలో స్టాలిన్ పునరాలోచనలో పడినట్లు సమాచారం. యూపీలోనూ కాంగ్రెస్‌తో కాకుండా ఒంటరిపోరుకే ఎస్పీ అధినేత అఖిలేష్ సన్నద్ధమవుతున్నారని తెలుస్తోంది. త్వరలో జరగనున్న బృహన్ ముంబై మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా బరిలో దిగాలని ఇండి కూటమి పార్టీలు యోచిస్తున్నాయి. ఇండి కూటమికి నూకలు చెల్లినట్లేనన్న అభిప్రాయం బలపడటానికి ఇవన్నీ సంకేతాలని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

పదోసారి సీఎంగా నితీశ్.. నేడు ప్రమాణం

పట్నా, నవంబరు19: బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ పదోసారి ప్రమాణం చేయనున్నారు. పట్నా గాంధీ మైదానంలో గురువారం ఉదయం పదకొండున్నర గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, సీనియర్ నేతలు హాజరుకానున్నారు. మరోవైపు కొత్తగా ఎన్నికైన ఎన్డీయే ఎమ్మెల్యేలు బుధవారం ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా నితీశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందుతోందని, ఈ సారి బిహార్ మరింత త్వరగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని చెప్పారు. అనంతరం ఎన్డీయే నేతలు తోడు రాగా నితీశ్ సీఎం పదవికి రాజీనామా చేసి రాజీనామా పత్రాన్ని బిహార్ గవర్నర్ ఆరిఫ్ ఖాన్‌కు అందజేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

ఎన్నికల ఫలితాలతో నిద్రపట్టడం లేదు

జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్

పట్నా, నవంబరు 19 : బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి తనకు సరిగ్గా నిద్రపట్టడం లేదని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్(పీకే) పేర్కొన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 3.5% ఓట్లు మాత్రమే సాధించిన జన్ సురాజ్ పార్టీ ఘోరంగా విఫలమైంది. ఈ నేపథ్యంలో ఎన్‌డీటీవీతో మాట్లాడిన ప్రశాంత్ కిశోర్.. తమ పార్టీకి ఇలాంటి ఫలితం వస్తుందని ఊహించలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో తాను పోటీ చేయకపోవడం కూడా తమ పార్టీకి నష్టం కలిగించిందని తెలిపారు. బిహార్ రాజకీయాలపై ముద్ర వేసేందుకు 10 ఏళ్లు కేటాయించగా అందులో మూడున్నరేళ్లు గడిచిపోయాయన్న ప్రశాంత్ కిశోర్.. ఓడిపోయినప్పటికీ తన ప్రయత్నం కొనసాగిస్తానని వెల్లడించారు.

'అమరత్వం కాదు మహా పాపం'

ఢిల్లీ పేలుళ్ల దాడి నిందితుడి వీడియోపై ఒవైసీ స్పందన

హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబ్ బ్లాస్ట్ నిందితుడు డాక్టర్ ఉమర్ నబీ.. ఆత్మాహుతి దాడులను సమర్థించేలా రూపొందించిన ఓ సెల్ఫీ వీడియోపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. "ఇస్లాంలో ఆత్మహత్య నిషిద్ధం. అమాయకుల్ని చంపడం మహా పాపం. ఇది దేశ చట్టాలకు, మానవతా విలువలకు పూర్తిగా విరుద్ధం. ఇలాంటి చర్యను అమరత్వమని సమర్థించడం అంటే ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చినట్లే" అని ఆయన స్పష్టం చేశారు. పేలుళ్ల నిందితుడు ఉమర్ తన వీడియోలో ఆత్మాహుతి దాడిని 'అమరత్వాన్ని పొందడం కోసం చేసే చర్య'గా అభివర్ణించాడు.

బెంగళూరులో పట్టపగలే 7 కోట్లు దోపిడీ

ఏటీఎంలలో నగదు నింపే వాహనం లూటీ

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే దొంగల ముఠా బరితెగించింది. ఏటీఎంలలో నగదును నింపే సీఎంఎస్ సంస్థ వాహనం నుంచి రూ. 7.11 కోట్ల నగదును దోచుకుంది. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. జేపీ నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి నగదు తీసుకుని సీఎంఎస్ సంస్థ (జీజే01హెచ్‌టీ 9173) వాహనంలో సిబ్బంది వెళుతుండగా జయనగర్ సౌత్ ఎండ్ సర్కిల్‌లో 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అనే స్టిక్కర్ అతికించి ఉన్న కేఏ03 ఎన్‌సీ 8052 నంబరు ఇన్నోవా కారు వచ్చి అడ్డగించింది. తాము ఐటీ అధికారులమని బెదిరించి, డ్రైవర్ మినహా గన్‌మన్, మరో ఉద్యోగిని వాహనం నుంచి దించేశారు. ముఠాలోని ఇద్దరు వ్యక్తులు నగదు ఉన్న సీఎంఎస్ వాహనంలోకి ఎక్కి డెయిరీ సర్కిల్‌లోని జయదేవ ఆసుపత్రి వైపు మళ్లించారు. అక్కడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సీఎంఎస్ వాహనాన్ని ఆపి, అందులోని నగదును ఇన్నోవా కారులోకి మార్చారు. తర్వాత తమ కారులో ఆ ముఠా పారిపోయింది. దొంగల ముఠా కారును గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. అయితే ఇన్నోవా కారుకు ఉన్న నంబరు నకిలీదని తేలింది.

జియో 5జీ ఫోన్లలో ఉచితంగా జెమినీ.3

న్యూఢిల్లీ, నవంబరు 19: జియో సంస్థ తమ నెట్‌వర్క్‌లోని 5జీ వినియోగదారులందరికీ గూగుల్ జనరేటివ్ ఏఐ చాట్ బాట్ అయిన 'జెమినీ.3'ని ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది లేటెస్ట్ వర్షన్. వినియోగదారులు ఈ చాట్‌బాట్‌ను 18నెలల పాటు ఉచితంగా వాడుకోవచ్చని జియో సంస్థ తెలిపింది. నిజానికి జెమినీ ప్రో ప్యాకేజీని వినియోగదారులు ప్రత్యేకంగా తీసుకోవాలంటే రూ.35,100 ఖర్చు అవుతుందని, కానీ జియో అన్‌లిమిటెడ్ 5జీ వినియోగదారులకు 18నెలల పాటు ఇది ఉచితంగా అందుబాటులో ఉంటుందని వివరించింది. వినియోగదారులు మై జియో యాప్‌లోకి వెళ్లి 'క్లెయిమ్' ఆప్షన్‌పై క్లిక్ చేస్తే వెంటనే వారిఫోన్లలో జెమినీ 3 యాక్టివేట్ అవుతుందని పేర్కొంది.

హంతకుడిని పట్టించిన ల్యాప్‌టాప్

అమెరికాలో ఆంధ్రా మహిళ హత్య కేసులో ట్విస్ట్



శశికళ, అనీశ్ సాయి

న్యూఢిల్లీ/పర్చూరు, నవంబరు 19: అమెరికాలో ఎనిమిదేళ్ల క్రితం హత్యకు గురైన ఆంధ్రప్రదేశ్ మహిళ నర్రా శశికళ, ఆమె కుమారుడి హత్య కేసులో ట్విస్ట్ చోటుచేసుకుంది. శశికళ భర్తతో కలిసి పనిచేసే నజీర్ హమీదే అసలు హంతకుడని తాజాగా గుర్తించారు. అతని ల్యాప్‌టాపే అతన్ని పట్టించింది. బాపట్ల జిల్లా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన నర్రా హనుమంతరావు కాగ్నిజెంట్‌లో పనిచేస్తూ నూజెర్సీలోని మేపుల్ షేడ్‌లో తన అపార్టుమెంట్‌లో భార్య శశికళ (38), కుమారుడు అనీశ్ సాయి (6)తో కలసి నివసించేవారు. 2017 మార్చి 23న శశికళ, అనీశ్ హత్యకు గురయ్యారు. పోలీసులు.. తొలుత భర్తనే అనుమానించారు. కానీ ఆధారాల్లేకపోవడంతో విడిచిపెట్టారు. అయితే, హత్య జరిగిన ప్రదేశంలో వేరొకరి రక్తం, డీఎన్ఏను అధికారులు కనిపెట్టారు. దర్యాప్తు క్రమంలో హనుమంతరావుకు, కాగ్నిజెంట్ సహోద్యోగి నజీర్ హమీద్‌కు భేదాభిప్రాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హత్య జరిగిన 6నెలల తర్వాత హమీద్ అమెరికా వదిలి భారత్‌కు వచ్చేశాడు. అప్పటి నుంచి ఇక్కడే నివసిస్తూ కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కొనసాగిస్తున్నాడు. హత్య కేసులో విచారించేందుకు హమీద్ డీఎన్ఏ నమూనాను సేకరించడానికి అమెరికా అధికారులు భారత అధికారులను సంప్రదించారు. కానీ హమీద్ నిరాకరించాడు. అయితే అతని ల్యాప్‌టాప్ నుంచి డీఎన్ఏ నమూనా సేకరించడానికి 2024లో కోర్టు నుంచి అనుమతి పొంది.. హమీద్ ల్యాప్‌టాప్‌ను పంపాలని కాగ్నిజెంట్‌ను కోరారు. వారు పంపిన మీదట ల్యాప్‌టాప్ ఆధారంగా హమీద్ డీఎన్ఏను, హత్య ప్రదేశంలో కనుగొన్న నెత్తుటి నమూనాలను సరిపోల్చారు. ఆ గుర్తుతెలియని నెత్తురు నమూనా హమీద్‌దేనని గుర్తించారు. దీనితో తాజాగా అతనిపై కేసు నమోదు చేశారు.

అల్ ఫలాహ్ నుంచి 10 మంది పరారీ



వారికోసం గాలిస్తున్న దర్యాప్తు సంస్థలు

వర్సిటీ వ్యవస్థాపకుడు సిద్దిఖీకి 13 రోజుల రిమాండ్

న్యూఢిల్లీ, నవంబరు 19: ఫరీదాబాద్ జైషే మహ్మద్ ఉగ్ర మాడ్యూల్‌కు స్థావరంగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ, దాని సమీప గ్రామం నుంచి 10 మంది వ్యక్తులు కనిపించకుండా పోయారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడి జరిగినప్పటి నుంచి వీరి ఆచూకీ లభించటం లేదని ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. అజ్ఞాతంలోకి వెళ్లినవారిలో వర్సిటీ బోధనా సిబ్బందితోపాటు పలువురు విద్యార్థులు, సమీప గ్రామస్తులు ఉన్నట్లు వెల్లడించాయి. వీలైనంత త్వరగా వీరిని వెతికి పట్టుకోవాలని హరియాణా పోలీసులకు ఆ రాష్ట్ర డీజీపీ ఓపీ సింగ్ ఆదేశాలు జారీచేశారు. వీరికి ఫరీదాబాద్ ఉగ్ర వైద్యుల ముఠాతో సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు, భారత్‌లో ఆత్మాహుతి దాడులు జరిపేందుకు పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ విరాళాలు సేకరించినట్లు వెల్లడైంది. పాక్‌కు చెందిన 'సదా' యాప్ ద్వారా ఈ విరాళాలు సేకరించినట్లు గుర్తించారు. మరింత మంది ఆత్మాహుతి బాంబర్లను తయారుచేసేందుకు ఒక్కొక్కరు రూ.20,000 పాకిస్థానీ రూపాయలు ఇవ్వాలని జైషే మహ్మద్ సంస్థ పెద్దలు పాక్‌లో పిలుపునిచ్చినట్లు పోలీసుల అదుపులో ఉన్న అల్ ఫలాహ్ వైద్యురాలు షాహీన్ వెల్లడించినట్లు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. కాగా, ఢిల్లీ బాంబు దాడిపై వార్తలు ప్రసారం చేసేటప్పుడు స్వీయ నియంత్రణ, విచక్షణ పాటించాలని టీవీ చానళ్లకు కేంద్ర ప్రసార శాఖ సూచించింది. కొన్ని చానళ్లు ఈ దాడిని సమర్థించేలా వార్తలు ప్రసారం చేస్తున్నాయని, బాంబులు ఎలా తయారు చేయాలనే అంశాలను కూడా చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేసింది.ఇలాంటి వార్తలు ప్రసారం చేయొద్దని కోరింది.

అల్ ఫలాహ్‌లో రూ.415 కోట్ల అక్రమాలు

అల్ ఫలాహ్ యూనివర్సిటీ యాజమాన్యం 2014-15 నుంచి 2024-25 వరకు అక్రమంగా రూ.415 కోట్లు సంపాదించిందని అల్ ఫలాహ్ గ్రూప్ ఛైర్మన్ జావేద్ అహ్మద్ సిద్దిఖీ రిమాండ్ రిపోర్టులో ఈడీ కోర్టుకు తెలిపింది. వర్సిటీకి గుర్తింపు రాకముందే నకిలీ గుర్తింపుతో విద్యార్థులను చేర్చుకొని భారీగా ఫీజులు వసూలు చేసిందని, వాటిని విరాళాలుగా లెక్కల్లో చూపిందని వెల్లడించింది. ఈ అంశంలో మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సిద్దిఖీని తమకు అప్పగించాలని కోరింది. దీంతో ఆయనను కోర్టు 13 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించింది. ఇదిలా ఉండగా, ఎర్రకోట వద్ద కారుబాంబు దాడికి పాల్పడిన ఉమర్ నబీ.. కారులోనే బాంబును అసెంబుల్ చేసినట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. అతడు దాడికి ముందు ఎర్రకోట పార్కింగ్ కాంప్లెక్స్‌లో మూడు గంటలపాటు ఉన్నట్లు సీసీకెమెరాల్లో రికార్డయ్యింది. ఆ సమయంలో ఒక్కసారి కూడా అతడు కారు దిగలేదు. ఆ మూడు గంటలు అతడు విడిభాగాలను కలిపి బాంబును తయారుచేశాడని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

పాక్ నేత ప్రేలాపనలు

ఎర్రకోట బాంబు దాడిపై పాకిస్థాన్‌కు చెందిన రాజకీయ నాయకుడు చౌదరి అన్వరుల్ హక్ అవాకులు చెవాకులు పేలాడు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'మీరు బలూచిస్థాన్‌లో రక్తపుటేరులు పారిస్తే, మేము ఎర్రకోట నుంచి కశ్మీర్ అడవుల వరకు దాడులు చేస్తామని నేను గతంలోనే చెప్పాను. మన యోధులు ఆ పని చేసి చూపారు. వాళ్లు (భారత్) ఇప్పటికీ శవాలను లెక్కబెట్టుకోలేక పోతున్నారు' అని పేర్కొన్నాడు.

పాక్, బంగ్లాదేశ్, యూఏఈ, చైనాల్లో వైద్య విద్య అభ్యసించిన వారిపై దృష్టి

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఇటీవల కారు పేలుడు సంభవించడం, దీని వెనుక కొందరు వైద్యుల హస్తం ఉందని గుర్తించిన కేంద్రదర్యాప్తు సంస్థలు మరింత అప్రమత్తమయ్యాయి. చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, యూఏఈలలో వైద్య విద్య అభ్యసించిన వారిని విచారించాలని, నిఘా పెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆయా దేశాల్లో వైద్య విద్య అభ్యసించిన వారికి డాక్టర్ టెర్రర్ మాడ్యూల్ పరిజ్ఞానం ఉందా?.. ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారించనున్నాయి. సీబీఐ, ఢిల్లీ పోలీసులు సహా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, యూఏఈలలో వైద్య విద్య అభ్యసించిన వారి వివరాలను కొంత మేరకు సేకరించారు. అదేవిధంగా అన్ని వైద్యశాలలు, నర్సింగ్ హోమ్‌లు మరిన్ని వివరాలను అందించాలని కోరినట్టు దర్యాప్తు సంస్థ అధికారి ఒకరు తెలిపారు. ఆయా దేశాల్లో వైద్య పట్టాలు పొందిన వారి ప్రవర్తన, అందిస్తున్న సేవలు వంటివాటిని తమకు అత్యవసరంగా ఇవ్వాలని ఆయా సంస్థలను కోరినట్టు చెప్పారు. "ఆ నాలుగు దేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన వారి నేర చరిత్ర, వారి ఆర్థిక లావాదేవీలను కూడా నిశితంగా పరిశీలిస్తాం" అని సదరు అధికారి చెప్పారు.

లోకం తీరు



అసమర్థుడి ఆక్రోశం!

రాహుల్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై 272మంది ప్రముఖుల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, నవంబరు 19: ఎన్నికల కమిషన్‌పై ఓట్ చోరీ ఆరోపణలు చేస్తున్న రాహుల్‌గాంధీని తీవ్రంగా విమర్శిస్తూ.. 272 మంది ప్రముఖులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాహుల్ ఆగ్రహాన్ని.. ఎన్నికల్లో పదేపదే విఫలం అవుతుండడం వల్ల వచ్చిన ఉడుకుమోతుతనంగా, ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠకు భంగం కలిగించడానికి చేస్తున్న ప్రయత్నంగా అభివర్ణించారు. ఈ విషయాన్ని చెప్పడానికి వారు 'ఇంపొటెంట్ రేజ్ (అసమర్థుడి ఆక్రోశం)' అనే పదబంధాన్ని వాడడం గమనార్హం. ఈ ప్రకటనపై సంతకం చేసినవారిలో.. 16 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ అధికారులు 123 మంది, 133 మంది రిటైర్డ్ ఆర్మీ అధికారులు, 14 మంది మాజీ రాయబారులు ఉన్నారు. భారత ప్రజాస్వామ్యంలోని ప్రాథమిక వ్యవస్థలపై విషపూరిత వ్యాఖ్యల ద్వారా దాడి జరుగుతోందని వారు తమ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సాయంపై ఆధారపడితే గ్రీన్ కార్డు బంద్!

న్యూఢిల్లీ, నవంబరు 19: అమెరికాలో గ్రీన్‌కార్డు పొందే ప్రక్రియ మరింత కష్టతరం కానుంది. ప్రభుత్వం అందించే మద్దతుపై ఆధారపడే వలసదారులను అనర్హులుగా గుర్తిస్తూ, వారు గ్రీన్‌కార్డు పొందకుండా నిరోధించడానికి ట్రంప్ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనికి అనుగుణంగా 2022 డిసెంబరు నుంచి అమలులో ఉన్న పబ్లిక్ చార్జ్ నిబంధనలను కఠినతరం చేయడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ఒక ప్రతిపాదనను రూపొందించింది. తక్కువ ఆదాయం, ఆరోగ్య సమస్యలు లేదా పరిమిత వనరులు ఉన్నట్లుగా నిర్ధారించిన దరఖాస్తులను తిరస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

త్వరలో అందుబాటులోకి కొత్త ఆధార్

కార్డుపై ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే.. అడ్రస్ మార్పు ఇక ఈజీ

ఆన్‌లైన్ సమావేశంలో ఉడాయ్ సీఈవో భువనేశ్ కుమార్

న్యూఢిల్లీ, నవంబరు 19: 'ఆధార్ కార్డుదారుని ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉండేలా ఆధార్ కార్డును రూపొందించాలన్న ఆలోచన చేస్తున్నాం. ఇది కార్డుదారుని వ్యక్తి సమాచార దుర్వినియోగాన్ని అరికడుతుంది. ప్రస్తుత చట్టాలకు విరుద్ధంగా అనుసరిస్తున్న ఆఫ్‌లైన్ ధ్రువీకరణ పద్ధతులను నిరుత్సాహపరుస్తుంది' అని ఉడాయ్ సీఈఓ భువనేశ్ కుమార్ తెలిపారు. మరో 18 నెలల్లో పూర్తిగా అమలులోకి వచ్చే వ్యక్తిగత డిజిటల్ సమాచార రక్షణ చట్టానికి అనుగుణంగా త్వరలోనే ఉడాయ్ కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు, హోటళ్లు, ఫిన్‌టెక్ వంటి పలు భాగస్వామ్య సంస్థలతో ఉడాయ్ ఒక సమావేశాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించింది. ఈ సమావేశంలో సీఈఓ మాట్లాడారు. "డిసెంబరులో కొత్త నిబంధనను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. కార్డు మీద ఏ వివరాలైనా ఎందుకు ఉండాలి? అన్నది ఒక ఆలోచన. దానిలో భాగంగానే కార్డుపై ఫొటో, క్యూఆర్ కోడ్. దుర్వినియోగం చేయాలనుకునే వాళ్లు దేనినైనా చేస్తూనే ఉంటారు. ఆఫ్‌లైన్ ధ్రువీకరణ పద్ధతిలో ఆధార్ నంబరును, బయోమెట్రిక్ వివరాలను అట్టిపెట్టుకోవడాన్ని ఆధార్ చట్టం నిరోధిస్తుంది. అయినప్పటికీ అనేక సంస్థలు ఆధార్ కార్డు ఫొటో కాపీని దాచిపెట్టుకుంటూనే ఉన్నాయి. అయితే డిసెంబరు 1నుంచి ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ పద్ధతులను నిరోధించే దిశగా ఉడాయ్ పనిచేస్తుంది. ఆధార్‌ని ఒక డాక్యుమెంటులా ఉపయోగించడం కుదరదు. ధ్రువీకరణను క్యూఆర్ కోడ్‌తో కానీ, ఆధార్ నంబరుతో కానీ చేయాలి. ఉడాయ్ తీసుకువస్తున్న ఈ కొత్త యాప్‌తో చిరునామా, ఫోన్ నంబరు మార్పులు చేర్పులను స్వయంగా చేసుకోవచ్చు. ఈ యాప్‌లోని ఫేస్ అథెంటికేషన్ ఫీచర్ దీనిని సులభతరం చేస్తుంది. ఎం ఆధార్ యాప్ స్థానంలో వచ్చే ఈ సరికొత్త యాప్ వివిధ ప్రాంతాల్లో, అవసరాల్లో అథెంటికేషన్, వయస్సు ధ్రువీకరణ ప్రక్రియను మరింత సులభతరం చేస్తుంది" అని భువనేశ్ వివరించారు.

నాగరిక సమాజంలో ఇలాంటివి అనుమతిస్తామా?

'తలాఖ్-ఎ-హసన్'పై జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ, నవంబరు 19: తలాఖ్ ప్రక్రియలో ఒక విధానమైన 'తలాఖ్-ఎ-హసన్'ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా ఆక్షేపించారు. '2025లో ఇలాంటి దానిని ఎలా అనుమతిస్తారు? మతం ఎంత మంచిదైనా ఈ రకమైన దానిని ఎలా ఆంగీకరిస్తారు? మహిళల ఆత్మగౌరవాన్ని దీని ద్వారా కాపాడగలమా? ఒక నాగరిక సమాజంలో ఇటువంటి ధోరణులు ఉండవచ్చా? తీవ్రమైన వివక్షాపూరిత విధానాలు కొనసాగుతున్నప్పుడు కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుంది' అని పేర్కొన్నారు. నెలకొకమారు చొప్పున మూడు నెలలపాటు వరుసగా తలాఖ్ చెప్పి భార్యకు భర్త విడాకులు ఇవ్వటాన్ని 'తలాఖ్-ఎ-హసన్' అని అంటారు. ఇస్లామిక్ పర్సనల్ లా దీనికి అనుమతిస్తోంది. ఈ ప్రక్రియను రద్దు చేయాలన్న పిల్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేసే అంశాన్ని పరిశీలిస్తామని, ఈలోపు సంబంధిత భాగస్వామ్యపక్షాలు ముఖ్యమైన వాదనలతో కూడిన నోట్స్‌ను సమర్పించాలని తెలిపింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ 'తలాఖ్-ఎ-హసన్'ను తీవ్రంగా తప్పుపట్టారు. కాగా, జర్నలిస్టు బెనజీర్ హీనా 2022లో ఈ పిల్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. తన భర్త ఈ విధంగానే విడాకులు ఇచ్చి మరో పెళ్లి చేసుకున్నారని.. అయితే, విడాకులు ఇచ్చినట్లుగా ఎటువంటి పత్రాలు లేకపోవటంతో పిల్లల స్కూల్ అడ్మిషన్లతోపాటు పలు సందర్భాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. విడాకులకు లింగం, మతంతో సంబంధం లేని తటస్థ నిబంధనలు రూపొందించాలని కోరారు. తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 26వ తేదీకి వాయిదా వేస్తూ.. హీనా భర్త కూడా హాజరు కావాలని ఆదేశించింది.

పోక్సో కేసులో యడియూరప్పకు సమన్లు

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం సమన్లు జారీ చేసింది. డిసెంబరు 2న కేసు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సాయం కోరి ఇంటికి వచ్చిన బాలికను లైంగికంగా వేధించారని ఆయనపై కేసు నమోదైంది. 2024 ఫిబ్రవరి 2న జరిగిన సంఘటనకు సంబంధించి బాలిక తల్లి సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో యడియూరప్పతోపాటు అరుణ, ఎం.రుద్రేశ్, మరిస్వామికి సమన్లు జారీ అయ్యాయి. ఫిర్యాదిదారుల తరపున ప్రత్యేక ప్రాసిక్యూటర్ అశోక్ ఎస్. నాయక్ వాదనలు వినిపించారు. దీంతో 30 రోజుల్లోగా సాక్షులను విచారించే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి సుజాత సమన్లు జారీ చేశారు. పోక్సో కేసును కొట్టివేయాలని, ఎఫ్‌టీఎస్ జారీ చేసిన సమన్లను రద్దు చేయాలని యడియూరప్ప తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం ఇటీవల కొట్టివేసింది. కోర్టుకు హాజరు కావాలని యడియూరప్పను ఆదేశించింది.

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువుపై నేడు సుప్రీం స్పష్టత!

న్యూఢిల్లీ, నవంబరు 19: చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించడం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు నిర్దేశించడంపై ఐదుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం స్పష్టత ఇవ్వనుంది. గడువు నిర్దేశించడం సబబే నంటూ ఓ వైపు.. అది రాజ్యాంగానికి విరుద్ధమనే వాదనలు మరోవైపు ముసురుకున్న నేపథ్యంలో ధర్మాసనం ఏం చెబుతుందన్నది ఆసక్తిగా మారింది. కోర్టు ఇచ్చే స్పష్టత మేరకు భవిష్యత్తులో దేశ రాజకీయాలు కూడా ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నాయి.



తమిళనాడు ప్రభుత్వ పిటిషన్‌పై..

అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి సుదీర్ఘకాలం జాప్యం చేయడంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దానిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. ఒకవేళ ఆ గడువులోగా నిర్ణయం వెలువరించకుంటే.. ఆ బిల్లులకు ఆమోదం లభించినట్టే భావించవచ్చని పేర్కొంది. దీనితో గవర్నర్ ఆమోదించకుండా పక్కనపెట్టిన పది బిల్లులను చట్టాలుగా నోటిఫై చేస్తూ తమిళనాడు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. అయితే రాజ్యాంగ బాధ్యతల్లో ఉండే రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సరికాదంటూ సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలయ్యాయి. కానీ తాము అప్పీళ్లను విచారించబోమని కోర్టు స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద తనకు సంక్రమించిన అధికారాల మేరకు సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించి.. వివరణ, సలహాలు కోరారు. 'బిల్లులకు ఆమోదం అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను కాదని న్యాయవ్యవస్థ గడువులు నిర్దేశించవచ్చా' అని స్పష్టత కోరారు.

పరస్పర భిన్న వాదనల మధ్య..

రాష్ట్రపతి అడిగిన అంశాలకు సంబంధించి జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదన వినిపించాయి. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయవ్యవస్థ గడువు విధించడం సరికాదని అటార్నీ జనరల్ ఆర్.వేంకటరమణి కోర్టుకు వివరించారు. ఇక కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవని, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి అధికారాల్లో జోక్యం చేసుకోవడం వివిధ వ్యవస్థల మధ్య రాజ్యాంగం చేసిన అధికారాల విభజనను ఉల్లంఘించడమేనని వాదించారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కేంద్ర వాదనను సమర్థించాయి. మరోవైపు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలు గవర్నర్లకు గడువు పెట్టడం సరైనదేనంటూ సుప్రీం తీర్పును సమర్థించాయి. వాదనలన్నీ విన్న ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం సెప్టెంబరు 11న తమ నిర్ణయాన్ని రిజర్వు చేసింది.

ఆదివారం రిటైర్ కానున్న చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం (ఈ నెల 23న) పదవీ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి గవర్నర్లకు గడువు నిర్దేశిస్తూ ఈ ఏడాది మేలో తీర్పు ఇచ్చిన ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ఒకరు. ఇప్పుడీ అంశంపై రాష్ట్రపతి కోరిన మేరకు స్పష్టత ఇవ్వనున్న ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి ఆయనే నేతృత్వం వహిస్తుండటం గమనార్హం. నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేయనుండటంతో.. ఈ అంశంలో ఆయన చరిత్రాత్మక నిర్ణయం వెలువరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కోర్టు తీర్పులకు విరుద్ధంగా చట్టాలా?

(మొదటి పేజీ తరువాయి)

వరసగా ఇచ్చిన తీర్పుల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ట్రైబ్యునళ్ల స్వతంత్రతకు సంబంధించి కోర్టు రూపొందించిన సూత్రాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోగా... వాటిలో స్వల్ప మార్పులు చేసి, చట్టాన్ని అమలు చేయాలనుకోవడం దురదృష్టకరం' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం 137 పేజీల తీర్పులో వ్యాఖ్యానించింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా గతంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై సీజేఐ జస్టిస్ గవాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేసు విచారణను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని అటార్నీ జనరల్ అభ్యర్థించగా.. సీజేఐ తీవ్రంగా స్పందించారు. కేసు విచారణ తుది దశలో ఉండగా, ఇలా అడగడమంటే తన బెంచ్ నుంచి తప్పించుకొనే ఎత్తుగడేనని అన్నారు. అనంతరం విచారణను వాయిదా వేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ కోరగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ చేసేవరకు ఈ కేసులో తీర్పు రాకూడదని కోరుకుంటున్నారా?. అటార్నీ జనరల్‌కు చివరి అవకాశం ఇస్తాం. ఆ రోజు రాకపోతే కేసును ముగించేస్తాం' అని కూడా హెచ్చరించారు. ఈ క్రమంలో బుధవారం ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021లోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. ఈ చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు న్యాయవ్యవస్థ స్వతంత్రతతోపాటు అధికార వికేంద్రీకరణ సూత్రాలను ఉల్లంఘించేలా ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. అలాంటి నిబంధనలను తిరిగి ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. "కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్, 2021 చట్టాన్ని మేం సరిచూశాం. గతంలో కోర్టు రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తెచ్చారు. ఇది రాజ్యాంగ విరుద్ధమే అవుతుంది" అని పేర్కొన్నారు. పదవీ కాలం, అధికారుల ప్రయోజనాలను పరిరక్షించడం అనేవి న్యాయవ్యవస్థ స్వతంత్రతలో కీలక అంశాలని స్పష్టం చేశారు. ఈ విషయమై గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పక్కనపెట్టడానికి వీల్లేదని చెప్పారు. ఈ సందర్భంగా ట్రైబ్యునళ్ల సభ్యుల పదవీకాలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను కోర్టు పునరుద్ధరించింది. ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రైబ్యునల్, కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రైబ్యునల్ సభ్యులు 62 ఏళ్లు వచ్చేవరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. ఇక, ట్రైబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు/అధ్యక్షుల పదవీ విరమణ వయసు 65 ఏళ్ల వరకు ఉంటుందని వెల్లడించింది.

ఇదీ కేసు..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021తో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పీలేట్ ట్రైబ్యునల్‌తో సహా కొన్ని అప్పీలేట్ ట్రైబ్యునళ్లు రద్దయ్యాయి. వీటితోపాటు పలు ట్రైబ్యునళ్ల జ్యుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరిగాయి. అయితే, ఈ చట్ట నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన కోర్టు తీర్పును రిజర్వ్ చేసి బుధవారం వెలువరించింది.

రవి అరెస్టుతో పైరసీ ఆగదు

- ఒకడు పోతే మరొకడు వస్తాడు
- హ్యాకర్లు, హ్యాకింగ్ కొనసాగుతూనే ఉంటాయి
- నేర నివారణే ముఖ్యం: సీవీ ఆనంద్ ట్వీట్

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఐ బొమ్మ నిర్వాహకుడు రవి అరెస్టుతో పైరసీ ఆగుతుందా.. అంటూ నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్న క్రమంలో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సీవీ ఆనంద్ ట్విటర్ వేదికగా స్పందించారు. అతడి అరెస్టుతో పైరసీ ఆగదన్నారు. రవిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత, ఆమె బృందాన్ని, హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్‌ను ఒక పోస్టులో ఆయన అభినందించారు. అలాగే మరో పోస్టులో హ్యాకర్లు, హ్యాకింగ్ కొనసాగుతూనే ఉంటుందని, ఒకరు పోతే మరొకరు వస్తారని, అది కూడా మరింత అధునాతనంగా అంటూ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. కొందరిని అరెస్టు చేశామన్న కారణంగా



పైరసీ లేదా సైబర్ క్రైమ్స్ పూర్తిగా ఆగిపోతాయని అనుకోవడం అసాధ్యమైన ఆశ వంటిదని అభిప్రాయపడ్డారు. పెద్ద సాంకేతిక నైపుణ్యం ఉన్న దొంగల ముఠాలను పట్టుకున్న తర్వాత దొంగతనాలు, చోరీలు, మోసాలు ఆగిపోయాయా? అని ప్రశ్నించారు. మన చేతిలో ఉన్నది నేరం జరగకుండా అప్రమత్తంగా ఉండటమేనని ఆయన పేర్కొన్నారు. తక్షణమే డబ్బు సంపాదించాలనే ఆలోచనను తగ్గించుకోవాలని.. సైబర్ క్రైం పెరగడానికి అదే మూల కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ సైబర్ స్పేస్ ఖాతాలు రక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాన్ని వెంటనే గుర్తించే విధంగా ఉండాలని ఆయన సూచించారు. 'జీవితంలో ఏదీ ఉచితంగా రాదు' అని గతంలో సినీ దర్శకుడు రాజమౌళి చెప్పిన మాటే జీవితానికి సంబంధించిన అసలైన నిజం అని ఆయన అభిప్రాయపడ్డారు.

పోలీసు కస్టడీకి 'ఐ బొమ్మ' రవి

- అనుమతించిన నాంపల్లి న్యాయస్థానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఐ బొమ్మ, బప్పం టీవీ పేరుతో సినిమాల పైరసీకి పాల్పడిన ఇమ్మడి రవిని లోతుగా విచారించేందుకు వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం వాదనలు విన్న కోర్టు రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చేందుకు అనుమతించింది. చంచల్‌గూడ జైల్లో రిమాండులో ఉన్న రవిని గురువారం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తారు. కాగా, భారత పౌరసత్వాన్ని రద్దు చేసుకున్న ఇమ్మడి రవి.. కరేబియన్ దీవుల్లో ఒకటైన సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పౌరసత్వాన్ని తీసుకున్నాడు. దాంతో పోలీసులు కేంద్ర విదేశాంగ శాఖ సహకారంతో ఆ దేశ ఎంబసీకి లేఖ రాసినట్లు తెలిసింది. రవిని సైబర్ కాపీరైట్ ఉల్లంఘన, పైరసీ, చట్ట విరుద్ధమైన బెట్టింగ్ యాప్‌ల ప్రచారం, మనీ లాండరింగ్ అభియోగాలపై అరెస్టు చేశామని ఆ లేఖలో తెలిపినట్లు సమాచారం. నేర నిరూపణ అనంతరం భారత చట్టాల ప్రకారం అతడిని శిక్షించే అవకాశం ఉందని పేర్కొన్నట్లు తెలిసింది.

కాంగ్రెస్‌పై మోదీ కుట్ర

- వారి చెప్పు చేతుల్లో సీబీఐ, ఈడీ, ఈసీ: మహేశ్‌కుమార్ గౌడ్



అచ్చంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తో పాటు నెహ్రూ కుటుంబానికి సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో సీలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి భూస్వాముల చెర నుంచి భూములను విడిపించి లక్షలాది ఎకరాలను సామాన్యులకు పంచిన ఘనత ఇందిరాగాంధీదే అన్నారు. ఈడీ, సీబీఐ, ఎలక్షన్ కమిషన్లను తమ చెప్పు చేతుల్లో ఉంచుకొని, రాష్ట్రాల్లో ఓటు చోరీతో బీజేపీ అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. ఇటీవల బిహార్ ఎన్నికల్లో అదే జరిగిందన్నారు. అనంతరం ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను నాయకులకు అందించారు. అంతకుముందు శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకొని అచ్చంపేటకు వచ్చిన మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ, స్థానిక నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

రేపు తెలంగాణకు రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ/తిరుమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం తెలంగాణలో పర్యటించనున్నారు. సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసే భారతీయ కళా మహోత్సవ్ 2025ను ముర్ము ప్రారంభించనున్నారు. ఈ మహోత్సవంలో గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూలలోని వంటలు, సాంస్కృతిక, కళాత్మక సంప్రదాయాలను ప్రదర్శించనున్నారు. ద్రౌపది ముర్ము తెలంగాణ పర్యటనకంటే ముందు గురువారం తిరుమలకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. 11 గంటలకు తిరుమల నుంచి రాష్ట్రపతి తెలంగాణ పర్యటనకు ప్రయాణంకానున్నారు.

మద్యం స్కాం కేసులో
డీఫాల్ట్ బెయిల్ రద్దు

- ధనుంజయ్‌రెడ్డి బ్యాచ్‌కు హైకోర్టు షాక్
- 26లోగా కోర్టులో లొంగిపోవాలని ఆదేశం

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు హైకోర్టు గట్టి షాకిచ్చింది. ఈ ముగ్గురికీ ఏసీబీ కోర్టు మంజూరు చేసిన డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేసింది. ఈ నెల 26లోగా ఏసీబీ కోర్టు ముందు లొంగిపోవాలని ముగ్గురినీ ఆదేశించింది. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ పిటిషన్ల దాఖలుకు వారికి వెసులుబాటు ఇచ్చింది. ప్రస్తుత పిటిషన్‌లో తాము వ్యక్తం చేసిన అభిప్రాయాలతో సంబంధం లేకుండా మెరిట్స్ ఆధారంగా బెయిల్ పిటిషన్ల పై విచారణ జరిపి నిర్ణయం వెల్లడించాలని ఏసీబీ కోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం తీర్పు వెలువరించారు. వాస్తవానికి ముగ్గురు నిందితులూ ఈ నెల 24లోపు లొంగిపోవాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఆ తర్వాత వారి తరఫు సీనియర్ న్యాయవాదుల అభ్యర్థనతో 26 వరకు అవకాశమిచ్చారు.

మద్యం స్కాంలో..
చెవిరెడ్డి ఆస్తుల జప్తు

మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు, వైసీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ ఆస్తులను ఏపీ ప్రభుత్వం జప్తుచేసింది. మద్యం ముడుపుల సొమ్ముతో అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను జప్తుచేయాలని సిట్ పంపిన ప్రతిపాదనను ఆమోదించింది. చెవిరెడ్డి కుటుంబానికి చెందిన రూ.63.72కోట్లకు పైగా ఆస్తులు జప్తు చేస్తూ రాష్ట్ర హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రిజిస్ట్రేషన్ చేయించిన ఆస్తులతో పాటు నెల్లూరు జిల్లా గూడూరు, పొదలకూరు.. చిత్తూరు జిల్లా పుత్తూరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ల పరిధిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన భార్య, కుమారుల పేర్లతో రిజిస్టరై ఉన్న స్థిరాస్తుల వివరాలు వెల్లడించింది.

సత్యసాయి.. విశ్వప్రేమకు ప్రతిరూపం



సత్యసాయి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మోదీ



సత్యసాయి స్మారక రూ.100 నాణేలు, పోస్టల్ స్టాంపులను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ క్రికెటర్ సచిన్ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రశాంతి నిలయంలో బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. సీఎంతో కలిసి సత్యసాయి స్మారక రూ.100 నాణేలు, పోస్టల్ స్టాంపులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. భగవాన్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సత్యసాయి భౌతికంగా లేకున్నా, ఆయన ప్రేమ మనతోనే ఉందని చెప్పారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారన్నారు. ఆయన బోధనలు 140 దేశాల్లో కోట్ల మందికి మార్గం చూపాయని తెలిపారు. 'మన భారతీయుల జీవన విధానమే సేవ, భక్తి, జ్ఞానం. 'సేవా పరమో ధర్మః' అనేది మన మూల జీవన విధానంలో ఉంది. అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు.. అని సత్యసాయి బోధించారు. ఆయనతో పాటు ఆయన సంస్థలూ అదే పాటిస్తూ వస్తున్నాయి' అని కొనియాడారు. 'సత్యసాయి చేపట్టిన తాగునీరు, వైద్యం, విద్య, విపత్తు నిర్వహణ వంటి సేవలు అనిర్వచనీయం. 3 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపులను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ఉచితంగా వైద్యం అందిస్తున్నారు' అని ప్రశంసించారు. సుకన్య సమృద్ధి యోజన కింద వేల మంది బాలికలకు సత్యసాయి ట్రస్ట్ ఆర్థికసాయం అందిస్తోందని ప్రధాని చెప్పారు. 'వారాణసీ ఎంపీగా అక్కడ 27 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కింద నిధులు జమ చేయించాను. సామాజిక భద్రత కోసం దేశంలో చాలా పథకాలను ప్రారంభించాం. వీటిపై విదేశాల్లోనూ పెద్దఎత్తున చర్చ జరుగుతోంది' అని తెలిపారు. 'సత్యసాయి ప్రేరణతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రతి వ్యక్తి కరుణ, శాంతి, కర్మ విధానాలతో ముందుకెళ్లాలి' అని ప్రధాని పిలుపిచ్చారు. ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ సత్యసాయిబాబా అని సీఎం చంద్రబాబు అన్నారు. భక్తులను ఎంతో ప్రేమగా బంగారూ అంటూ ఆయన పిలిచే పిలుపు ఎప్పటికీ గుర్తుంటుందని చెప్పారు. రూ.550 కోట్లు ఖర్చు పెట్టి ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 1,600 గ్రామాలు, 30 లక్షలకుపైగా జనాభాకు నీరిస్తున్నారని తెలిపారు. బాబా గొప్పతనం గురించి మన దేశ ప్రజలకంటే విదేశీయులే గొప్పగా చెబుతారని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకూ భగవాన్ మన మధ్యలోనే ఉంటారని మంత్రి లోకేశ్ చెప్పారు. తనను చిన్నప్పుడు బాలసత్యసాయి అనేవారని మాజీ క్రికెటర్ సచిన్ గుర్తుచేసుకున్నారు. 2011 వరల్డ్ కప్ సమయంలో బాబా ఫోన్ చేసి, ఒక పుస్తకం పంపారని, అది తనలో విశ్వాసాన్ని పెంచిందని తెలిపారు. భగవాన్ సత్యసాయి బాబా ప్రేమకు, సేవకు, దయకు సరిహద్దులు లేవని ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ అన్నారు.

అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో ఇరుక్కొని ఐదేళ్ల బాలుడి మృతి

- హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడలో ఘటన



హర్షవర్ధన్ (ఫైల్)

యూసుఫ్‌గూడ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అపార్ట్‌మెంట్ లిఫ్ట్ తలుపుల మధ్య ప్రమాదవశాత్తు ఇరుక్కొని ఓ ఐదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. లిఫ్ట్ లోపల ఉన్న కటకటాల గ్రిల్‌కు, బయట ఉన్న చెక్క తలుపునకు మధ్య ఇరుక్కొని నలిగిపోవడంతో మరణించాడు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన బల్లి నర్సినాయుడు, ఐశ్వర్య దంపతులు తమ కుమారులు చైత్వన్, హర్షవర్ధన్(5)తో కలిసి ఎల్లారెడ్డిగూడలోని కీర్తి అపార్ట్‌మెంట్ జి బ్లాక్ ఐదో అంతస్తులో ఎనిమిది నెలలుగా అద్దెకు ఉంటున్నారు. మధురానగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలను తల్లి ఐశ్వర్య బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి తీసుకొచ్చింది. తల్లి, ఇద్దరు కుమారులు ఎప్పటిలాగే తాము నివాసముండే ఐదో అంతస్తుకు లిఫ్ట్‌లో చేరుకున్నారు. ఐశ్వర్య, ఆమె పెద్ద కుమారుడు లిఫ్ట్‌లో నుంచి బయటికి వచ్చారు. కానీ వారి వెనుక ఉన్న హర్షవర్ధన్ లిఫ్ట్‌లో నుంచి బయటకు వచ్చే లోపే.. కింది అంతస్తులో ఎవరో లిఫ్ట్ బటన్ నొక్కడంతో లిఫ్ట్ కిందికి కదిలింది. ఈ క్రమంలో లిఫ్ట్‌కు లోపల ఇనుప గ్రిల్, బయట చెక్క తలుపు రెండింటి మధ్యలో హర్షవర్ధన్ ఇరుక్కుపోయాడు. తల్లి గమనించే లోపే ఇదంతా జరగ్గా నాలుగు, ఐదు అంతస్తుల మధ్యలో ఉండిపోయిన హర్ష అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఘటనా స్థలికి చేరుకున్న 108 సిబ్బంది బాలుడిని పరీక్షించి అప్పటికే మరణించినట్టు వెల్లడించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

24-36 నెలల్లో.. 8 తేజస్‌లు డెలివరీ

- నెమ్మదిగా ప్రారంభించి వేగం పెంచనున్న హాల్

బెంగళూరు, నవంబరు 19: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) రాబోయే 24-36 నెలల్లో ఎనిమిది తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల డెలివరీని ప్రారంభించనుంది. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ)తో ఇటీవల చేసుకున్న ఇంజన్ల సరఫరా ఒప్పందం అనంతరం ఈ తేలికపాటి యుద్ధ విమానాల తయారీపై హాల్ దృష్టిపెట్టింది. ముందుగా వచ్చే రెండు, మూడేళ్లలో 8 తేజస్ ఎంకే1ఏ జెట్లను అందించాలని, ఆ తర్వాత మూడేళ్లపాటు తన వార్షిక ఉత్పత్తిని 24 జెట్లకు పెంచాలనే లక్ష్యంతో హాల్ ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2029 నుంచి తేజస్‌ల ఉత్పత్తి వేగం పుంజుకోనుందని, ఇక ఏడో సంవత్సరంలో 12 జెట్లను తయారు చేస్తుందని, ఆ తర్వాత అదనపు వేరియంట్లను తయారుచేసి డెలివరీని పూర్తిచేస్తుందని పేర్కొన్నాయి. లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్‌సీఏ) తేజస్ ఎంకే1ఏ అనేది భారత్ స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యుద్ధ విమానం. వీటిలో అమెరికాకు చెందిన జీఈ సంస్థ ఇంజన్లను అమర్చనున్నారు.

చేతిలో చిల్లిగవ్వలేక..
ఒడిలో కొడుకు మృతదేహంతో..

- శ్మశాన వాటికలో దిక్కుతోచని స్థితిలో ఓ నిరుపేద తండ్రి
- తన కుమారుడు చనిపోయాడని తెలిసినా రాని కన్నతల్లి
- అంత్యక్రియలకు సాయం చేసిన స్థానికులు, స్వచ్ఛంద సంస్థ
- పాలమూరులో విషాదం..



కుమారుడి మృతదేహంతో స్మశానంలో కూర్చున్న తండ్రి బాలరాజు (ఫైల్)

మహబూబ్‌నగర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పేగు తెంచుకొని పుట్టిన కుమారుడినే భారం అనుకుందా తల్లి. దివ్యాంగుడైన ఆ బాలుడు.. ఏ దిక్కూలేక, ఆదరణ కరువై.. పట్టెడన్నం దొరక్క.. ఆకలికి తాళలేక శుష్కించి చివరికి ప్రాణాలొదిలితే.. విషయం తెలిసి బిడ్డ మృతదేహాన్ని చూసేందుకు కూడా రాలేదా తల్లి! ఈ అమానవీయ ఘటన నారాయణపేట జిల్లాలో వెలుగుచూసింది. మృతుడు జిల్లాలోని కోటకొండకు చెందిన బాలరాజు, శశికళ దంపతుల 14 ఏళ్ల బిడ్డడైన హరీశ్. పుట్టుకతోనే శారీరక, మానసిక వైకల్యంతో హరీశ్ బాధపడుతున్నాడు. కొన్నేళ్ల క్రితం బాలరాజు దంపతులు మహబూబ్‌నగర్‌కు వచ్చి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. కొన్నాళ్లకు ఈ దంపతులకు మరో కుమారుడు కలిగాడు. పెద్ద కుమారుడైన హరీశ్‌కు దివ్యాంగుల కోటాలో పింఛను కోసం పాలమూరులో దరఖాస్తు చేసుకున్నా ఆ ప్రయత్నాలేవో సొంతూర్లోనే చేసుకోవాలని అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఈ క్రమంలో కటిక పేదరికానికి తోడు కుమారుడు హరీశ్ వైకల్యం కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. భార్యను స్థిమితపరిచేందుకు బాలరాజు.. ఆర్నెల్ల క్రితం కోటకొండలో ఉన్న 10 గుంటలను అమ్మి.. వచ్చిన రూ.8లక్షలతో ఆమె కోసం నగలు కొన్నాడు. అయినా భర్తతో గొడవపడుతూనే ఉన్న శశికళ కొన్నిరోజుల క్రితం భర్తను, దివ్యాంగుడైన హరీశ్‌ను వదిలేసి చిన్న కొడుకును చంకనెత్తుకొని ఇంట్లోంచి వెళ్లిపోయింది. భార్య తనను వదిలివెళ్లడాన్ని జీర్ణించుకోలేకపోయిన బాలరాజు మద్యానికి బానిసైపోయాడు. హరీశ్ కోసం పింఛను ప్రయత్నాలనూ మానుకొని.. తనకు ప్రతినెలా వచ్చే కాస్త వేతన డబ్బులను కూడా తాగుడుకు తగలేసేవాడు. దీంతో పూట గడవడం కూడా కష్టమైపోయింది. హరీశ్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ఈనెల 17న హరీశ్ మృతిచెందాడు. అంత్యక్రియల కోసం చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో స్మశాన వాటికలో బిడ్డ మృతదేహాన్ని ఒడిలో పెట్టుకొని ఏడుస్తూ కూర్చుండిపోయాడు. హరీశ్ మృతిపై తల్లి శశికళకు సమాచారమిచ్చినా భర్తతో గానీ, ఆ బిడ్డతో గానీ తనకు సంబంధం లేదని ఆమె స్పష్టం చేసినట్లు తెలిసింది. అయినా కడుపున పుట్టిన కుమారుడిని కడసారి చూసేందుకైనా భార్య వస్తుందనే నమ్మకంతో బాలరాజు ఆ రోజు సాయంత్రం దాకా ఎదురుచూశాడు. స్థానికులు, వీఆర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆయనకు నచ్చజెప్పి.. కొంత ఆర్థికసాయం చేసి అంత్యక్రియలకు ఒప్పించి.. ఆ కార్యక్రమాన్ని జరిపించారు.

పంట నీట మునిగిందని.. రైతు ఆత్మహత్య

అక్కన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన వరి పంట నీట మునిగిందని మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్య పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన రైతు రెక్కల శ్రీనివాస్‌రెడ్డి(54).. తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేశాడు. కోతకు వచ్చే సమయంలో మొంథా తుఫాను ప్రభావంతో పంట మొత్తం నీటిపాలైంది. దీంతో ఈ నెల 13న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బుధవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో సమన్వయలోపం.. కాంగ్రెస్ అక్రమాల వల్లే ఓటమి

డివిజన్ ఇన్‌చార్జులకు చెప్పినా పట్టించుకోలేదు: జూబ్లీహిల్స్ ఫలితంపై బీఆర్‌ఎస్ కార్యకర్తల అభిప్రాయం

- కాంగ్రెస్ దొంగ ఓట్లు వేయించింది
- జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధంకండి: కేటీఆర్
- సమష్టి కృషితో కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేసుకుందాం: హరీశ్





హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'సొంత పార్టీలోని కొందరు నాయకులు, కార్యకర్తలు.. కాంగ్రెస్‌కు కోవర్టులుగా పనిచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయ లోపం.. కాంగ్రెస్ చేసిన అక్రమాల వల్లే జూబ్లీహిల్స్‌లో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. కాంగ్రెస్ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారు.ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ డివిజన్ ఇన్‌చార్జులకు తెలియజేస్తే ఒక్కరూ రాలేదు' అని ఆ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఉపఎన్నికలో ఓటమికి కారణాలపై సమీక్షలో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన బుధవారం తెలంగాణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, పలువురు ఎమ్మెల్యేలు, ఉపఎన్నిక డివిజన్ల ఇన్‌చార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కేటీఆర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అక్రమాలకు పాల్పడటమే కాకుండా.. అధికార కాంగ్రెస్ బీజేపీతో కుమ్మక్కై.. పక్కరాష్ట్రం కర్ణాటకనుంచి మనుషులను రప్పించి దొంగ ఓట్లు వేయించుకుందని ఆరోపించారు. షేక్‌పేట, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో రిగ్గింగ్ చేశారని, పోలీసులను అడ్డంపెట్టుకొని, డబ్బు, మద్యం పంచి అనైతికంగా గెలిచారని విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీశ్రేణులు పనిచేయాలని సూచించారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలకోసం నేటి నుంచే పార్టీశ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, జీహెచ్‌ఎంసీ, ఇతర ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా.. కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీశ్రేణులు సమష్టిగా పనిచేసి కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేసుకుందామన్నారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, బీఆర్‌ఎస్ శ్రేణులను ఇబ్బంది పెట్టినవారిని వదిలేప్రసక్తేలేదని హెచ్చరించారు.

2 వేల కోట్లు ఇవ్వలేదో..!

- మీ కంపెనీ రహస్యాలు బయటపెడతాం
- 'హెటిరో'కు సైబర్ నేరగాళ్ల బెదిరింపులు
- ఇద్దరు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని రూ.లక్షలు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు.. ఇప్పుడు ఏకంగా వేలకోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలను సైతం టార్గెట్ చేస్తున్నారు. తాజాగా ప్రముఖ ఔషధ తయారీ సంస్థ హెటిరోను లక్ష్యం చేసుకున్న సైబర్ నేరగాళ్ల ముఠా.. 'మీ కంపెనీ రహస్యాలు బయటపెడతామ'ంటూ బెదిరించి 250 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.2 వేల కోట్లకు పైనే) డిమాండ్ చేసింది. ఆ సంస్థ ప్రతినిధుల ఫిర్యాదుతో సైబరాబాద్ పోలీసులు ఈ కేసును ఛేదించి.. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సైబర్ నేరాల విభాగం డీసీపీ బీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. ఆగస్టులో హెటిరో సంస్థలో పనిచేసే ఒక సీనియర్ ఉద్యోగికి వరసగా ఈమెయిల్స్ వచ్చాయి. సైబర్ నేరగాళ్లు.. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్‌ఎఫ్‌డీఏ) అధికారులమంటూ ఆ మెయిల్స్‌ను పంపించారు. హెటిరో సంస్థ రహస్య సమాచారం, లొసుగుల వివరాలు తమ వద్ద ఉన్నాయని బెదిరించారు. వాటిని బయటపెట్టకుండా ఉండాలంటే 250 మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే.. ఆ సమాచారాన్ని బయటపెట్టి తీవ్రమైన చర్యలు తీసుకునేలా చేస్తామని, సంస్థ పేరు ప్రతిష్ఠలను దెబ్బతీస్తామని హెచ్చరించారు. దీంతో హెటిరో ప్రతినిధులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు.. ఐపీ అడ్రస్‌లు, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులు గాడి మణికంఠ, యెండపల్లి జెస్సీ సుదర్శన్‌లను గుర్తించారు. నకిలీ ఈమెయిల్ ఐడీలు సృష్టించి, యూఎస్‌ఎఫ్‌డీఏ అధికారులుగా నటించింది వాళ్లేనని నిర్ధారించారు. నకిలీ పత్రాలు, స్ర్కీన్‌షాట్‌లను రూపొందించారని తేల్చారు. యూఎస్‌ఎఫ్‌డీఏ సంప్రదింపుల పేరుతో సిగ్నల్ ప్రైవేట్ మెసెంజర్ యాప్‌ను ఉపయోగించారు. సైబర్ నేరాల కేసుల్లో ఇది సరికొత్తదని డీసీపీ సాయిశ్రీ తెలిపారు.

మాపై తప్పుడు ప్రచారం చేస్తే కేసులు పెడతాం

- దమ్ముంటే ప్రజాక్షేత్రంలో నిలబడి మాట్లాడండి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ బీజేపీని బద్నాం చేస్తున్నాయి: రాంచందర్‌రావు



హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): "దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఎదురుగా నిలబడి సమాధానం చెప్పాలి.. సోషల్ మీడియా వెనుక దాక్కొని అసత్యాలు ప్రచారం చేయొద్దు. ఇప్పటికే బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో తప్పుడు ప్రచారం చేస్తున్న కొన్ని యూట్యూబ్ చానళ్లపై పరువు నష్టం దావా వేశాం. ప్రధాని మోదీ, తమ పార్టీ నేతలపై ఎవరైనా సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తే ఊర్కోం. తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులపై మా పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కేసులు పెట్టి జైలుకు పంపేలా చర్యలు తీసుకుంటాం" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన లీగల్ సెల్, ఐటీ సెల్, సోషల్ మీడియా టీమ్‌ల సంయుక్త సమావేశానికి రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా, తర్వాత విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాన స్రవంతిలో ఉన్న ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా చాలా బాధ్యతగా వ్యవహరిస్తున్నాయని, యూట్యూబ్ చానళ్లు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైతే మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపై విశ్లేషించండి.. కానీ వ్యక్తిగత దాడులు చేయడానికి సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించేది లేదన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కొంత మంది సోషల్ మీడియా సృష్టికర్తలకు నిధులిచ్చి బీజేపీని బద్నాం చేయించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. విపక్షాలు ఎక్కడైనా బీజేపీ నేతలపై తప్పుడు ప్రచారం చేస్తే పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు వెంటనే ప్రతిస్పందించాలన్నారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకూ బలపడుతున్నందునే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఐటీ సెల్, సోషల్ మీడియాల ఫేక్ అకౌంట్ల ద్వారా తమ నేతలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమ పార్టీ జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. యూట్యూబర్లు తమ విశ్వసనీయతను కాపాడుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ తమ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు కేంద్రంపై నిందలు మోపుతోందని మండిపడ్డారు. పత్తి దిగుబడి ఎంత వచ్చినా సీసీఐ కొనుగోలు చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే అదనంగా మరో 100 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ధిక్కార ధర్మం

పాకిస్థాన్‌కు సైనిక పాలకులు కొత్త కాదు. ఆ మాటకొస్తే గతంలో పాకిస్థాన్ గడ్డపై విలసిల్లిన రాజ్యాలు చాలవరకు సైనికాధిపత్యంలో ఉత్థాన పతనాలకు లోనైనవేనని పాకిస్థాన్ చరిత్ర కారుడు ఒకరు పేర్కొన్నారు. ఆ చిన్న రాజ్యాల పాలనా సంప్రదాయాల వారసత్వం ఆధునిక పాకిస్థాన్‌లో సైతం కొనసాగుతున్న దృష్ట్యా ప్రస్తుత పాక్‌ను 'ది ఫీల్డ్ మార్షల్ నేషన్' అనడం సత్యదూరం కాదు.

జనరల్ ఆసీమ్ మునీర్ ఈనాటి పాకిస్థాన్ సరికొత్త కథా పురుషుడు. పాకిస్థాన్ రాజ్యాంగానికి ఇటీవల జరిగిన 27వ సవరణ ఆయన 'ఫీల్డ్ మార్షల్' హోదాను ఒక రాజ్యాంగబద్ధ పదవిగా మార్చివేసింది. త్రివిధ సాయుధ బలగాలపై ఆయనకు సర్వోన్నత అధికారాలను అప్పగించింది. గత వంద సంవత్సరాల కాలంలో ఏ ఆర్మీ జనరల్‌కు లభించని అపార అధికారాలు ఆయన చేతుల్లో కేంద్రీకృతమయ్యాయి. ఈ అపూర్వ అధికార లబ్ధిని 'ప్రజాస్వామ్య బద్ధం'గా సాధించుకోవడం మునీర్ ప్రత్యేకత. జనరల్ జియా స్వప్నించిన, జనరల్ పర్వేజ్ ముషారఫ్ సాధించలేకపోయిన– పౌర పాలనపై సంపూర్ణ సైనిక నియంత్రణను సాధించిన ఘనత ఈ ఫీల్డ్ మార్షల్‌ది. పాక్‌లో అధికారాన్ని కైవసం చేసుకున్న ఏ జనరల్ కూడా ప్రతిష్ఠాత్మకంగా రంగం నుంచి నిష్క్రమించలేదు. మునీర్ కథ కూడా అప్రతిష్ఠాత్మకంగా పూర్ణ విరామానికి చేరవచ్చు. అయితే ఆ లోగా ఈ కొత్త పాక్ సైనిక నియంత నుంచి ఎదురయ్యే హానిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండి తీరాలి.

పాక్ రాజ్యాంగానికి 27వ సవరణ సర్వోన్నత అధికారాలను సైన్యానికి కట్టబెట్టడమే కాకుండా న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తినీ సమాధి చేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల స్వరూపస్వభావాలను పూర్తిగా మార్చివేసింది. రాజ్యాంగ సంబంధిత వివాదాలపై విచారణా ధికారాలను సుప్రీంకోర్టు పరిధి నుంచి తొలగించారు. ఆ విషయాలపై విచారణకు ప్రత్యేక అధికారాలతో ఫెడరల్ కానిస్టిట్యూషనల్ కోర్టు అనే ప్రత్యేక సర్వోన్నత న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిణామంతో హతాశులైన న్యాయవాదులు, న్యాయకోవిదులు 'ఇలాగే అంత మొందుతుంది ప్రపంచం/ దబేల్మని కాదయ్యా/ కిర్రుమని మూలుగుతూ' అన్న టి.ఎస్.ఎలియట్ మాటలను ఉటంకిస్తూ సుప్రీంకోర్టుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు! న్యాయమూర్తుల నియామకాల బాధ్యత కార్యనిర్వాహక వర్గానిదే అయినప్పటికీ సంబంధిత నిర్ణయాలను నామమాత్ర పౌర ప్రభుత్వం వెనుక సమస్త అధికారాలను చెలాయించే సైనిక పాలకుడే ప్రభావితం చేస్తాడనడంలో సందేహం లేదు.

పాకిస్థాన్ సమాజంలో మొదటి నుంచీ సైనిక పాలకులను ధైర్యంగా ధిక్కరించి, ఎదిరించి న్యాయవ్యవస్థ స్వతంత్రతను, పౌర హక్కులను కాపాడిన ప్రశస్త చరిత్ర న్యాయవాదులు, న్యాయమూర్తులకు ఉన్నది. ఆ సమున్నత ధిక్కార సంప్రదాయాన్ని పాటిస్తూ ప్రస్తుత సందర్భంలోనూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ సయ్యద్ మన్సూర్ అలీ షా, జస్టిస్ అథర్ మినల్లాలు రాజీనామా చేశారు. ఇంకా వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు కూడా రాజీనామా చేశారు. ముఖ్యంగా సీనియారిటీ దృష్ట్యా చీఫ్ జస్టిస్ అయ్యే అవకాశమున్న జస్టిస్ మన్సూర్ అలీ షా తన రాజీనామా లేఖలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు పాక్ ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తున్నాయి. '27వ రాజ్యాంగ సవరణ పాకిస్థాన్ రాజ్యాంగంపై తీవ్రమైన దాడి. అది సుప్రీంకోర్టు సర్వోన్నత ప్రాధాన్యాన్ని తీసివేసింది. న్యాయవ్యవస్థను కార్యనిర్వాహకవర్గ నియంత్రణలోకి నెట్టివేసింది. మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య హృదయాన్ని చీల్చివేసింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఔన్నత్యానికీ, అంతిమ నిర్ణయాధికారానికీ విఘాతం కలిగించడం ద్వారా న్యాయవ్యవస్థ స్వేచ్ఛ, సమగ్రతను కాలరాచివేసి దేశాన్ని దశాబ్దాల వెనక్కి తీసుకువెళ్లింది' అని జస్టిస్ మన్సూర్ అలీ షా గర్హించారు. మన దేశంలో ఎమర్జెన్సీ సమయంలో ఒక కేసులో 'వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కు'ను కాపాడే విషయమై నిర్భయంగా మైనారిటీ తీర్పు వెలువరించి ఇప్పటికీ మన న్యాయ వ్యవస్థకు ఒక నైతిక దీపస్తంభంగా వెలుగొందుతున్న జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నాతో జస్టిస్ మన్సూర్ అలీ షాను పోల్చవచ్చు.

ధిక్కారం నేటి చైతన్య మంత్రం. ప్రపంచవ్యాప్తంగా జెన్ జడ్ తిరుగుబాట్లు, పాక్ న్యాయ వ్యవస్థలో పరిణామాలపై ఉధృతమవుతున్న పోరు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అప్రజాస్వామిక, అమానుష సంకుచితత్వాలు ప్రబలిపోతున్న నేటి ప్రపంచంలో అధికార వ్యవస్థల నిరంకుశపోకడలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం అవ్వాల్సిన కాలమిది. ధర్మాగ్రహం పునాదిగా ఎగసే ధిక్కారం నిర్మాణాత్మకంగా ఉండేలా జాగ్రత్త వహించడం ప్రజలందరి విధి.

బిహార్ తీర్పు ఏ మార్పులకు సంకేతం?

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మీరు ఎలా పరిగణిస్తున్నారు? దేశ రాజకీయాలలో రాబోయే మార్పుల స్వరూప స్వభావాలకు చిహ్నంగానా? బిహార్ ఓటర్ల తీర్పును మీరు అలా చూడాలనే మీడియా అభిలషిస్తోంది సుమా! చకితపరిచిన, అదర గొట్టిన ఆ ప్రజా తీర్పు కేవలం ఒక రాష్ట్ర ప్రజల తీర్పు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ జైత్రయాత్ర పునరారంభానికి ఒక నాంది కూడా. ఇదిగో, ఈ సానుకూల కథనానికి ఒక విరుద్ధ దృక్కోణం కూడా ఉన్నది: ఎన్నికలు అర్థం పర్థం లేనివి. ఎన్నికలలో పాల్గొని, దగాకోరు ఎన్నికలకు శాసనసమ్మతి కల్పించడం ద్వారా ఎన్డీఏ ప్రభుత్వ నిరంకుశాధికార పాలనను మీరు సవాల్ చేయలేరని బిహార్ నిరూపించింది. ఈ రెండు అభిప్రాయాలలో సత్యమూ ఉన్నది, కట్టుకథా ఉన్నది. రాజకీయ వాస్తవికత గురించి విస్తృత, దీర్ఘకాలిక, లోతైన అవగాహనపైనే ఈ సత్యాసత్యాలు ఆధారపడి ఉన్నాయి.



■ యోగేంద్ర యాదవ్

2024 సార్వత్రక ఎన్నికల అనంతరం దేశ రాజకీయ ప్రస్థానంలో 'బిహార్ అసెంబ్లీ ఎన్నికల తీర్పు ఒక ముఖ్యమైన మలుపు' అన్న భావనకు మూడు అంచనాలు ప్రాతిపదికగా ఉన్నాయి: ఒకటి– ఆ తీర్పు అనూహ్యమైనది; రెండు– ప్రబల రాజకీయ ధోరణులను విచ్ఛిన్నం చేసింది; మూడు– ఆగామి రాజకీయ పరిణామాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ మూడూ సందేహాస్పదమైనవే. నిశితంగా పరిశీలిద్దాం. తొట్ట తొలుత మనం గుర్తించవలసిన వాస్తవం: బిహార్ రాజకీయ ప్రస్థానం విశాల భారతదేశానికి కాదు కదా, ఇరుగు పొరుగు హిందీ రాష్ట్రాల రాజకీయ ప్రస్థానానికి కూడా ప్రాతినిధ్యం వహించదు. ఉత్తర భారతావనిలో ఒక సమస్థాయి భాగస్వామితో పొత్తు పెట్టుకోవడానికి బీజేపీకి తప్పనిసరి అయిన ఏకైక రాష్ట్రం బిహార్. ఆ రాష్ట్రంలోని రాజకీయాల వైచిత్రి పొరుగు రాష్ట్రమైన జార్ఖండ్‌లోనే ఏ మాత్రమూ ప్రతిబింబించదు. ఇక బెంగాల్‌ను బిహార్ ధోరణులు ప్రభావితం చేయడమనేది జరగని మాట; రెండు– బిహార్ అసెంబ్లీ ఎన్నికల తీర్పు గత ఏడాది లోక్‌సభ ఎన్నికల ఫలితాలను తారుమారు చేయలేదు. బిహార్‌లో ఎన్డీఏ తన ప్రాబల్యాన్ని కొనసాగించింది. 174 అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్డీఏ, ప్రత్యర్థి కూటమి మహాగఠ్ బంధన్ (ఎమ్‌జీబీ)పై 8 శాతం ఓట్ల ఆధిక్యతతో తిరుగులేని ముందంజలో ఉన్నది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలు ఆ ఆధిక్యతను మరింతగా పెంచాయేకానీ ఏ మాత్రమూ తగ్గించలేదు. రాష్ట్ర శాసనసభలోని 243 సీట్లలో 202 సీట్లను కైవసం చేసుకోవడమనేది నమ్మశక్యంగా కనిపించనప్పటికీ ఎమ్‌జీబీపై 1.2 శాతం పాయింట్ల అదనపు ఓట్ల ఆధిక్యత మూలంగానే అంత అత్యధిక సంఖ్యలో సీట్లను ఎన్డీఏ గెలుచుకోగలిగింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్షాలు ఘోరంగా ఓడిపోయాయి. ఈ దృష్ట్యా బిహార్‌ను ఆ రాష్ట్రాల సరసన చేర్చకూడదు.

బిహార్ రాజకీయాల మౌలిక వాస్తవాలను అర్థం చేసుకున్నవారికి అసెంబ్లీ ఎన్నికల తీర్పు ఊహించనిదేమీ కాదు. 2005 నుంచీ మూడు ప్రధాన పార్టీల– ఆర్‌జేడీ, జేడీ(యూ), బీజేపీ– లలో రెండు పార్టీల సంకీర్ణం, (2020లో మినహా) మంచి మెజారిటీతో గెలుస్తూ వస్తూన్నది. సాధారణ వాస్తవం ఏమిటంటే ప్రత్యర్థి ఎమ్‌జీబీ కంటే ఎన్డీఏ చాలా పెద్ద రాజకీయ సంకీర్ణం. గత అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల శాతాన్ని బట్టి చూస్తే ఎన్డీఏకు 5 పాయింట్ల ఆధిక్యత ఉన్నది. ఎన్డీఏ సామాజిక సంకీర్ణం కూడా ఎమ్‌జీబీ సామాజిక సంకీర్ణం కంటే చాలా పెద్దది. 32 శాతంగా ఉన్న ఎమ్‌జీబీ ప్రధాన మద్దతుదారులు (ముస్లిం+యాదవ్), ఎన్డీఏకు 28 శాతం ప్రధాన మద్దతుదారులైన (అగ్రకులాలు+ కుర్మీ+కుష్వాహ+బనియా/ తెలి+పాశ్వాన్) సామాజిక వర్గాల కంటే అధికమే. అయితే ఎమ్‌జీబీకి సహాయక మద్దతుదారులుగా 10శాతం (మల్లా+రవిదాసి+తన్తి / పాన్) సామాజిక శ్రేణుల జన సంఖ్య, ఎన్డీఏ వైపు మొగ్గే 20 శాతం హిందూ ఈబీసీల కంటే తక్కువ. అంతేకాకుండా ఆ పదిశాతం సామాజిక శ్రేణులలో విధిగా ఎమ్‌జీబీకే ఓటు వేసే నిబద్ధత కూడా తక్కువే.

ఎన్డీఏకు మొదటి నుంచీ అనుకూలతలు ఉన్నాయనేది స్పష్టం. సామాజిక సమీకరణాలను మార్చడం లేదా సమస్త కులాల వారినీ ఆకట్టుకునే విధంగా ప్రభావదాయక ప్రచారాన్ని నిర్వహించడం ద్వారా పరిస్థితులను తనకు అనుకూలం చేసుకునే విషయంలో ఎమ్‌జీబీకి మరింత బరువు బాధ్యతలు ఉన్నాయి. ఈ దిశగా ప్రతిపక్ష కూటమి కొన్ని ప్రయత్నాలు చేయక పోలేదు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వోద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే చాలా ఆలస్యంగా ఇచ్చిన ఆ హామీలు చాలా స్వల్ప ప్రభావాన్ని మాత్రమే చూపాయి. వివిధ పెన్షన్ పథకాల కింద చెల్లించే మొత్తాలను పెంచడమే కాకుండా విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు ప్రతి మహిళకు రూ.10 వేలు చెల్లించడం ఎన్డీఏ విజయానికి విశేషంగా దోహదం చేసింది. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తొలుత అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళా ఓటర్లను తిరుగులేని మద్దతు దారులుగా చేసుకోవడానికి చేసిన వివిధ ప్రయత్నాలు కూడా బాగా కలిసివచ్చాయి. ఈ వాస్తవాలతో పాటు నితీశ్‌కుమార్ విషయంలో ప్రభుత్వ వ్యతిరేకత తక్కువగా ఉండడం కూడా ఎన్డీఏ ఘన విజయానికి దోహదం చేసింది.



> బిహార్‌లో ప్రతిపక్షాలు ఘోరంగా ఓడిపోయాయి. భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ఆరాటపడుతున్నవారికి ఇది ఒక పెద్ద విఘాతమే. అయితే భవిష్యత్తు నిరాశాజనకంగా ఉన్నదని భావించనవసరం లేదు. పశ్చిమ బెంగాల్లో జరగనున్న ఎన్నికలు ఎన్నికల నైతికతకు మెరుగైన పరీక్షగా భావించవచ్చు. దేశ రాజకీయాలలో రాబోయే మార్పులకు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిజమైన సంకేతాలు.

రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్ ప్రతి విషయంలోనూ విఫలమయ్యాయని, బీజేపీ చాలా నైపుణ్యంతో వ్యవహరించిందని మనం భావించనవసరంలేదు. తీర్పు కలిగించిన విస్మయం, దిగ్భ్రాంతి మీడియా కల్పించినవే. ఎన్డీఏ సర్కార్ మళ్లీ గెలవడంపై పలువురు విమర్శకులకు కలిగిన దిగ్భ్రాంతి సరైన ప్రతిస్పందన కాదని నేను భావిస్తున్నాను. బిహార్ పరిణామాలను సుదూర ప్రదేశాలలో ఉండి, సామాజిక మాధ్యమాల ద్వారా గమనిస్తున్న వారికి ఎమ్‌జీబీ ముందంజలో ఉన్నదనేది తప్పుడు భావనే అని చెప్పి తీరాలి. సరే, బిహార్ ఎన్నికల అంతిమ ఫలితం అనుమానాలకు తావిచ్చింది. ఈసీఐ తీరుతెన్నులలో లోపించిన విశ్వసనీయత, పాలక కూటమికి సానుకూలంగా ఎన్నికల ఫలితం ఉండేలా చేసేందుకు ప్రయత్నించడం మొదలైన కారణాలు ఆ అనుమానాలకు తావిచ్చాయి. ఆ సందేహాలతోనే కొన్ని వర్గాలు ఇప్పటికే ఎన్నికల బాయ్‌కాట్‌కు పిలుపునిచ్చాయి.

నిష్పాక్షికత లోపించిన ఎన్నికలు, మోసపూరిత ఎన్నికల మధ్య భేదాన్ని చూడవలసిన అవసరమున్నది. మన దేశంలో ఎన్నికలు ఇంకెంత మాత్రం నిష్పాక్షికంగా జరగడం లేదనడంలో సందేహం లేదు. ఎన్నికలలో పోటీ చేస్తున్న వారందరికీ సమాన అవకాశాలు కల్పించడం జరగడమే లేదు అందుకు బిహార్ ఎన్నికలే సమృద్ధమైన రుజువులు సమకూరుస్తున్నాయి. వ్యవస్థీకృత పక్షపాతం, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణతో తొలుత 68 లక్షల ఓటర్ల పేర్లు, ఆ తరువాత అదనంగా మరో 24 లక్షల మంది ఓటర్లను తొలగించడమే అందుకు నిదర్శనం. ఎన్నికల నిబంధనావళిని పాలక కూటమి భాగస్వామ్య పక్షాలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ఈసీఐ ఏ విధంగాను ఆక్షేపించలేదు. మతతత్వ ప్రచారం, అక్రమ వలసదారుల స్వాభిప్రాయ బద్ధమైన ఆరోపణలు, పోలింగ్‌కు ముందు ప్రతి మహిళా ఓటరుకు రూ.10వేలు ఇవ్వడం, ఓటర్లను తీసుకురావడానికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను బీజేపీ నడపడం మొదలైన వాటిని ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. పత్రికలు, ప్రసార సాధనాలపై పాలక కూటమికి అసాధారణ నియంత్రణతో పాటు అపార ఆర్థిక వనరులు ఉండడం చూస్తే ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎందుకు జరగడం లేదో అర్థమవుతోంది. ఇటువంటి పరిస్థితులలో కూడా ప్రతిపక్షాలకు అసలు విజయావకాశాలు లేవని చెప్పలేం. అయితే అవి దుస్సాధ్యమైన కార్యాన్ని సాధించేందుకు కృతనిశ్చయంతో పూనుకోవలసి ఉన్నది. ఓటింగ్ సరళిని నేర్పుగా అనుకూలం చేసుకోవడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో జోక్యం చేసుకోవడం మొదలైన వన్నీ ఎన్నికల వంచనే. పోలింగ్‌లో పాల్గొన్న మొత్తం ఓటర్ల సంఖ్యను ఆలస్యంగా వెల్లడించడం, పోస్టల్, ఈవీఎమ్ ఓట్ల మధ్య వ్యత్యాసాలు, ఓటర్ జాబితాల నుంచి అత్యధిక ఓటర్ల తొలగింపు మొదలైనవాటిని అందుకు రుజువులుగా చూపవచ్చు. అయితే ఈ అక్రమాలకు గట్టి సాక్ష్యాధారాలు లేవు. ఈ కారణంగా ఎన్నికల వంచన జరిగిందని ఘంటాపథంగా చెప్పేందుకు బిహార్‌ను నిదర్శనంగా చెప్పలేము. ప్రతిపక్షాలు ఘోరంగా ఓడిపోయాయి. భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ఆరాటపడుతున్నవారికి ఇది ఒక పెద్ద విఘాతమే. అయితే భవిష్యత్తు నిరాశాజనకంగా ఉన్నదని భావించనవసరం లేదు. పశ్చిమ బెంగాల్లో జరగనున్న ఎన్నికలు ఎన్నికల నైతికతకు మెరుగైన పరీక్షగా భావించవచ్చు. దేశ రాజకీయాలలో రాబోయే మార్పులకు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిజమైన సంకేతాలు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

గ్రంథాలయాలు డిజిటల్ మెట్టు ఎక్కాల్సిందే!

ప్రతి ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ, దేశంలోని పౌర గ్రంథాలయాలు నిధుల కొరత, మౌలిక సదుపాయాల లోపం, పాలనాపరమైన నిర్లక్ష్యం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. భారతదేశంలో సుమారు 6.65 లక్షల గ్రామాలు ఉన్నప్పటికీ, రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ (RRLF) లెక్కల ప్రకారం కేవలం 47,000 పబ్లిక్ లైబ్రరీలు మాత్రమే అధికారికంగా నమోదు అయ్యాయి. ఈ సంఖ్య దేశంలోని విశాలమైన జనాభాకు సమాచార, విద్యా సేవలను అందించడానికి ఏ మాత్రం సరిపోదు.

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం, 2022 IFLA–UNESCO పబ్లిక్ లైబ్రరీ మేనిఫెస్టో కనీసం ప్రతి వెయ్యిమందికి ఒక గ్రంథాలయం అవసరం. ఈ నిష్పత్తిని భారతదేశ జనాభా నేపథ్యంలో పరిశీలిస్తే, దేశానికి కనీసం 13 లక్షలకు పైగా పబ్లిక్ లైబ్రరీలు అవసరం. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయాల సంఖ్యతో పోలిస్తే ఈ పరిమాణం దాదాపు 13 రెట్లు ఎక్కువ. సమాచార సమానత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి దేశం ఎంత దూరంలో ఉందన్నది ఈ వ్యత్యాసాన్ని బట్టి అర్థమవుతున్నది.

పలు ప్రపంచ దేశాలు గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని గుర్తించాయి. అమెరికా, ఫిన్లాండ్, సింగపూర్, యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు గ్రంథాలయాలను సమాజ అభ్యాస, సృజనాత్మకత కేంద్రాలుగా అభివృద్ధి చేశాయి. ఈ దేశాలలో ప్రభుత్వ బడ్జెట్‌లో గ్రంథాలయాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆ దేశ ప్రజలు లైబ్రరీలను సామాజిక పెట్టుబడిగా భావించి, వాటిని చదువుకోవడానికేగాక, విశ్రాంతి నిలయంగాను, సామాజిక చర్చా కేంద్రంగాను, సమాచారం ఇచ్చిపుచ్చుకునే స్థావరంగాను ఉపయోగిస్తారు. కానీ భారతదేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధం. ప్రజల్లో చదివే అలవాటు తగ్గి, స్మార్ట్‌ఫోన్లపైనా ఆన్‌లైన్ మీడియాపైనా ఆధారపడే సంస్కృతి పెరుగుతోంది. ముఖ్యంగా యువత పుస్తకాల కంటే ఆడియో విజువల్ కంటెంట్, యూట్యూబ్ పాఠాలు, ఇ–పుస్తకాలు వంటి డిజిటల్ వనరులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. చాలా లైబ్రరీలు ఈ మార్పుకు సాంకేతికంగా సిద్ధంగా లేవు. ఇంటర్నెట్ సదుపాయం, వై-ఫై లేదా ఇ-రిసోర్స్ యాక్సెస్ లేకపోవడం వాటి ఆకర్షణను తగ్గిస్తోంది. దీనితో పఠన సంస్కృతి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా మాయమవుతోంది. కాబట్టి గ్రంథాలయాలు ఇప్పుడు డిజిటల్‌గా అనుసంధానం కావించబడటం చాలా ముఖ్యం.



> నేటి యువత పుస్తకాల కంటే ఆడియో విజువల్ కంటెంట్, యూట్యూబ్ పాఠాలు, ఇ–పుస్తకాలు వంటి డిజిటల్ వనరులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. చాలా లైబ్రరీలు ఈ మార్పుకు సాంకేతికంగా సిద్ధంగా లేవు. ఇంటర్నెట్ సదుపాయం, వై–ఫై లేదా ఇ–రిసోర్స్ యాక్సెస్ లేకపోవడం వాటి ఆకర్షణను తగ్గిస్తోంది. దీనితో పఠన సంస్కృతి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా మాయమవుతోంది. కాబట్టి గ్రంథాలయాలు ఇప్పుడు డిజిటల్‌గా అనుసంధానం కావించబడటం చాలా ముఖ్యం.

2022 IFLA–UNESCO పబ్లిక్ లైబ్రరీ మానిఫెస్టో గ్రంథాలయాల కొత్త విధిని నొక్కి చెబుతూ, అవి ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక భాగస్వామ్యం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో కొనసాగాలని సూచించింది. కోవిడ్–19 మహమ్మారి తర్వాత, రిమోట్ యాక్సెస్ సేవలకు, డిజిటల్ సేవలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రతి వర్గానికి సమాచార సేవలు అందించడం కీలకంగా మారింది. అయితే, భారతదేశంలోని గ్రామీణ పౌర గ్రంథాలయాలలో ఈ రకమైన దూరప్రవేశ సేవలు ఇంకా జనజీవనంలో భాగం కాలేదు.

పౌర గ్రంథాలయాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ (RRLF) నిధుల కేటాయింపులను పరిశీలిస్తే– 2019 నుంచి 2024 వరకు రూ.662 కోట్లు కేటాయించినప్పటికీ, రాష్ట్రాలు వాటిని పూర్తిగా ఉపయోగించుకోలేకపోయాయి. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ (NML) మోడల్ లైబ్రరీ ప్రాజెక్ట్ కింద కేటాయించిన దాదాపు రూ.952 కోట్లలో రాష్ట్రాలు కేవలం రూ.405 కోట్లు మాత్రమే ఉపయోగించుకున్నాయి. అనేక రాష్ట్రాలు గ్రంథాలయ చట్టాల ద్వారా ప్రజల నుంచి గ్రంథాలయ పన్నును వసూలు చేస్తున్నప్పటికీ, ఆ నిధులను గ్రంథాలయాలకు కేటాయించడంలో విఫలమవుతున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్రం దాదాపు రూ.1000 కోట్లు, కర్ణాటక రూ.300 కోట్లు, మహారాష్ట్ర రూ.800 కోట్లు గ్రంథాలయాలకు బాకీ ఉన్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో పౌర గ్రంథాలయాలు సంక్షోభ స్థితికి చేరుకున్నాయి.

ఈ సమస్యలకు పరిష్కారంగా బహుముఖ ప్రయత్నాలు అవసరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, సంస్కృతి, సమాచార శాఖల బడ్జెట్‌లో కనీసం 1 శాతాన్ని గ్రంథాలయ అభివృద్ధికి కేటాయించాలి. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య (PPP) నిధులు, CSR నిధుల ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధిని, సాంకేతిక అప్‌గ్రేడ్‌లను చేపట్టాలి. ప్రతి జిల్లా లైబ్రరీని ఒక డిజిటల్ హబ్‌గా మార్చి, ఆన్‌లైన్ లెర్నింగ్‌ను ఏర్పాటు చేయాలి. స్థానిక భాషా వనరులను అందుబాటులో ఉంచాలి. బుక్ క్లబ్‌లు, రచయితలతో చర్చలు, కెరీర్ మార్గదర్శకత్వం వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా గ్రంథాలయాలను సమాజ కేంద్రాలుగా మార్చాలి. తగిన వెలుతురు, సౌకర్యవంతమైన కుర్చీలు, ఎయిర్ కండీషనింగ్, వేగవంతమైన వై–ఫైతో కూడిన ఆధునిక భవనాలను ఏర్పాటు చేయాలి. గ్రంథాలయాలు మల్టీపర్పస్ సెంటర్లుగా (బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, బీచ్‌లలో) కూడా విస్తరించాలి.

"పుస్తకాలు మనిషి శక్తిని, స్వేచ్ఛను పెంచే ఆయుధాలు" అంటారు బి.ఆర్ అంబేడ్కర్. ఈ దృక్పథంతో, భారతదేశం తన గ్రంథాలయ వ్యవస్థను పునరుద్ధరించుకోవాలి. ప్రజా గ్రంథాలయాల పునరుద్ధరణ కేవలం విద్యాపరమైన అవసరం మాత్రమే కాదు, సమాన అభ్యాస అవకాశాలపై ఆధారపడిన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అత్యవసరం.

• రవి కుమార్ చేగొని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం
(జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా)

నైపుణ్యం కలిగిన వృత్తులకే భవిష్యత్తు

'దశాబ్దాలుగా మన సమాజం 'డెస్క్ ఉద్యోగాలే గొప్పవి' అనే భ్రమలో జీవించింది. కానీ ఇప్పుడు ఏఐ తెచ్చిన మార్పులు ఆ భ్రమను చెరిపేస్తున్నాయి' అంటూ ఆనంద్ మహీంద్రా తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఏఐతో భర్తీ చేయడం సాధ్యం కానివి నైపుణ్యం కలిగిన వృత్తులు. ప్లంబర్ చేతితో సరిచేసే లీకేజీలు, ఎలక్ట్రీషియన్ పరిష్కరించే వైరింగ్ సమస్యలు, మెకానిక్ స్వయంగా గుర్తించే లోపాలు.. వంటివి పుస్తకాల్లో నేర్చుకునే సిద్ధాంతాలు కావు. ఇవి ఏఐ ఆల్గారిథమ్‌లు పరిష్కరించలేని పనులు! 'చూడగానే సమస్యను అర్థం చేసుకోవడం, దానికి తక్షణ పరిష్కారం కనుగొనడ'మనే ఈ సహజ బుద్ధి, అనుభవశక్తి, హస్త కౌశలం యాంత్రీకరణకు సాధ్యం కాదు.

'ఫోర్డ్‌లో ప్రస్తుతం 5వేల మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఉద్యోగానికి సంవత్సరానికి 1,20,000 డాలర్ల వరకు జీతం ఇస్తున్నా, సరైన నైపుణ్యం కలిగినవారు దొరకడం లేదు' అని ఫోర్డ్ మోటార్స్ సీఈఓ జిమ్‌ఫార్లీ అనడం చూస్తే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. '2030 నాటికి కేవలం తయారీ రంగంలోనే 21 లక్షల ఉద్యోగాలు భర్తీ కాకుండా మిగిలిపోతాయి' అంటూ డెలాయిట్– మాన్యుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం ఇప్పటికే హెచ్చరించింది. దాంతో వచ్చే ఆర్థిక నష్టం 1 ట్రిలియన్ డాలర్లు అని తెలిపింది. ఇది కేవలం అమెరికాకు మాత్రమే కాదు, ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన సంకేతం.

ఈ పరిస్థితిని అధిగమించడానికి మన దేశంలో చేయాల్సినవి: ప్రైమరీ నుంచి యూజీ వరకూ అన్ని స్థాయిల్లో వృత్తి శిక్షణను తప్పనిసరి చేయాలి. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లలో ప్రపంచ స్థాయి ప్రమాణాలు వృద్ధి చేయాలి. జర్మనీ, జపాన్ వంటి దేశాల వలే నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని గౌరవించడం మనమూ నేర్చుకోవాలి. నైపుణ్యం కలిగిన కార్మికులను ప్రోత్సహించేందుకు మెరుగైన వేతనాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, కెరీర్ గ్రేడేషన్.. వంటివి అందించడం ద్వారా యువతను ఈ రంగం వైపు ఆకర్షించాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఏఐ ఒక పెద్ద సవాల్. కానీ నైపుణ్య వృత్తులకు కాదు. వృత్తి నైపుణ్యం గలవారు లేకుండా ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగదు. విద్యా వ్యవస్థ, ప్రభుత్వం, తల్లిదండ్రులు.. అందరూ ఒక కొత్త దృక్పథాన్ని స్వీకరించాల్సిన సమయం ఇది.

– ముద్దం నరసింహస్వామి

అమెరికాలో మొలకెత్తిన సోషలిస్ట్ ఆశలు

పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకు ప్రపంచ రాజధానిగా భావించే న్యూయార్క్ నగరానికి మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ విజయఢంకా మోగించడంతో ప్రపంచ పెట్టుబడిదారుల ఆశలు అడియాశలయ్యాయి. ఆయన తనను తాను డెమొక్రటిక్ సోషలిస్టును అని ముందుగానే ప్రకటించుకుని ఎన్నికల రణరంగంలోకి రావడంతో పెట్టుబడిదారులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ సహా వేలాది కార్పొరేట్ శక్తులు జోహ్రాన్‌కు వ్యతిరేకంగా నిలబడ్డాయి. జోహ్రాన్ గెలిస్తే నగరాన్ని వదిలేసి వెళ్లిపోతామని వేలమంది పెట్టుబడిదారులు ఉక్రోషం వెళ్లగక్కారు.

పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ వేళ్లూనుకున్న అమెరికాలో తనను తాను సోషలిస్ట్ అని జోహ్రాన్ ప్రకటించుకోవటం ఆషామాషీ కాదు. ఇటువంటి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితికి అక్కడి సమాజమే పురిగొల్పింది. ట్రంప్ పరిపాలన దేశంలో తీవ్ర అసమానతలకు దారితీసింది. దేశంలోని అధిక సంపన్నులకు అనుకూలంగా పన్ను సంస్కరణలను ట్రంప్ మొదలుపెట్టారు. వీటి ఫలితంగా 2027 నాటికి అత్యధిక ఆదాయం ఉన్న 0.1శాతం మంది చెల్లించే పన్నుల్లో నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంలో 3,11,000 యూఎస్ డాలర్లు తగ్గుతాయి. ఈ లోటు తీరేందుకు నెలకు 15వేల డాలర్ల కన్నా తక్కువ ఆదాయం గల కుటుంబాలపైనే పన్ను భారం పడుతుంది. ఇదంతా ఒక శాతం బిలియనీర్లను మరింత సంపన్నులుగా మార్చే ప్రక్రియలో భాగమే. ఈ అంశం కష్టించి పనిచేసే శ్రామిక వర్గంపై పెద్ద ప్రభావాన్ని చూపింది.

సామాజిక భద్రతకు పెట్టాల్సిన ఖర్చుల్లోనూ ట్రంప్ ప్రభుత్వం భారీ కోత విధించింది. ప్రజల సంక్షేమం కంటే లాభాలకే ట్రంప్ ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. కార్పొరేట్ కాలుష్య కారకాల నియంత్రణను తొలగించారు. ప్రజా సేవలను ప్రైవేటీకరిస్తున్నారు. ఈ విధానాల కారణంగా అమెరికాలోని పదిమంది అత్యంత ధనవంతులైన బిలియనీర్లు 698 బిలియన్ డాలర్ల సంపదను పొందారు. ట్రంప్ విధానాలతో పాటు దశాబ్దాలుగా అమెరికా ఇతర పాలకులు అనుసరించిన పెట్టుబడిదారీ విధానాలపట్ల కూడా అక్కడి యువతలో నిరాసక్తత వ్యక్తమవుతూనే వస్తున్నది. 'ఫ్రీ మార్కెట్‌కు మద్దతు' పేరుతో పాలకులు అనుసరిస్తున్న విధానాల కారణంగా అమెరికా సమాజంపైనా, పాలకులపైనా కొద్దిమంది కార్పొరేట్ పెట్టుబడిదారులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారన్న సంగతిని అక్కడి ప్రజలు గ్రహించారు.

తమ దేశంలో కొనసాగుతున్న ఆర్థిక మాంద్యాన్ని నివారించడం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని అమ్ముకునేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తున్నారన్న నిజాన్ని అమెరికా పౌరసమాజం గ్రహించింది. తన మాట వినని దేశాలపై భారీగా సుంకాలు విధించటాన్ని అక్కడి పౌర సమాజం బహిరంగంగానే వ్యతిరేకించింది. సరిగ్గా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు అమెరికాలోని పేదల ఆకలి కేకలు మిన్నంటాయి. ట్రంప్ విధానాల కారణంగానే ప్రభుత్వం నుంచి తమకు అందే సంక్షేమ పథకాల నిధులు నిలిచిపోయాయన్న ఆగ్రహం పేదల్లో వ్యక్తమైంది. అమెరికాలో 'సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్' (ఎస్ఎన్ఏపీ) కింద ప్రభుత్వం నుంచి సుమారు 4.2 కోట్ల మంది ప్రతి నెల 200 నుంచి 900 డాలర్ల వరకూ ఆర్థిక సాయం అందుకుంటున్నారంటే ఆ దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉన్నదో గ్రహించవచ్చు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన బడ్జెట్‌ను అక్కడి చట్టసభ ఆమోదించకపోవడంతో ప్రభుత్వంలో ప్రతిష్టంభన (షట్‌డౌన్) పరిస్థితి నెలకొన్నది. లోపభూయిష్టంగా ఉన్న బడ్జెట్‌లోని వివిధ అంశాలను మార్పు చేయాల్సిన పరిస్థితి ఉండడంతో, అత్యవసర ఖర్చులకు మినహా ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేసే వీల్లేకుండా పోవడంతో అమెరికన్ పేదల ఆకలి కేకలు ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఎన్నికల ఫలితాల అనంతరం డొనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని బహిరంగంగానే అంగీకరించారు.

> పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు తమను ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కించే స్థితిలో లేవని అమెరికాలోని కొత్త తరం గ్రహించింది. నిరుద్యోగం, పేదరికం తీవ్రమయ్యాయి, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయి, వేతనాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిస్టు విధానాలే ప్రత్యామ్నాయమని గుర్తించి అమెరికా యువత సోషలిజం వైపు మొగ్గు చూపడం ప్రారంభించింది. ఇదే తరుణంలో జరిగిన ఎన్నికల్లో సోషలిస్టునని చెప్పుకున్న జోహ్రాన్ పట్ల అనూహ్యమైన సానుకూలత వ్యక్తమైంది.



పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు తమను ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కించే స్థితిలో లేవని అమెరికాలోని కొత్తతరం గ్రహించింది. నిరుద్యోగం, పేదరికం తీవ్రమయ్యాయి, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ ఉంటే కార్మిక వర్గానికి దక్కుతున్న వేతనాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిస్టు విధానాలే ప్రత్యామ్నాయమని గుర్తించి అమెరికా యువత సోషలిజం వైపు మొగ్గు చూపడం ప్రారంభించింది. ఇదే తరుణంలో జరిగిన ఎన్నికల్లో సోషలిస్టునని చెప్పుకున్న జోహ్రాన్ పట్ల అనూహ్యమైన స్పందన వ్యక్తమైంది.

జోహ్రాన్ తన ప్రచారంలో ప్రజలకు అత్యవసరమైన అంశాలపైనే దృష్టి పెట్టారు. తక్కువ ఖర్చుతో గృహవసతి, ప్రజా ఆరోగ్యం, కార్మిక హక్కులు, వలసదారుల రక్షణ, ఆర్థిక అసమానతల నిర్మూలన, విద్యలో సమాన అవకాశాలు... అంటూ తన ప్రచారాన్ని నిర్వహించారు. డెమొక్రటిక్ పార్టీ గతంలో ఎన్నడూ లేవనెత్తని అంశాలను ప్రచారానికి వాడుకున్నారు. కార్పొరేట్ వ్యవస్థకు భజన చేయకుండా సోషలిజం ఆలోచనా స్రవంతిలోని అందరికీ విద్య, ఉపాధి, నివాసం, ఆరోగ్యం కల్పిస్తూ; అసమానతలు, అణచివేత, జాత్యాహంకారం లేని వ్యవస్థ నిర్మాణానికి సిద్ధమని ప్రకటన చేశాడు. అత్యంత సంపన్నుల సంపదపై పన్నులు వేయడం ద్వారా తన హామీలను అమలు చేస్తాననీ పేర్కొన్నాడు. ఇవన్నీ సోషలిస్టు ఆలోచనలే కావడంతో న్యూయార్క్ పౌరులు జోహ్రాన్ వైపు నిలబడ్డారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయమే లేదని ఆ వర్గానికి చెందిన ఆర్థికవేత్తలు, మేధావులు ఢంకా బజాయిస్తున్న తరుణంలో సోషలిజం అనే ఒక బలమైన ప్రత్యామ్నాయం ఉందని జోహ్రాన్ ఎన్నిక నిరూపించింది. కారుచీకటిలో వెలుగు రేఖలా అమెరికాలో ఆశాకిరణాలు ప్రసరించాయి. జోహ్రాన్ చేతల్లో నిరూపించుకుంటే, అమెరికా వ్యాప్తంగా సోషలిస్టు వ్యవస్థలు బలపడటం తథ్యం!

■ సి.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి

ఎస్సీ గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ

- సమస్యల పరిష్కారంపై దృష్టి
- జిల్లాకు ఒక సమన్వయ అధికారి నియామకం
- ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

7



- కానరాని పర్యవేక్షణ.. లోపిస్తున్న పారదర్శకత
- నిధులు పక్కదారి.. అపరిష్కృతంగా సమస్యలు
- అస్తవ్యస్తంగా సంక్షేమ పథకాల అమలు
- నీరుగారుతున్న కమిటీల ఏర్పాటు లక్ష్యం
- ఇబ్బందుల్లో ఉమ్మడి జిల్లాలోని సామాన్య జనం

ఉత్సవ కమిటీలు

నామమాత్రంగా ప్రభుత్వ శాఖల్లోని కమిటీలు



హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేందుకు, నిధులు సకాలంలో సమర్థవంతంగా ఖర్చయ్యేందుకు తగిన పర్యవేక్షణ కోసం ఆయా ప్రభుత్వ శాఖల్లో వేసిన కమిటీలేవి సక్రమంగా పని చేయడం లేదు. ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. మూణ్నెళ్లకోసారి సమావేశమై సమీక్షించాల్సిన కమిటీలోని సభ్యులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా కమిటీలు నామమాత్రంగా మారుతున్నాయి. ఫలితంగా సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందడం లేదు. నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. జవాబుదారితనం లేకుండా పోతోంది. కమిటీల లక్ష్యం నీరుగారి పోతోంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల బలోపేతం, వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహించడంతో పాటు పల్లెలు, పట్టణాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కమిటీలు నామమాత్రంగా మారాయి. నిబంధనల ప్రకారం సభ్యులను నియమిస్తున్నా కార్యకలాపాలు జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఆయా కమిటీల పనితీరుపై ప్రత్యేక కథనం

ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఏర్పాటైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు నామావశిష్టంగా మారాయి. అసలు ఇవి ఉన్నాయో లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఆస్పత్రులకు నిధులొచ్చినప్పుడు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్న దయనీయ స్థితి నెలకొన్నది. స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీవో తదితరుల భాగస్వామ్యంతో ఈ కమిటీలు ఏర్పాటవుతాయి. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రికి ఇలాంటి అభివృద్ధి కమిటీ ఒకటి తప్పనిసరిగా ఏర్పాటు కావాలి. ఈ కమిటీలు మూణ్నెళ్లకోసారి సమావేశాలు నిర్వహించి, ఆస్పత్రి అభివృద్ధితో పాటు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఇవి సక్రమంగా పని చేయకపోవడంతో అడిగేవారు లేక డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులు అవస్థల పాలవుతున్నారు. ఆస్పత్రిలో ఏదైనా జరగరానిది జరిగినప్పుడో, లేదా సమస్యలు తలెత్తినప్పుడో రోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగినప్పుడో.. హడావుడిగా సమావేశమై మొక్కుబడి సమీక్ష జరుపుతున్నారు. లేదా అడపాదడపా సమావేశం అయి సంతకాలతో సరిపెట్టుకున్నారు. నిధుల వినియోగంపై కమిటీ తీర్మానాలేవి లేక అవి పక్కదారి పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), జిల్లా స్థాయి ఆస్పత్రులలో ఏడాదికోసారి కూడా కమిటీలు సమావేశం కావడం లేదు. చాలా సందర్భాల్లో సంతకాలతోనే సరిపెడుతున్నారు. తెలంగాణలో రెండో అతిపెద్దఆస్పత్రి అయిన వరంగల్ ఎంజీఎం (మిగతా 6వ పేజీలో)

మరికొన్ని కమిటీలు

గ్రామ అభివృద్ధి కమిటీలు, శాంతి కమిటీలు, పారిశుధ్య కమిటీలు, మున్సిపాలిటీల్లో వార్డు కమిటీలు, వరంగల్ మహానగర పాలక సంస్థలో డివిజన్ కమిటీలు, ఇతరత్రా నామమాత్రంగానే పని చేస్తున్నాయి. ఇవి ఉనికిలో ఉన్నాయో లేదో కూడా తెలియని దయనీయ పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొన్నది. కొన్నిచోట్ల అసలు ఇలాంటి కమిటీల ఏర్పాటే జరగలేదు. జిల్లా పరిషత్ స్థాయి సంఘాలే సరిగా పని చేయడం లేదు. వాటి సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సు కమిటీలు అంతంత మాత్రంగానే పని చేస్తుండడంతో పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వేసిన కమిటీ ఎక్కడా పని చేయడం లేదు. వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖలను సమన్వయం చేస్తే ప్రభుత్వం గతంలో సాంకేతిక వ్యవసాయాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు కూడా ఎక్కడా పని చేస్తున్న దాఖలాలు లేవు.

అవినీతి, లోపాయికారి ఒప్పందమే కాంగ్రెస్ నైజం

- ఏమి సాధించాడని సీఎం రేవంత్‌రెడ్డి విజయోత్సవాలు జరుపుతున్నారు..
- రాష్ట్రాన్ని పదేళ్లు కేసీఆర్, కేటీఆర్‌లు దోచుకున్నారు..
- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేశ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్

రాంనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అంటేనే అవినీతి, లోపాయికారి ఒప్పందమని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేశ్ ఆరోపించారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేశ్ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్‌హాల్ వరకు సాగిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన బీజేవైఎం వరంగల్ పార్లమెంటరీ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రెండేళ్లల్లో రేవంత్‌రెడ్డి ఏం సాధించాడని విజయోత్సవాలు నిర్వహిస్తున్నాడని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రౌడీయిజం, అధికార దుర్వినియోగం చేసి కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. నీళ్లు, నిధుల, నియామకాల కోసం బలిదానాలు చేసి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో 10 ఏళ్లు కేసీఆర్, కేటీఆర్‌లు అందినకాడికి దోచుకొని యువత, ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా యువ మోర్చా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రవికుమార్, కార్పొరేటర్ అభినవ్‌భాస్కర్, బీజేవైఎం హనుమకొండ, వరంగల్ అధ్యక్షులు తీగల భరత్, ఎర్రగోళ్ల భరత్ వీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- బల్దియాలో ఘనంగా వరల్డ్ టాయిలెట్స్ డే


వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా నిర్వాహకులను అభినందిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. బుధవారం వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్తమ సేవలందించిన సెప్టిక్ ట్యాంక్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బహిరంగ రహిత మల మూత్ర విసర్జన నేరమన్నారు. ఈ మేరకు శానిటేషన్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతీ ఇంట్లో ఉన్న టాయిలెట్స్‌ను మూడేళ్లకోసారి శుభ్రం చేయించుకోవాలన్నారు. నగరం నుంచి సేకరించిన మలాన్ని అమ్మవారిపేటలోని ఎస్‌టీపీ సెంటర్‌కు తరలిస్తున్నామన్నారు.

అనంతరం సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కలిగించేందుకు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నుంచి కేఎంసీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర, ఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, గొల్కొండ శ్రీనివాస్, భాస్కర్, సూపరింటెండెంట్ దేవేందర్, ఆస్కి ప్రతినిధి రాజ్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఏనుమాముల మార్కెట్లో పత్తి బస్తాలు దించుతున్న రైతులు

పత్తి కొనుగోళ్లు షురూ..

ఏనుమాముల మార్కెట్లో ప్రారంభం

వరంగల్ వ్యవసాయం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో బుధవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అదే విధంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలలో సైతం పత్తి కొనుగోలు చేశారు. మార్కెట్‌కు సుమారు రెండు వేల బస్తాల పత్తి రాగా, గరిష్ఠ ధర క్వింటాకు రూ.6,830 చొప్పున ఖరీదుదారులు కొనుగోలు చేశారు. అదే విధంగా మిల్లుల్లో మద్దతు ధర రూ.8110ల చొప్పున సీసీఐ కొనుగోలు చేసింది. సీసీఐ తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పత్తి కొనుగోలు చేసేది లేదని తెలంగాణ కాటన్ ట్రేడర్స్ అసోసియేషన్ నిరవధిక బంద్‌కు పిలుపునివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ సెంటర్లు, మార్కెట్లలో రెండురోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిచిపోయిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వారం, పది రోజులలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కాటన్ ట్రేడర్స్ అసోసియేషన్ బంద్‌ను విరమించుకుంది.

ఆడబిడ్డలకు సారెగా ఇందిరమ్మ చీర..!

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు


వీసీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలకు సారెగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంపై బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటిమంది మహిళలకు చీరల పంపిణీ ప్రారంభించుకున్నామన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతల వారిగా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యం లో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. మహిళ ల ఉన్నతి- తెలంగాణ ప్రగతి కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబరు 9వ తేదీ వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 8 వరకు చీరల పంపిణీ ఉంటుందని, వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా వాటికి మహిళలను యజమానులను చేశామని, స్కూల్ యూనిఫాంలు కుట్టే బాధ్యత మహిళా సంఘాలకే అప్పగించామని తెలిపారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, శిల్పారామంలో 3ఎకరాల్లో ఇందిరా మహిళాశక్తి బజార్ ఏర్పాటు, ఆన్‌లైన్ మార్కెట్ కోసం అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీపీవో లక్ష్మీరమా కాంత్, ఇతర జిల్లా అధికారులతో పాటు జిల్లా, మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో రామిరెడ్డి, అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు

- పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- ప్రస్తుతం గ్రామీణ ఎస్‌హెచ్‌జీ సభ్యులకే..
- మార్చిలో మెప్మా సంఘాల సభ్యులకు..

7

వృద్ధురాలి హత్య

- గుర్తుతెలియని వ్యక్తుల ఘాతుకం
- రామన్నగూడెంలో దారుణం


కల్లెపు పద్మ (ఫైల్)

నెల్లికుదురు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగి ఉంటున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేశారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని రామన్నగూడెంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తిర్మలాపురం గ్రామానికి చెందిన కల్లెపు పద్మ (62)కు ముగ్గురు కుమార్తెలు. కూతుళ్ల వివాహం అనంతరం 7 ఏళ్ల కిందట ఆమె భర్త సీతయ్య మృతి చెందాడు. దీంతో నెల్లికుదురు మండలం రామన్నగూడెంలోని రెండో కూతురు, అల్లుడు కోయ్యేడి సరిత-సుధాకర్ దంపతుల ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో బతుకు దెరువు కోసం అల్లుడు, కుమార్తె హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటుండగా ఇంట్లో ఒంటరిగా పద్మ నివసిస్తోంది.

కాగా, పద్మ రోజూ ఉదయం 5 గంటలకు నిద్రలేచివాకిలి ఊడ్చి ముగ్గులు వేసేది. బుధవారం ఉదయం8 గంటలు కావస్తున్నప్పటికీ ఆమె బయటికి రాకపోవడంతో గ్రామస్థులు ఇంటి తలుపులు తెరిచి చూశారు. తలకు తీవ్రగాయాలై మంచంలోనే పద్మ మృతిచెంది కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి హత్యచేసి ఉండవచ్చని భావిస్తున్నారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కూతురు సరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

ఉద్యమకారుల చావుకు హరీ‌ష్‌రావే కారణం

- మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో రూ.600కోట్ల అవినీతి
- ప్రజా పాలన గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులను రెచ్చగొట్టి వారి చావుకు కారణమైన మాజీమంత్రి తన్నీరు హరీ‌ష్‌రావు కాంగ్రెస్ ప్రజా పాలన గురించి మాట్లాడే అర్హత లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్సీ కవిత ఇచ్చే వరుస స్ట్రోక్‌లకు కేటీఆర్, హరీ‌ష్‌రావులు సమాధానం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో హరీ‌ష్‌రావు అంచనాలు పెంచి రూ.600కోట్లు దోచుకున్నాడని కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పలేకనే హరీ‌ష్‌రావు జిల్లాల పర్యటన చేస్తున్నాడని విమర్శించారు. హరీ‌ష్‌రావు బీజేపీకి లోపాయికారిగా పనిచేస్తున్నాడని కల్వకుంట్ల కవిత బహిరంగంగా ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రూ.వేల కోట్లు దోచుకొని వైట్ కాలర్ రౌడీలుగా చెలామణి అవుతున్నారని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి విమర్శించారు. 2004 నుంచి బీఆర్‌ఎస్ నాయకుల ఆస్తుల వివరాలు ఐటీకి చూపించాలని సవాల్ విసిరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్ర అభివృద్ధి పేరిట రూ.లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. 11 శాతం వడ్డీకి కేసీఆర్ అప్పు తీసుకుంటే.. దానిని 8 శాతానికి తగ్గించడం కోసం ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు దీనిని గమనించాలన్నారు.

సీసీఐ ఎవరి ఆధీనంలో ఉన్నది తెలియక హరీ‌ష్‌రావు రాజకీయ లబ్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్‌ఎస్ నాయకుల తీరు మారడం లేదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా.. రైతులను ఎంత రెచ్చగొట్టినా.. ఒక్క సర్పంచ్ అభ్యర్థి కూడా గెలవరని నాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోపు కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్‌ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే నాగరాజు
- రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం

7


కోచ్‌ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- హనుమకొండ జిల్లాలో 161 కేంద్రాల లక్ష్యం
- ప్రారంభమైనవి 98.. 63 కేంద్రాల్లో ఆలస్యం
- ఇప్పటి వరకు 7783.92 టన్నుల ధాన్యం సేకరణ
- 277 మంది రైతులకు రూ.33కోట్ల చెల్లింపులు

హనుమకొండ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభమే కాలేదు. అయిన వాటిల్లో ఇంకా ధాన్యమే కొనుగోలు చేయని పరిస్థితి. జిల్లాలో ధాన్యం సేకరణ అంచనాలు 150,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. కాగా, ఇప్పటివరకు 7783.92 ఎంటీఎస్ కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి వేచిచూసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇక కొనుగోళ్ల కేంద్రాలు ఇంకా ప్రారంభమే కానీ చోట్ల రైతులు నిరీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈ పరిస్థితులకు మొంథా తుఫాన్ కారణంగా జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే కొనుగోలు ప్రక్రియ వేగవంతం అవుతోందంటున్నారు. జనవరి వరకు సాగే ఈప్రక్రియలో కొనుగోలు అంచనాలు చేరుకుంటాయని అంటున్నారు.

జిల్లాలో 161 కేంద్రాల లక్ష్యం

హనుమకొండ జిల్లాలో 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అంచనాల మేరకు 161 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఐకేపీ ద్వారా 72, పీఏసీఎస్ ద్వారా 89కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే నిర్దేశిత (మిగతా 6వ పేజీలో)



అమ్మవారి దేవాలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

భద్రకాళి అమ్మవారి హుండీ ఆదాయం రూ.65.93 లక్షలు

వరంగల్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానంలో అమ్మవారి హుండీలలో వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.65,93,481 ఆదాయం లభించింది. అంతేగాకుండా విదేశీ కరెన్సీ 2483, యూఎస్ఏ డాలర్లు 55, ఆస్ట్రేలియ డాలర్లు 10, సింగపూర్ డాలర్లు 15, యూఏదిరన్స్ 3, ఖతర్ సెంటర్ బ్యాంక్ రియాలు లభించాయి. హుండీలో లభించిన మిశ్రమ బంగారం వెండిని తిరిగి హుండీలోనే వేశారు. ఈ కార్యక్రమానికి కురవి వీరభద్రస్వామి దేవస్థానం ఈవో సత్యనారాయణ, ఈవో రామల సునిత, ధర్మకర్తలు, ప్రధానార్చకులు భద్రకాళి శేషు హాజరయ్యారు. లెక్కింపులో దాదాపు 100 మంది సేవా కర్తలు పాల్గొన్నారు. కాగా, బుధవారం కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

వేయిస్తంభాల గుడిలో గంగా హారతి

- కోనేరులో దీపాలను వదిలిన మహిళలు
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



ఆలయం ఆవరణలోని కోనేరులో దీపాలను వదులుతున్న మహిళలు

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల గుడి ఆవరణలోని కోనేరులో మహిళలు అరటి దొప్పలలో వెలిగించిన దీపాలను వదిలారు. కార్తీక ఉపవాసం తీసుకున్న మహిళలు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీపం జ్యోతి నమోస్తుతే.. అంటూ దీపాలను గంగమ్మ ఒడిలోకి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ వేద మంత్రాల మధ్య సప్తహారతులతో గంగా హారతిని నిర్వహించారు. భక్తులు కూడా నదీమతల్లులకు హారతులు ఇచ్చారు.

బిల్వహారతి, రుద్ర హారతి, నాగ హారతి, సింహహారతి, కుంభ హారతి, నక్షత్ర హారతులను గంగమ్మకు సమర్పించారు. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు దేవస్థానం పక్షాన మహిళలకు ఆకు, వక్క, కనుమ (జాకెట్ ముక్క)లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.అనిల్ కుమార్, సిబ్బంది ఎస్.మధుకర్, రామక్రిష్ణ, రజిత భక్తులకు సేవలను అందించారు. ప్రముఖ గాయని గీతామాధురి, హీరో నందకిశోర్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వర్తింపజేశారు. గురువారం ఆలయంలో గౌరీనక్తం నిర్వహిస్తారు.

కగార్ ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి

మావోయిస్టులు పంథాను మార్చుకోవాలి
దేశంలో బీజేపీ ప్రభుత్వం నరహంతక పాలన చేస్తోంది
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కగార్ ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. మావోయిస్టులను కోర్టుకు సరెండర్ చేయకుండా టెర్రరిస్టుల మాదిరిగా కేంద్ర ప్రభుత్వం భావించడం సరికాదన్నారు. మావోయిస్టులు కూడా పునరాలోచన చేసి తమ పంథాను మార్చుకోవాలన్నారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని ఇప్పటికే కొందరు బయటకు వచ్చారని, మిగిలిన వారు కూడా తమ పంథాను మార్చుకుని కమ్యూనిస్టులతో కలిసి రావాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నరహంతక పాలన చేస్తోందని, కేవలం కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలపడాలని అన్నారు. అందుకోసం కమ్యూనిస్టులతో మావోయిస్టులు కలిసిరావాలన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సీపీఐ వందేళ్ల సభకు సీపీఐ శ్రేణులు వేలాదిగా తరలిరావాలన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ నాయకులు ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు, ఎదునూరి వెంకట్రాజం, కొట్టిపాక రవి, జక్కు రాజుగౌడ్, మోతె లింగారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించడం మనందరి బాధ్యత

వరంగల్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ తరం పిల్లలకు వయోవృద్ధులు తమ అనుభవాలను అందించాలన్నారు. జిల్లాలో పైలెట్‌గా చేపట్టిన స్ఫూర్తి కార్యక్రమంలో వయోవృద్ధులు పాల్గొని వారి జీవిత పాఠశాలను విద్యార్థులకు అందించాలని కోరారు. వయోవృద్ధుల కోసం ప్రత్యేకంగా ఒక రోజు ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఆ రోజును వయోవృద్ధులు వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి మాట్లాడుతూ.. వయోవృద్ధులు ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలని సూచించారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం గురించి వివరిస్తూ డబ్బులు లేక ఇబ్బందులకు గురైతే వారి తరుపున ఉచితంగా కేసు వాదిస్తామని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అడ్వకేట్ సురేశ్ తెలిపారు. అనంతరం వయోవృద్ధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వయోవృద్ధుల కమిటీ సభ్యుడు మల్లారెడ్డి, జిల్లా సంక్షేమశాఖ సిబ్బంది, సీడీపీవోలు, సూపర్ వైజర్లు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏనుమాముల మార్కెట్, కొత్తవాడ, 80 ఫీట్ల రోడ్డు, అండర్‌బ్రిడ్జీ, రంగశాయిపేట, కరీమాబాద్ ప్రాంతాల్లో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు ఎంబీలలో కొలతలు పారదర్శకంగా ఉండాలన్నారు. వీటి ఆధారంగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ సంతోష్‌బాబు, డీఈ రంగారావు పాల్గొన్నారు.

జీడబ్ల్యూఎంసీలో అంతర్గత బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పలువురు అధికారులకు బుధవారం అంతర్గత బదిలీలు జరిగాయి. పరిపాలన సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేసినట్టు వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వెల్లడించారు. ప్రస్తుతం పలు విభాగాలలో పనిచేస్తున్న మునిసిపల్ ఏఈలు, డిప్యూటీ ఈఈలకు స్థానచలనంతో పాటు పలు విభాగాలను అప్పగించారు. కానీ కొన్ని ప్రాధాన్యమైన విభాగాలైన క్యూసీ (క్వాలిటీ కంట్రోల్)తో పాటు ఎలక్ట్రికల్ విభాగాలలో పని చేస్తున్న వారిని తొలగించి ప్రాధాన్యత లేని విభాగాలకు బదిలీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. 12 మంది ఏఈ, డిప్యూటీ ఈఈ స్థాయి అధికారులను అంతర్గత బదిలీ చేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేయాలని కమిషనర్ ఆదేశించారు.

'ఉత్సవ' కమిటీలు

(5వ పేజీ తరువాయి)

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పరిస్థితి ఇలాగే ఉంది. కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీ మూణ్నెళ్లకోసారి సమావేశం కావాలి. ఆరు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఒక్క సారి కూడా కాలేదు.

పాఠశాల పర్యవేక్షణ కమిటీలు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వాటి పనితీరులో యాజమాన్య కమిటీలది కీలక భూమిక. పాఠశాలల బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల ఇష్టారాజ్యాన్ని అడ్డుకోవడానికి ఈ కమిటీలు ఎంతో దోహదపడతాయి. ప్రజల భాగస్వామ్యంతో ఇవి పని చేయాల్సి ఉంటుంది. కానీ పేరుకే పరిమితమయ్యాయి. సమావేశాల నిర్వహణను గాలికి వదిలేశాయనే ఆరోపణలున్నాయి. నిధులొచ్చినప్పుడు సంతకాల కోసం పాఠశాల యాజమాన్య కమిటీలు సభ్యులకు సమాచారం ఇస్తున్నాయి. పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల యాజమాన్య కమిటీలు, మధ్యాహ్న భోజన కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు ప్రతీ మూడో శనివారం సమావేశం కావల్సి ఉంది. ఈ కమిటీలు ఉమ్మడి జిల్లాలో మొదట్లో చురుగ్గా పని చేసిన ఆ తర్వాత అటకెక్కాయి. ప్రస్తుతం 90 శాతం పాఠశాలల్లో నామమాత్రంగా కమిటీలు పని చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

అంగన్వాడీ కమిటీలు

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పోషకాహారం అర్హులకు అందేలా చూడటం, లోపాలను గుర్తించి అవగాహన కల్పించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ చైర్మన్‌గా కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో వార్డు సభ్యులతో పాటు మహిళలు, యువత, కిశోర బాలికలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలు అలంకార ప్రాయంగా మారాయనే విమర్శలున్నాయి. ఎక్కడా ప్రత్యేకంగా సమావేశాలు జరగడం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో గుడ్డు సైజు చిన్నగా ఉండడం, బాలామృతం సరిగా పంపిణీ చేయకపోవడం, ఇష్టానుసారంగా కేంద్రాలను మూసివేయడంవంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో జరిగాయి. కమిటీలో సభ్యులుగా ఉన్నామనే విషయం కొందరికి తెలియదంటే అతిశయోక్తి కాదు.

ఆహార సలహా సంఘాలు

ప్రజాపంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా పేదలకు నిత్యావసర సరుకులు అందేలా చూసేందుకు ఆహార సలహా సంఘాలను ఏర్పాటును అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు ఈ కమిటీల ఏర్పాటే జరగలేదు. ఈ విషయమై వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పదే పదే ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా స్థాయిలో జిల్లా పౌరసరఫరాల అధికారులు, మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా, అఖిల పక్ష పార్టీల నాయకులు, వినియోగదారుల మండలి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఏర్పాటయ్యే ఈ కమిటీలు అక్రమాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలి. ఈ సంఘం మూణ్నెళ్లకోసారి సమావేశమై ప్రజాపంపిణీ వ్యవస్థ తీరు తెన్నులపై చర్చించాలి. ప్రస్తుతం ఈ సంఘాలు ఎక్కడ సమావేశం కావడం లేదు. దీంతో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీ జరగడం లేదు. రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది.

ఎలక్ట్రికల్ బస్సులకు బస్‌షెల్టర్ ఏర్పాటు

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
ఈ- బస్సు సేవలపై అధికారులతో సమావేశం



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సులకు పార్కింగ్ స్థల కేటాయింపు, డిపో నిర్మాణం త్వరలో ఏర్పాటు చేస్తామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి సంస్థ పీఎం ఈ - బస్సు సేవలో భాగంగా వరంగల్ నగరానికి 100 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు అయ్యాయన్నారు. ప్రస్తుతం బస్సులను ఎక్కడ పార్కింగ్ చేయాలనేది చర్చిస్తున్నామన్నారు. వంద బస్సులు నిలిచేందుకు 10 ఎకరాల స్థలంతో కూడిన డిపో అవసరమని అన్నారు. డిపో ఏర్పాటుకు రూ.10కోట్ల నిధుల మంజూరుకు ఆర్టీసీ అధికారులకు లేఖ రాశామని చెప్పారు. ఇందుకు అనువైన స్థలాన్ని త్వరలో గుర్తిస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర, ఆర్టీసీ ఆర్ఎం విజయ్‌భాను, డీఎం ధరంసింగ్, ఈఈ మాధవిలత, ఏఈ సరిత తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రైవేట్ కంపెనీల్లో వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 60 ఉద్యోగాలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య గల 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 22న ఉదయం 11 గంటల వరకు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 7893394393 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కాజీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి సోమిడి శివారులో బుధవారం బహిరంగ ప్రదేశంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, కాజీపేట పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.55,700 నగదు, 6 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి సోమిడి శివారులోని ఓ వెంచర్‌లో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై బి.శివ, కాజీపేట పోలీసు సిబ్బందితో కలిసి సంయుక్తంగా బుధవారం దాడులు చేశారు. ఈ దాడులలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

మేరకు కేంద్రాల ఏర్పాటు జరగలేదు. 161 ప్రతిపాదిత లక్ష్యంలో ఇప్పటి వరకు 98 కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిల్లో 72 కేంద్రాల్లోనే కొను గోళ్లు ప్రారంభం అయ్యాయి. ఇంకా 62 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం కొనుగోలు ప్రారంభమే జరగలేదు.

ఇప్పటివరకు 7783.92 ధాన్యం సేకరణ

జిల్లాలో ఇప్పటి వరకు 72 కేంద్రాల నుంచి 7,783.92 ధాన్యం సేకరణ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిల్లో 7,636.64 ఎంటీఎస్ ధాన్యం మిల్లులకు చేరింది. ఈ ప్రకారం నిర్దేశిత లక్ష్యం 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగాల్సి ఉండడడం ప్రస్తుత పరిస్థితుల మేరకు కొనుగోళ్ల లక్ష్యం ఇంకా దూరంలోనే ఉంది. అయితే డిసెంబర్ ప్రథమార్థం నాటికి 70శాతం లక్ష్యం దాట వచ్చనే అంచనాలు అధికార వర్గాల్లో ఉన్నాయి.

277 మంది రైతులకు చెల్లింపులు

ఐకేపీ, పీఏసీఎస్‌ల నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,541 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ జరిగింది. రైతుల వివరాల ఆన్‌లైన్ నమోదు కూడా జాప్యమే జరుగుతోంది. ఈ కారణంగా కేవలం 277 మంది రైతులకు మాత్రమే మద్దతు ధరల చెల్లింపు జరిగింది. 277 మంది నుంచి కొనుగోలు చేసిన 1381.680 మెట్రిక్ టన్నుల ధాన్యం మేరకు రూ.33కోట్ల చెల్లింపులు జరిగాయి. అంటే కొనుగోలు చేసిన ధాన్యంలో 37 శాతం మాత్రమే మద్దతు ధర చెల్లింపులు జరిగాయి. ఇక ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ చెల్లింపుల ఖాతా ఇంకా తెరుచుకోనే లేదు.

నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాక

హనుమకొండ చౌరస్తా, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ గురువారం హనుమకొండకు రానున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లాకు చెందిన సీపీఎం అగ్రనాయకులు పాల్గొంటారని ప్రభాకర్‌రెడ్డి అ ప్రకటన ద్వారా వెల్లడించారు.

నర్సింగ్ విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

నర్సంపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంజక్షన్ వేసే ప్రక్రియ నేర్పించే నెపంతో ఓ నర్సింగ్ విద్యార్థినితో ఓ ప్రైవేటు ఆస్పత్రి సీనియర్ కంపౌండర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలో చోటుచేసుకుంది. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ ఆస్పత్రికి కొన్ని రోజులుగా స్థానిక ఒకేషనల్ కాలేజీకి చెందిన నర్సింగ్ విద్యార్థులు శిక్షణ కోసం వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ విద్యార్థిని పట్ల ఆ ఆస్పత్రికి చెందిన ఓ సీనియర్ కంపౌండర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం విద్యార్థిని కుటుంబ సభ్యులకు తెలపడంతో మూడు రోజుల కిందట ఆస్పత్రికి చేరుకుని బాధ్యుడిపై దాడికి పాల్పడ్డారు. అయితే దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

26న నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రమేష్

హనుమకొండ చౌరస్తా, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న వివిధ జిల్లాల కలెక్టరేట్ల ఎదుట, మండలకేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన ధర్నాలు, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రమేష్ పాల్గొని మాట్లాడారు. 2021 డిసెంబరు 9న కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని విమర్శించారు. కనీస మద్దతు ధర చట్టం సీ2050 ప్రకారం కొనుగోలు గ్యారెంటీ చేయాలని, రైతులకు వ్యవసాయ కార్మికుల సమగ్ర రుణమాఫీ పథకాన్ని ప్రకటించాలన్నారు. రైతులకు వడ్డీలేని రుణ పథకాన్ని అమలు చేయాడానికి ఆర్బీఐ మిగులును నాబార్డ్‌కు బదిలీ చేయాలని రమేష్ కోరారు.

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రాములు, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి హంసారెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దని, స్మార్ట్ మీటర్లు పెట్టకూడదని, విద్యుత్ బిల్లు 2025ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకొని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచాలని, 200రోజుల పనిదినాలను కల్పించి రోజుకు కూలీ రూ.700కు పెంచాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 65 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు సామాజిక రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు కనీస వేతనాల హక్కులను రక్షించాలని తెలిపారు. సహజ వనరులపై గిరిజనుల హక్కులను కాపాడటానికి అటవీ హక్కుల చట్టం పేసా (గిరిజన ప్రాంతాల్లో పంచాయతీల విస్తరణ చట్టం)లను పకడ్బందీగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, బీకేఎం జిల్లా నాయకులు వెంట్రాజం, సీఐటీయూ నాయకులు బొట్ల చక్రపాణి, పుల్ల అశోక్, ఎన్. రజిత, కారు ఉపేందర్, రాఘవులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6830	6300
మక్కలు	1760	1521
కందులు	5852	3022
పెసళ్లు	3850	3022
పల్లికాయ (సూక)	4500	3500
పల్లికాయ (పచ్చిది)	6221	3890
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	15150	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	20000	12000
యూఎస్341ఏసీ	18500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

ఎస్సీ గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ

- సమస్యల పరిష్కారంపై దృష్టి
- జిల్లాకు ఒక సమన్వయ అధికారి నియామకం
- అదనంగా జోనల్ అధికారుల భర్తీ
- ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన



హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల (టీజీఎస్‌డబ్ల్యూఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పాఠశాలల్లో పేరుకు పోయిన సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా వీటి పర్యవేక్షణకు 33 జిల్లాలకు సమన్వ యాధికారులను నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఆరుగురు కోఆర్డినేటర్లు నియమితులయ్యారు. అలాగే గురుకులాల నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు, బోధనా ప్రమాణాల మెరుగు, సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శనం చేయడానికి మొదటిసారిగా జోనల్, మల్టీ జోనల్ అధికారులనూ నియమించింది. ఈ మేరకు సొసైటీ సెక్రటరీ కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 5న గురుకులాల్లో పదోన్నతుల్లో జాప్యం పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవడం మొదలు పెట్టింది.

త్వరలో పదోన్నతులు

టీజీ ఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్న అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. పదోన్నతుల్లో జాప్యం వల్ల వారు సర్వీస్, ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అనేక సంవత్సరాలుగా పదోన్నతులు లేక గురుకులాల్లో విద్య గాడి తప్పుతోంది. గురుకులాల్లో 1,650 పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు రావాల్సి ఉంది. క్రింది స్థాయిలో పదోన్నతులను పట్టించుకోవడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో కో-ఆర్డినేటర్లు

ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లాకు గ్రేడ్-2 ప్రిన్సిపాల్ జి రజనిని, ములుగు జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ ఎ. వెంకటేశ్వర్లు మహబూబాబాద్ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ బి జాక్విలిన్, హనుమకొండ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ డి ఉమామహేశ్వరి, వరంగల్ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పి. అపర్ణను జనగామ జిల్లాకు గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు నియమించింది. ఇంతకు ముందు ఇన్‌చార్జిలుగా ఉన్నవారి స్థానంలోనే సీనియారిటీ ప్రకారం వీరి నియామకాలు జరిగాయి.

జిల్లా సమన్వయకర్తలు

సాంఘిక గురుకులాల్లో చాలా వాటికి పూర్తిస్థాయి ప్రిన్సిపాళ్లు లేరు. సుమారు 140 గురుకులాలు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అనుభవం లేని వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో గురుకులాల నిర్వహణ గాడి తప్పుతోంది. అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లలో చాలా మంది పలుకుబడి, పైరవీలతో వచ్చినవారేననే విమర్శలున్నాయి. దీంతో గురుకులాల్లో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోనల్ అధికారులు, జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ స్థాయిల్లో పదవీ విరమణలు, కొందరు వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల దాదాపు పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు ముందుగా జిల్లా సమన్వయకర్తల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టింది.

విధులు, బాధ్యతలు

ఈ గురుకుల విద్యా సంస్థల్లో 5 నుంచి ఇంటర్ వరకు జరిగే ప్రవేశాలను ఈ జిల్లా కో-ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తారు. పరీక్షల నిర్వహణ, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉత్తమ ఉపాధ్యాయుల గుర్తింపు, విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల బోధనా తీరు, అవసరాన్ని బట్టి ఆయా పాఠశాలల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం, ఎస్ఏ, ఎఫ్ఏ పరీక్షల తర్వాత విద్యార్థుల ప్రతిభా పాటవాల విశ్లేషణ తదితర విధులు నిర్వర్తిస్తారు. గురుకుల విద్యా సంస్థల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెడతారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన వివిధ పనులు చేపట్టడానికి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేస్తారు.

జోనల్, మల్టీ జోనల్ అధికారులు

ఈ గురుకులాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, జిల్లా సమన్వయకర్తలతో ఎప్పటికప్పుడు చర్చించడం ద్వారా సమస్యల సత్వర పరిష్కారం దిశగా తీసుకునే చర్యల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ కో-ఆర్డినేటర్ల స్థానంలోనే జోన్లు, మల్టీ జోన్ల వారిగా జోనల్ అధికారులను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పది మంది జోనల్ అధికారుల నియామకం జరిగింది. హైదరాబాద్‌లోనిటీజీఎస్‌డబ్ల్యూఆర్ కేంద్ర కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారిగా (జోన్-7) కె.నిర్మల, మల్టీజోన్ -1కు కె.అరుణ కుమారి, మల్టీ జోన్ -2కు ఎస్ రజిని, జోన్ -1కు చెంచు గిరిజ, జోన్ -2కు ఎస్ యుగంధర్ లక్ష్మీ, జోన్-3కి కె ప్రత్యూశ, జోన్-4కు కె అలివేలు, జోన్-5కు ఎస్ విద్యారాణి, జోన్-6కు వి లక్ష్మాంజలిదేవి, జోన్-7కు కె.విద్యుల్లత నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 268 సంక్షేమ గురుకుల విద్యాలయాలను వీరు పర్యవేక్షిస్తారు.

విధులు, బాధ్యతలు

గురుకుల విద్యా సంస్థల బోధన, బోధనేతర సిబ్బందికి శిక్షణ, వర్క్‌షాపులు, నిర్వహణ, విద్యార్థులకు మెగా ఎంసెట్ వంటి క్యాంపులు, స్టార్ బ్యాచ్ వంటి ఇతర కోచింగ్ శిబిరాలు నిర్వహణ, విద్యా సంస్థల తనిఖీ, ప్రశ్నపత్రాల పంపిణీ, విద్యా బోధన, సిలబస్ పూర్తి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో టెలీ కాన్ఫరెన్స్‌లు, ఇతరత్రా సమావేశాల నిర్వహణ తదితర బాధ్యతలను నిర్వర్తిస్తారు.



విద్య, నిర్వహణ మెరుగుపడుతుంది..
రెసిడెన్షియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నరసింహులు గౌడ్

టీజీఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల్లో విద్యాప్రమాణాలు, పరిపాలన మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు. ఇందులో భాగంగా సీనియర్ ప్రిన్సిపాళ్లను జిల్లా కో-ఆర్డినేటర్లు, జోనల్ స్థాయిలో రీజనల్ ఇన్‌చార్జిల స్థానంలోనే జోనల్, మల్టీ జోనల్ అధికారులను నియమించడం పట్ల సంతోషం. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 1,650 పదోన్నతులను వెంటనే చేపట్టాలి. దీని వల్ల గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఎక్కువగా చదువుకునే గురుకులాలు విద్య, నిర్వహణ మెరుగుపడి మంచి ఫలితాలు వస్తాయి.



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్

సదస్సులో 5 తీర్మానాలు ఆమోదం

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. ప్రతీరోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరిగి ప్రయాణికులు మృత్యువాతపడుతున్నారు. పలువురు గాయాల పాలవుతున్నారు. ఇటీవలకాలంలో రోడ్డు ప్రమాదాలు మరింతగా పెరిగాయి. హనుమకొండలోని అశోకా హోటల్లో రోడ్డు ప్రమాదాలపై జరిగిన జాతీయ సదస్సులో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన చర్యలపై లోతుగా చర్చించారు. ఈ సదస్సుల్లో మొత్తం 5 తీర్మానాలను ఆమోదించారు. రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్ పేరుతో బుధవారం ఈ తీర్మానాలను వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి విడుదల చేశారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు అథారిటీ, లీగల్ మెట్రాలజీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో లోతుగా చర్చించి ఈ తీర్మానాలను చేశారు. వీటిని అమలు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

రోడ్డు ప్రమాదాలకు నాలుగు ముఖ్య కారణాలను సదస్సులో గుర్తించారు. లోపభూయిష్టమైన రోడ్లు, లోపాలతో కూడిన వాహనాలు, డ్రైవర్ల నిర్లక్ష్యం, రోడ్ల గజిబిజి, అధ్వాన్న స్థితి వీటిలో ఉన్నాయి. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి రోడ్ల డిజైనింగ్‌లో లోపాలు, రోడ్లపై గుంతలు, ఫుట్‌పాత్‌లు లేకపోవడం, డెత్ స్పాట్స్‌ను తొలగించకపోవడం, స్మార్ట్ రోడ్ల పేరిట అధికారులు అవినీతి కారణాలుగా పేర్కొన్నారు. లారీలు, కార్లు, మోటారు సైకిళ్ల తయారీలో లోపాలు, వాహనాలలోని అన్ని రకాల విడిభాగాల తయారీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ప్రమాణాలు పాటించకపోవడం, బ్రేక్ బైరాడ్లలో పగుళ్లు, లూజ్ స్టీరింగ్, నాణ్యతగా లేని టైర్లు కూడా రోడ్డు ప్రమాదాలకు హేతువు అవుతున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. స్పీడ్ డ్రైవింగ్, అనుమతి లేని చోట పార్కింగ్, సిగ్నలింగ్ గమనించకపోవడం, డ్రైవర్లకు సరైన నిద్ర లేకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తదితర కారణాలు కూడా రోడ్డు ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయని విశ్లేంచారు. రోడ్డుపై ఎద్దుల బండ్లు, సైకిళ్లు, ఆటో రిక్షాలు, కుక్కలు, పాదచారులు, స్కూల్ పిల్లల ప్రయాణం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తీర్మానించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి 90 శాతం రోడ్డు ప్రమాదాలు రోడ్డు భవనాల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. వరంగల్‌లో 10, హనుమకొండలో 14 డెత్ స్పాట్లను గుర్తించినా వాటికి సరిచేయకపోవడం పట్ల సదస్సు విచారం వ్యక్తం చేసింది. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి 563 నిర్వహణలో ఆ శాఖ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని నిరసించింది. రోడ్డు భద్రతపై వరంగల్ డిక్లరేషన్ పేరుతో ఆమోదించిన ఈ తీర్మానాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయడం ద్వారా వాటి అమలుకు కృషి చేయాలని సదస్సులో నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయిలో చైతన్య కార్యాక్రమాలను నిర్వహించాలని కూడా సదస్సు నిర్ణయించింది.

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు

- పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- మార్చిలో మెప్మా సంఘాల సభ్యులకు..

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీకి రంగం సిద్ధమైంది. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో గురు వారం నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. వాస్తవానికి మొదట స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మాత్రమే పంపిణీ చేయాలని ప్రభు త్వం భావించింది. ఆ మేరకు వివరాలను తీసుకొని చీరల స్టాక్‌ను పంపించింది. ఆ మేరకు జిల్లాకు 2.80లక్షల చీరల వచ్చాయి. వీటిని వరంగల్ ఏనుమాముల గోదాములో భద్రపరిచారు. కాగా, బుధవారం చీరల పంపిణీ కార్యక్రమం ప్రారం భం సందర్భంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయ నున్నట్లు ప్రకటించారు. దీంతో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన 18 ఏళ్ల వయసు దాటిన మహిళలకు కూడా చీరల పంపిణీ జరగను న్నట్లు స్పష్టమైంది. ఈ లెక్కన ప్రస్తుతం జిల్లాకు చేరిన 2.80 లక్షల చీరలతో పాటు మరో 20 నుంచి 30వేల చీరలు అదనంగా కావలసి ఉంది. అయితే ఈ అదనపు చీరలను మెప్మా సభ్యుల కోసం ఇప్పటికే పంపిన లక్షా 71వేల చీరల నుంచి వాడుకోనున్నారు. మెప్మా సభ్యులకు మాత్రం ఇప్పుడు కాకుండా వచ్చే యే డు మార్చి 1న చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. చీరల పంపిణీ గురువా రం నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నది. అది మంత్రులు, ఎమ్మెల్యేల అందుబాటు ను బట్టి ఉంటుంది. సభలను, సమావేశాలను ఏర్పాటుచేసి వారి ద్వారానే చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు డీఆర్‌డీవో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ 9వలోగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

మార్చిలోపు కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం

కాజీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలోపు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుందని, అందుకు రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. కాజీపేట అయోధ్యపురం సమీపంలోని రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సందర్శించారు. రైల్వే ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మీడియాతో మాట్లాడారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, పెండింగ్ పనులు, విదేశాల నుంచి తీసుకువచ్చే మిషనరీల గురించి రైల్వే అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మార్చిలోపు అన్ని పనులు పూర్తయి ఫ్యాక్టరీ నుంచి వ్యాగన్‌ల ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబీకులకు రైల్వేలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో నిర్మించిన కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ప్రత్యేక కోటాలో ఉద్యోగాల భర్తీ ఎలా చేశారో.. అదేవిధంగా అయోధ్యపురం రైతులకు, స్థానికులకు ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, శాశ్వత ఉద్యోగాల భర్తీ చేసేందుకు కేంద్ర రైల్వే మంత్రిని, ప్రధాని మోదీని కలుస్తామన్నారు.. కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కోసం పార్లమెంట్‌లో లేవనెత్తి డివిజన్ సాధించి తీరుతామన్నారు.


రైల్వే అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

300 ఎకరాల్లో డిపో కోసం స్థల పరిశీలన

దక్షిణ మధ్య రైల్వే జోన్‌పరిధిలో 300 ఎకరాల్లో మెగా మెయింటనెన్స్ డిపో నిర్మాణం చేసేందుకు రైల్వే అధికారులు ప్రణాళికలు చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య చెప్పారు. ఈ మెగా డిపోలో సరుకు రవాణా చేసే రైళ్లకు పీరియాడికల్, రెగ్యులర్ ఓవరాలింగ్, వ్యాగన్‌ల మరమ్మతుల నిర్వహణ లాంటి ప్రధాన కార్యకలాపాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం స్టేషన్‌ఘన్‌పూర్ - కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య స్థలపరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు ట్రాక్ కనెక్టివిటీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాక్ కనెక్టివిటీ ఉన్న ప్రైవేట్ స్థలాలు రేట్లు విపరీతంగా ఉండటంతో స్థల సమస్య ఎదురవుతుందన్నారు. రూ.908 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై త్వరలో ఒక స్పష్టత రానుందని చెప్పారు. అనంతరం కోచ్‌ఫ్యాక్టరీ మొత్తాన్ని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజుల, రైల్వే అధికారులు పరిశీలించారు. కడియం కావ్య వెంట రైల్వే సీఎంఈ ఆనంద్, జీజీఎం మురళీకృష్ణ, డీజీఎం శర్మ, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారం పల్లి శ్రీనివాస్ రెడ్డి, కడిపికొండ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేశ్, 45, 46 డివిజన్‌ల అధ్యక్షుడు వస్కుల నాగరాజు, సట్ల సదానందంతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా అయోధ్యపురం రైతులు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఎంపీ కడియం కావ్యకు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు.

ప్రమాద ఘంటికలు

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- రక్తసిక్తమవుతున్న ప్రధాన రహదారులు
- బాధిత కుటుంబాల్లో తీరని విషాదఛాయలు
- నిబంధనలు పాటించాలంటున్న పోలీసు, ఆర్టీఏ అధికారులు

వరంగల్ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. దీంతో వాహనదారులు, రోడ్డుకు ఇరువైపులా నివసించే కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతి వేగంతో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను బలి చేస్తూ ఆయా కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చుతున్నారు. కొన్ని సందర్భాల్లో లారీ డ్రైవర్లు నిద్రలేకనో, మద్యం మత్తులోనే రోడ్డు పక్కకే ఉండే ఇళ్లలోకి దూసుకెళుతూ ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం చేస్తున్నారు. అయితే ప్రమాదాలన్నింటికీ రోడ్డు భద్రతా నిబంధనల పాటించకపోవడమే కారణమని పోలీస్‌శాఖతో పాటు రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.


పర్వతగిరి పీఎస్ పరిధిలోని ఏనుగల్లులో బోల్తా పడిన కారు (ఫైల్)

సెల్‌ఫోన్, మద్యం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు

డ్రైవింగ్ సమయంలో వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడటం, మద్యం సేవించడం, అతి వేగంతోనే ప్రమాదాలకు గురవుతున్నట్లుగా అధికారుల దర్యాప్తులో వెలుగు చూస్తున్నాయి. ట్రాలీ, లారీ డ్రైవర్లతో పాటు ఇతర డ్రైవర్లు జాతీయ రహదారుల పక్కకు ఉన్న వైన్స్ షాపుల్లో మద్యం తాగి గూడ్స్ వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుత వాతావరణంలోని మార్పులతో పొగ మంచు పెరిగిన కారణంగా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు మరింతగా పెరిగే ఆవకాశం ఉంటుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు
ఉమ్మడి జిల్లా రవాణాశాఖ డీటీసీ జి. సురేశ్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయి. మద్యం, నిర్లక్ష్యం, అతి వేగం, ఓవర్‌లోడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనదారులు ప్రమదాలకు గురవుతున్నారు. రోడ్డు నిబంధనల అమలు బాధ్యతను అధికారులకు వదిలేయకుండా రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. నిబంధనల ఉల్లంఘలను నివారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిత్యం రోడ్లపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తాం, అవగాహన కల్పిస్తాం. స్వీయ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- ఈ నెల 7న పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏనుగల్లు వద్ద మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన సాహెల్ (23) కారులో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించాడు.
- ఈ నెల 13న ఆత్మకూరు మండలంలోని కొత్తగట్టు సింగారం వద్ద పరకాల నుంచి వరంగల్‌కు కారులో వస్తున్న నలుగురు వ్యక్తులు అతి వేగంగా కారును చెట్టుకు ఢీకొట్టగా వెనుక సీటులో ఉన్న రేగొండ మండల రేపాకు చెందిన పార్థ సంపత్, పరకాల మండల నాగారం గ్రామానికి చెందిన కిషన్‌రావు మరణించగా, ముందు సీటులో కూర్చున్న వెంకటేశ్, మురళికి తీవ్రగాయాలైనాయి.
- మహబూబాద్ జిల్లా శనిగరం శివారులో కుమ్మకుంట్ల తండా వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయులతో వెళ్తున్న ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టగా డ్రైవర్ మల్లేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు చెన్నబోయిన శోభ, బానోత్ కళావతి, మద్దెల సింధూజ, వెల్పుగొండ శైలజా, నారపాక స్వరూప తీవ్రంగా గాయపడటంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.
- ఈనెల 14న దేవరుప్పల మండలంలోని రంబోజీగూడెంకు చెందిన నక్కిరెడ్డి పూజ (13) 8వ తరగతి చదువుతున్న బాలిక సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ గుర్రం కుమార్ అతివేగంతో ఢీకొట్టిన ఘటనలో బాలిక మరణించింది.
- ఈ నెల 14న దుగ్గొండి మండలంలోని గిర్నిబావి ప్రధాన దారిపై లారీ ఢీకొని గీసుగొండ మండలం ఆనంతారం గ్రామానికి చెందిన హనుమాయమ్మ అక్కడికి అక్కడే మరణించింది. జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి దర్గా వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా వెనుకాల కూర్చున్న వర్ధన్నపేట పరిధిలోని నల్లబెల్లికి చెందిన రాపాక వినోద్ (29) మృతి చెందగా ముందున్న వ్యక్తి గాయపడ్డాడు.

నేటితో కార్తీక మాసం ముగింపు

- రేపటి నుంచి మార్గశిర మాసం
- విశేష పండుగలు, ప్రత్యేక పూజలు

వరంగల్ కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు పూజలు, అభిషేకాలు, అర్చనలు, వ్రతాలు, వన భోజనాలు, దీపోత్సవాలతో కొనసాగిన కార్తీక మాసం గురువారంతో ముగియనుంది. గురువారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు కొనసాగుతాయి. ఆధ్యాత్మిక మాసంగా అమావాస్య రోజు గౌరీ నక్తం నిర్వహిస్తారు. పండుగ, పర్వదినాలతో కొనసాగిన కార్తీక మాసంలో కేదారేశ్వర వ్రతాలు, కార్తీక పౌర్ణమి, తులసీ ధాత్రినారాయణ కల్యాణం, ఏకాదశి పర్వదినం నిర్వహించుకున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని దేవాలయాల్లో ప్రతీ రోజు సాయంత్రం కార్తీక దీపోత్సవాలను నిర్వహించాలని ఆదేశించినప్పటికీ చాలావరకు ఆలయాల్లో నిర్వహించలేదు. కేవలం భద్రకాళి దేవాలయంలో మాత్రమే కార్తీక దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- దేవతల మాసంగా..

కార్తీక మాసం ముగిసిన అనంతరం శుక్రవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసాన్ని దేవతల మాసంగా పిలుస్తారు. ఈ మాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి, గీతాజయంతి, మోక్షద ఏకాదశి, దత్తజయంతి, కాలభైరవ అష్టమి, మాస శివరాత్రి వేడుకలు జరుగుతాయి. ఈ మాసంలో నదీ స్నానాలను ఆచరిస్తారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

10 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తుల బుధవారం అధికంగా తరలివచ్చారు. వనదేవతల సంప్రదాయాల్లో భాగంగా ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి దేవతల గద్దెలకు చేరుకున్నారు. ఎత్తుబంగారం (బెల్లం), కొబ్బరి కాయలు, చీరెసారె, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

ప్రభుత్వ వైఫల్యం వల్లనే దురహంకార హత్యలు

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్

వడ్డెపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో దురహంకార హత్యలు జరుగుతున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజక వర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో ఎర్ర రాజశేఖర్ అనే దళితుడి హత్యను ఖండిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్య నగర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద సంపత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే 142 కుల దురహంకార హత్యలు జరిగాయని ఆరోపించారు. దురంహంకార హత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు దానబోయిన రాంబాబు, తవటం పెద్ద వెంకటయ్య, కోవాకుల రాములు, రావుల నవీన్, పులి శ్రీను, తవటం శేఖర్, దానబోయిన జంపన్న, రావుల రాజ్‌కుమార్, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఇబ్బందులున్నా పథకాలు ఆపడం లేదు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక సంక్షోభం జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణితో కలిసి 11, 29వ డివిజన్లకు చెందిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్నామని అన్నారు. గతంలో పర్సంటేజీలు ఇవ్వకుంటే పనులు చేయలేదని, కానీ పారదర్శకంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

న్యూశాయంపేట: జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.60లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్ల నిర్మాణానికి బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మేయర్ గుండు సుధారాణితో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కిట్స్ కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

హసన్‌పర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఎర్రగటుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్స్ ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు వేదాంతం కృష్ణమాచార్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. పుస్తక పఠనం, గ్రంథాలయాల వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు, గ్రంథాలయ పాత్ర గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన,క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డాక్టర్ కె.ఇంద్రసేనారెడ్డి, వివిధ విభాగాల ప్రొఫెసర్లు డాక్టర్ వి.రాజగోపాల్, పబ్బ శ్రీకాంత్, ఎం.శ్రీకాంత్, ఎస్.నర్సింహారెడ్డి, డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, డాక్టర్ యా.శ్రీనివాస్, బాలరాజు, లైబ్రరీ కమిటీ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది డాక్టర్ ఎం.నిరంజన్ డాక్టర్ ఎం.అరుణ్‌కుమార్, టి.రాజు, సీహెచ్.ప్రకాష్, పీఆర్‌ఓ డాక్టర్ డి.ప్రభాకరాచారి అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'సంపత్‌రావు సేవలు ప్రశంసనీయం'



సంపత్‌రావును అభినందిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహా నగరపాలక సంస్థ పరిధిలో మానవ వ్యర్థాల తరలింపులో వ్యక్తిగత శ్రద్ధ కనబరిచిన ఢిల్లీ సంపత్‌రావు సేవలు ప్రశంసనీయమని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా బుధవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉత్తమ సేవలందించిన టాయిలెట్స్ క్లీనర్స్, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్‌ను మేయర్, కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు.

రూ.1.20 లక్షల ఆర్థికసాయం

హసన్‌పర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రానికి చెందిన కాలె తిరుపతి ఇటీవల మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మృతుడి కుటుంబం వీధిన పడింది. విషయం తెలిసిన జడ్పీహెచ్ఎస్ 2000-2001 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు రూ.1.20 లక్షలు విరాళంగా సేకరించిన నగదును సుకన్య యోజన కింద వారి పిల్లల పేర్ల మీద డిపాజిట్ చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు గోపరాజు రాజుకుమార్, కనపర్తి రాజు, మేకల రాజేందర్, సంగినేని రవిప్రసాద్, పిట్టల రాంకుమార్, గంగారపు శ్రీకాంత్, గుండమీది శ్రీకాంత్, జల్లి రాజు, తాళ్ల అనిల్, తౌటం రాజుకుమార్, లక్ష్మణ్, తిరుపతి ఉన్నారు.

'విద్యా రంగ అభివృద్ధికి కృషి చేయాలి'

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు అన్నారు. బుధవారం కేయూలో పీడీఎస్‌యూ సమావేశం బాలకృష్ణ అధ్యక్షత జరిగింది. ఈసందర్భంగా నరసింహారావు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేవన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ ప్రధాన కార్యదర్శి వి. కావ్య, గణేశ్, పి.అనూష, సాధన, వంశీ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కేయూ అభివృద్ధికి సహకరిస్తాం'

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేయూ అభివృద్ధికి వర్సిటీ జేఏసీ సహకరిస్తుందని కేయూ జేఏసీ నేతలు తెలిపారు. బుధవారం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంను కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రావాల్సిన వర్సిటీ ఫీజులు బకాయిలు, ఉద్యోగాల నియామకాల కోసం పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు అరెగంటి నాగరాజుగౌడ్, డి.తిరుపతి, కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి, కల్లెపల్లి ప్రశాంత్, బొస్కానాగరాజు, దారవత్ సూర్య, రేగుల నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

హనుమకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్, సంస్థ కార్యదర్శి కె. శశిజాదేవి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆరోరోజు సందర్భంగా గ్రంథాలయ పాఠకులకు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం మెహందీ పోటీలు, మ్యూజికల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మల్సూర్, పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, రికార్డ్ అసిస్టెంట్ మమత, ఇంటర్నెట్ నిర్వాహకుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అజీజ్‌ఖాన్ తదితరులు

● న్యూశాయంపేట : న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి బుధవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● కాజీపేట: కాజీపేట చౌరస్తా, డీజల్‌కాలనీ చౌరస్తా, బాపూజీ నగర్ చౌరస్తాలో బుధవారం ఇందిరాగాంధీ జయంతి ని నిర్వహించారు. 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఇందిరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. దేశానికి ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మేరుగు రాజయ్య, నాయకులు మాచర్ల జయాకర్, సిరిల్ లారెన్స్, గబ్బెట ఎల్లేశ్, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు..

● మడికొండ : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం మడికొండ చౌరస్తాలో 46, 64 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బిల్లా రవీందర్, పైడిపాల రఘుచందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, వస్కుల శ్రీను, వర్ధన్నపేట ఓబీసీ వైస్ ఛైర్మన్ నార్లగిరి కుమార్, పల్లపు అర్జున్, భైరి రజినీవేణు, రాజారపు స్వామి, దువ్వ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వృద్ధాప్యం శాపంగా మారకూడదు

జిల్లా జడ్జి కె.పట్టాభి రామారావు

బాలసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని, వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కె.అనితారెడ్డి అధ్యక్షతన బుధవారం హనుమకొండలోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన, ఆత్మీయ స్పర్శ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కి వరం ట్రిబ్యునల్ బెంచ్ అని, వారికి ఏ సమస్య వచ్చినా బెంచ్‌కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆయన ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల సంక్షేమ బాధ్యత ఖచ్చితంగా వారి పిల్లల దేనని, విస్మరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి రామలింగం మాట్లాడుతూ.. అవస రార్థులకు ఉచిత న్యాయ సదుపాయాలు అందిస్తామని అన్నారు. తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టే వారు ఎంతటి కోటీశ్వరులైనా దరిద్రులతో సమానమని అన్నారు. సీనియర్ సిటిజన్ చట్టంపై జిల్లా జడ్జి వృద్ధాశ్రమానికి వచ్చి న్యాయ భరోసాను, ఆత్మీయ స్పర్శను అందించడం ఇదే మొదటి సారని అభినందించారు. వృద్ధులకు అనితారెడ్డి చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వయం కృషి వృద్ధాశ్రమ నిర్వాహకులు శుభ, వృద్ధులు పాల్గొన్నారు.



వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి పట్టాభిరామారావు

పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

రాంనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ నయీంనగర్ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, బేతి శంకర్ లింగం పర్యవేక్షణలో 53వ డివిజన్‌లోని ఆదర్శకాలనీలో బుధవారం ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శిగా సుభాష్, కోశాధికారిగా గంగారపు యాదగిరి ఎన్నికయ్యారు.

'ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు'

హసన్‌పర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగినప్పుడే సమస్యలు వాటంతటవే పరిష్కారం అవుతాయని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, స్టూడెంట్ కౌన్సిలర్ కెప్టెన్ కె.రవిప్రకాష్ అధ్యక్షతన విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్, డాక్టర్ కె.ప్రశాంతి, డాక్టర్ భరత్‌రెడ్డి, డాక్టర్ కృతికారెడ్డిలు హాజరై విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వై.సునిత, శ్రీనివాస స్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్‌గా భాస్కర్

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ నూతన ప్రిన్సిపాల్‌గా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.భాస్కర్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఏడాదిపాటు భాస్కర్ పదవీలో కొనసాగుతారు. ఉత్తర్వులు కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి భాస్కర్‌కు అందచేసి అభినందించారు.

నేడు ప్రపంచ పైల్స్ దినోత్సవం

వరంగల్ మెడికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా పైల్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు డాక్టర్ కూరపాటి రమేశ్ తెలిపారు. బుధవారం ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గురువారం ఉదయం 7 గంటలకు కాకతీయ మెడికల్ కాలేజీ నుంచి ఎంజీఎం వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న జీవనశైలి, తగినంత అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు పెద్దసంఖ్యలో పైల్స్ సమస్య బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఐఎంఏ వరంగల్ బాధ్యులు డాక్టర్ అజిత్ మహ్మద్ మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహనలోపం వల్ల ఎంతో మంది పైల్స్‌తో బాధపడుతున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలపై నేరుగా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. గురువారం నిర్వహించే అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుమ

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రభుత్వం కఠినచర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసగాని సుమ డిమాండ్ చేశారు. బుధవారం కేయూ దూరవిద్య కేంద్రం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా బాలికల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సుమ మాట్లాడుతూ. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆరోపించారు. షీటీమ్స్ సరిగ్గా పనిచేయడం లేదన్నారు. మహిళలపై రోజురోజుకూ హత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. బేటీబచావో బేటీ పడావో నినాదమే తప్ప ఆచరణ లేదన్నారు. ర్యాగింగ్‌ను అరికట్టాలని అన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో మహిళ విద్యార్థులపై హత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత స్కూటీ హామీలను అమలు చేయాలని అన్నారు. సంక్షేమ హాస్టల్‌లో వసతులను కల్పించాలని అన్నారు. జాతీయ నూతన విద్యా విధానం కాషాయికరణ విధానమని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో జిల్లా గర్ల్స్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎం.పరిమిళ, జిల్లా కోకన్వీనర్ భవాని, సహస్ర, వర్షిత, నవ్య, మాధవి, శ్రావణి, శ్రీలత, సంధ్య, అనిత, శ్రీసాయిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మంద శ్రీకాంత్, స్టాలిన్, కేయూ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరి సాయి కుమార్, బీరెడ్డి జస్వంత్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాలికల సదస్సులో మాట్లాడుతున్న సుమ

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో అన్ని రంగాల్లో రాణించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. బుధవారం కేయూ ఏబీవీపీ శాఖ నేతృత్వంలో కేయూ సెనెట్ హాల్‌లో స్త్రీ శక్తి దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ బి.రమలు హాజరయ్యారు. మహిళ స్త్రీ దివస్‌పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, భిక్షాలు, ఉబ్బటి హరికృష్ణ, మేకల జ్ఞానేశ్వర్, నిమ్మల రాజేశ్, అంబాల కిరణ్, చెట్ల సతీశ్, మెరుగు సాయికుమార్, అఖిల్, సాగర్, మధు, విష్ణవర్ధన్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకుంటే మంచి భవిష్యత్

ప్రొఫెసర్ వెంకట కృష్ణ ప్రసాద్

హసన్‌పర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల మెరుగుదలతోనే యువత భవిష్యత్ ఆధారపడి ఉంటుందని సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఏఐ రెడినెస్ సీఎస్ఐ ఏఐ 100కె వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకట కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా లక్షకు పైగా విద్యార్థులు, అధ్యాపకులు, యువ ప్రొఫెషనల్స్‌కు కృత్రిమ మేధస్సు ప్రాథమిక అవగాహన, నైపుణ్యాలు చేరవేయాలనే లక్ష్యంతో సీఎస్ఐ మహత్తర జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐ 100కె కన్వీనర్ సర్వేపల్లి కల్యాణ్, వైస్ ఛైర్మన్ రామక్రిష్ణ ప్రసాద్, పాస్ట్ ఛైర్మన్ సుధాకర్, ఏఐ100కె టెక్నాలజీ డైరెక్టర్ యుదనందన్, ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, కంప్యూటర్ విభాగాధిపతి ప్రొఫెసర్ శశికళ, డాక్టర్ రూపేష్ మిశ్రా, మహేష్, సీఎస్ఐ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నీలిమ పాల్గొన్నారు.

రాజ రాజేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

వడ్డెపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి టీఎన్జీవోస్ కాలనీ వంద ఫీట్ల రోడ్డులోని నాగరాజ రాజేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో కార్తీక మాస ఉత్సవాలను పురస్కరించుకొని రుత్వికులు స్వామివారికి నివేదన నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కుందూరు అనిల్‌రెడ్డి, కార్యదర్శి ఇ.కొండల్ రావు, కోశాధికారి పి.విద్యాసాగర్, మేనేజర్ ఎల్లంభట్ల రాధాకృష్ణ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి జీవన్‌శర్మ తదితరులు పార్వతీ నాగరాజ రాజేశ్వర స్వామి శాంతి కల్యాణోత్సవ తం తును నేత్రపర్వంగా జరిపించారు. స్నేహ నగర్, టీఎన్జీవోస్ కాలనీ, శామల దుర్గాదాస్ కాలనీ, వడ్డెపల్లి, వికాస్‌నగర్, భవానీ నగర్, శ్రీవేంకటేశ్వర కాలనీ ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. పార్వతీ నాగరాజ రాజేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని కల్యాణ తంతును తిలకించారు.

'పీడీఎస్‌యూ సభలను జయప్రదం చేయాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కేంద్రంలో డిసెంబరు 10, 11, 12 తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు కోరారు. బుధవారం హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ సెంటర్‌లో వాల్ రైటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్, నాయకులు రాజేష్, అజయ్, అనిల్, కల్యాణ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రజనీకాంత్, ముదిరాజ్ సంఘం నేతలు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ మచిలీబజార్‌లో ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ప్రతీ గ్రామం, మండల, జిల్లా కేంద్రంలో ముదిరాజ్ జెండాలను ఎగరవేసి సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ మచిలీబజార్ ముదిరాజ్ సంఘ సభ్యులు పులి సందీప్, చిల్లా రవీందర్, కోరబోయిన రవి, పులి మధు, పులి రవీందర్, పంది సాంబయ్య, కొండా అశోక్, భరత్, శ్రీకాంత్, శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.

20న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల చలో హైదరాబాద్

వరంగల్ మెడికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీన చలో హైదరాబాద్ పిలుపునిచ్చినట్లు ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది రుక్నొద్దిన్, రహ్మాన్, రాకేశ్‌లు తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ రెండు నెలల వేతనాలు, ఏడు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ కోఠిలో కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ విషయంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

కౌన్సెలింగ్



డాక్టర్! కామెర్లు వస్తే పత్యం ఉండాలంటారు. కానీ ఇది చికిత్స కాదు కదా? కాలేయం దెబ్బతిన్నప్పుడు చికిత్సకు బదులుగా పత్యం ఉండడం వల్ల ఎలాంటి నష్టం జరుగుతుంది? అసలు కామెర్లు ఎందుకొస్తాయి?

- ఓ సోదరి, హైదరాబాద్

కామెర్ల మూలాలు కనిపెట్టాలి

కామెర్లు రుగ్మత కాదు. అదొక వ్యాధి లక్షణం. వ్యాధి మూలంగా కాలేయం అనారోగ్యంపాలైతే కామెర్ల లక్షణాలు బయల్పడతాయి. అలాంటప్పుడు కాలేయానికి ఏమై ఉంటుంది? ఎలాంటి ఇబ్బందికి గురై ఉంటుంది? అనేది తెలుసుకోవాలి. కాలేయానికి సోకే రుగ్మతల్లో ప్రధానమైనవి... హెపటైటిస్ ఎ, బి, సి, ఇ!

హెపటైటిస్ ఎ, ఇ: హెపటైటిస్ ఎ, ఇలు కలుషిత ఆహారం, అపరిశుభ్ర పరిసరాల ద్వారా సోకుతాయి. ఈ రకం వైరస్‌ల జీవితకాలం 14 రోజులే! కాబట్టి, ఈ వైరల్ ఎల కారణంగా కాలేయం జబ్బుపడి, కామెర్లు సోకినా అది తాత్కాలికమే! 6 నుంచి 8 వారాల పాటు తేలిక పాటి ఆహారం తీసుకుంటూ విశ్రాంతి తీసుకుంటే పరిస్థితి చక్కబడుతుంది.

హెపటైటిస్ బి, సి: ఇవి ప్రమాదకరమైన వైరస్‌ల కారణంగా సోకుతాయి. రక్తప్రవాహం ద్వారా కాలేయానికి వైరస్ సోకగానే లక్షణాలు మొదలవుతాయి. లక్షణాలు కామెర్లను పోలినట్టే ఉన్నా, సమర్థమైన చికిత్స అందక పోతే, క్రమేపీ కాలేయాన్ని నాశనం చేస్తాయి. టూకీగా చెప్పాలంటే హెపటైటిస్ బి వైరస్‌లు కాలేయ కణాల్లోకి చొరబడి వాటి డిఎన్ఎల స్థానాల్ని ఆక్రమిస్తాయి. హెపటైటిస్ సి వైరస్ కూడా కాలేయ కణాల్ని పాడు చేస్తుంది. ఆ క్రమంలో కాలేయం ఫైబ్రోసిస్, సిర్రోసిస్, లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్... ఇలా ఒక్కో దశ దాటుకుంటూ చివరకు ప్రాణాంతక స్థితికి చేరుస్తుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ప్రమాదకర వైరస్‌లు సోకే వీలున్న మార్గాలన్నిటినీ మూసేయాలి. అదెలాగంటే...

శరీర ద్రవాలు: హెపటైటిస్ బి, సి వైరస్‌లు కలిగిన వ్యక్తులను లైంగికంగా కలవకూడదు

రక్తమార్పిడి: రక్తం ఇచ్చినా, తీసుకున్నా సిరంజీల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

ఇంజెక్షన్లు: తీసుకునే ప్రతి ఇంజెక్షన్ కొత్తదై ఉండాలి

- బ్యూటీ పార్లర్‌లో వాడే సౌందర్య పరికరాల వల్ల కూడా సోకవచ్చు. కాబట్టి ఆ విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి
- సెలూన్లలో వాడే రేజర్ల వల్ల కూడా ఈ వైరస్‌లు సోకుతాయి. కాబట్టి సొంత రేజర్ తీసుకెళ్లాలి


ఇన్ని మార్గాల్లో ఇన్ని రకాల హెపటైటిస్ వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది కామెర్లను నిర్లక్ష్యం చేయకూడదు. కాలేయం జబ్బు పడకుండా ఉండాలంటే, తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పరీక్షలతో సోకిన వైరస్ రకాన్ని కనిపెట్టి, వైద్యుల పర్యవేక్షణలో తగిన చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ ఆశా ఎమ్.సుబ్బలక్ష్మి
గ్యాస్ట్రోఎంటరాలజీ అండ్ లివర్ డిసీసెస్ స్పెషలిస్ట్,
హైదరాబాద్.

బొబ్బర్లు తిందాం.. రండి

బొబ్బర్లను అలసందలు అని కూడా పిలుస్తుంటారు. వీటిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. బొబ్బర్లను తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- బొబ్బర్లలో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. శాకాహారులకు మంచి ఆహారమని చెప్పవచ్చు. వీటిని తినడం వల్ల కండరాలకు శక్తి లభిస్తుంది. వ్యాయామం చేసిన తరువాత ఒక కప్పు ఉడికించిన బొబ్బర్లు తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది.
- బొబ్బర్లలో పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ వేగవంతమవుతుంది. కడుపులో ఆమ్లత్వం, అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలు తగ్గుతాయి. పేగులు శుభ్రపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది. రక్తనాళాల్లో అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది. బొబ్బర్లు ఆకలిని నియంత్రించి శరీరం బరువు పెరగకుండా కాపాడతాయి.
- బొబ్బర్ల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. వీటిలో కేలరీలు కూడా నామమాత్రంగానే ఉంటాయి. కాబట్టి మధుమేహం ఉన్నవారు, అధిక బరువుతో బాధపడేవారు వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది.



- బొబ్బర్లలో గర్భిణులకు అవసరమైన ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది గర్భస్థ శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుంది. అలాగే శిశువుల్లో పుట్టుక లోపాలు ఏర్పడకుండా కాపాడుతుంది.
- బొబ్బర్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కారకాలను నిరోధిస్తాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. బొబ్బర్లను తినడం వల్ల అకాల వార్ధక్యం దరిచేరదు.
- బొబ్బర్లలో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, జింక్, మాంగనీస్ లాంటి మినరల్స్ ఉంటాయి. తరచూ బొబ్బర్లను ఆహారంలో చేర్చుకోవడం వల్ల నీరసం తగ్గి ఉత్సాహంగా అనిపిస్తుంది. కంటిచూపు మెరుగుపడుతుంది. ఎముకలు బలోపేతమవుతాయి. మహిళల్లో రక్తహీనత సమస్య తగ్గుతుంది.

చలికాలంలో వెచ్చగా ఇలా

చలికాలంలో వీచే చల్లని గాలుల వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గి వణుకు పుడుతుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు.

- చలికాలంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే మందపాటి దుస్తులు ధరించాలి. ఊలుతో తయారుచేసిన స్వెటర్లు వేసుకున్నా వెచ్చని అనుభూతి కల్గుతుంది.
- చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్, తలకు క్యాప్ ధరించాలి. దీనివల్ల శరీరం ఉష్ణోగ్రతను కోల్పోకుండా వెచ్చగా ఉంటుంది.
- వేడి వేడిగా కాఫీ, టీ, సూప్ తాగితే శరీరంలో అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి వణుకు తగ్గుతుంది. దాహం అనిపించక పోయినా తరచూ గోరువెచ్చని నీరు తాగుతుంటే చలి నుంచి ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్ సమస్యలు కూడా రావు.
- అల్పాహారం, భోజనం, స్నాక్స్‌లను వేడిగా ఉన్నప్పుడే తినాలి. దీనివల్ల శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది.
- చలిగా ఉందంటూ ముడుచుకుని పడుకుంటే కండరాలు పట్టేస్తాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉంటే శరీరంలో రక్తప్రసరణ వేగం పెరిగి వేడి ఉత్పత్తి అవుతుంది. దీంతో వణుకు తగ్గి వెచ్చగా, ఉత్సాహంగా అనిపిస్తుంది.



- చలికాలంలో రోజూ ఉదయం పూట ఎండలో కాసేపు నడిస్తే శరీరం తగినంత వేడిని గ్రహిస్తుంది. అలాగే గోరువెచ్చని నీటితో స్నానం చేస్తూ ఉంటే శరీరం వెచ్చగా ఉంటుంది.
- శీతాకాలంలో రోజూ తినే ఆహారంలో పసుపు, అల్లం, దాల్చిన చెక్క, మిరియాలు లాంటి మసాలా దినుసులు చేర్చుకుంటే శరీర ఉష్ణోగ్రత పెరిగి వణుకు తగ్గుతుంది.

అభినయం



వయసు చిన్నదే. కానీ వందకు పైగా ప్రదర్శనలు... ప్రముఖుల ప్రశంసలు. ఆహూతులను కట్టిపడేసే అభినయం... కూచిపూడి నృత్యంలో నవ కెరటం... బడిగింజల వెంకటయామిని. 'తెలుగు నేలపై పుట్టిన నాట్య కళను విశ్వవ్యాప్తం చేయాలనే దృఢ సంకల్పంతో అడుగులు వేస్తున్నా' అని అంటున్న యామినితో 'నవ్య' ముచ్చట్లు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల'లో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న యామిని... చిన్నప్పుడే పలు నాట్య పోటీల్లో పాల్గొంది. స్థానికంగానే కాదు... రాష్ట్రంలో ఎక్కడ ఏ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించినా... అందులో ఆమె ప్రదర్శన ఉండాల్సిందే. లయబద్ధమైన తన నాట్యాభినయంతో ఆహూతులను అంతలా ఆకట్టుకుంటోంది. ఎందరో అభిమానులను సంపాదించుకుంది.

నాట్యంలో నవ కెరటం

అద్భుతమైన నర్తనంతో సభికులను కట్టిపడేస్తున్న కూచిపూడి కళాకారిణి యామిని. ఆ నాట్యంలో తనదైన ముద్ర వేయాలని తపిస్తోంది. కడప జిల్లా ప్రొద్దుటూరులోని దొరసానిపల్లెకు చెందిన బడిగింజల వెంకటమనోహర్, శ్రీలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె యామిని. చిన్నప్పటి నుంచి ఆమెకు డ్యాన్స్‌పై ఎంతో మక్కువ. దాన్ని గమనించిన తల్లిదండ్రులు... ఆమెకు సరైన శిక్షణ ఇప్పించాలని అనుకున్నారు. అయితే 'ఆడపిల్లకు డ్యాన్సులు నేర్పి బయటకు పంపడం ఏంటని' బంధువులు కొందరు ఆక్షేపించారు. కానీ ఆమె తల్లిదండ్రులు వాటిని పట్టించుకోలేదు. ఏడేళ్ల వయసులో స్థానిక 'నటరాజ కళాక్షేత్రం'లో చేర్చారు. గురువు పఠాన్ మొహిద్దీన్ వద్ద కూచిపూడి శిక్షణ ప్రారంభించిన యామిని... తక్కువ సమయంలోనే నాట్యంపై పట్టు సంపాదించింది. గురువు సమక్షంలో మెరుగులు అద్దుకుంది. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరుకుంది.

వేదిక ఏదైనా...

ప్రొద్దుటూరులోని 'శ్రీ వెంకటేశ్వర

ప్రశంసలు... పురస్కారాలు...

పదేళ్ల కూచిపూడి నాట్య ప్రస్థానంలో యామిని వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో కూడా కూచిపూడి వైభవాన్ని చాటింది. పలువురు ముఖ్యమంత్రులు, రాజకీయ రంగ ప్రముఖులు, ప్రసిద్ధ కళాకారుల సమక్షంలో నర్తించి, ప్రశంసలు అందుకుంది. అత్యద్భుతమైన ప్రతిభకు గానూ ఇప్పటికి యాభైకి పైగా అవార్డులు ఆమెను వరించాయి. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఇటీవల వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలోనూ, యూత్ ఫెస్టివల్‌లోనూ ఆమె ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బహుమతులు గెలుచుకుంది. అరుణాచలం తదితర ప్రముఖ దేవాలయాల్లోనే కాకుండా, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వంటి ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక వేదికలపై తన నర్తనతో కళాభిమానులను అలరించింది. దూరదర్శన్ నిర్వహించిన ఆడిషన్స్‌లో ఎంపికైన యామిని... నాట్యమే శ్వాసగా జీవిస్తోంది.



• ఎస్.రవికుమార్
ప్రొద్దుటూరు

గురువుగా స్థిరపడాలని

కూచిపూడిని విశ్వవ్యాప్తం చేసి, మరింత ఆదరణ కల్పించాలనేది నా ఆకాంక్ష. అంతేకాదు... నాట్యంలో గిన్నిస్ రికార్డు నెలకొల్పాలనేది నా లక్ష్యం. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో కూచిపూడి డిప్లమా కోర్సు పూర్తి చేశాను. డిగ్రీ తరువాత పీజీ చేయాలని అనుకొంటున్నాను. భవిష్యత్తులో నాట్య గురువుగా స్థిరపడాలనేది నా కోరిక. ఉన్నత చదువులు చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయి... నిజమే. కానీ కూచిపూడి లాంటి సంప్రదాయ కళల్లో రాణిస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కుతాయి. నాట్యంవల్ల ఏకాగ్రత పెరుగుతుంది. మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఒత్తిడి దూరం అవుతుంది. ఫలితంగా చదువులోనూ ముందుంటాము. నాట్యాన్ని కెరీర్‌గా ఎంచుకొనేవారికి మంచి ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయి. **- యామిని**

విజేత



ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 11 గిన్నిస్ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది చండీగఢ్‌కు చెందిన జాన్వి జిందాల్. యూట్యూబ్ వీడియోల ద్వారా ఫ్రీస్టైల్ స్కేటింగ్ మీద పట్టు పెంచుకున్న 17 ఏళ్ల జాన్వి గురించిన ఆసక్తికరమైన కథ ఇది.

యూట్యూబే గురువు... 11 గిన్నిస్ రికార్డులు

ఇప్పటివరకూ అత్యధిక సంఖ్యలో 19 గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్న భారతీయుడిగా మాజీ క్రికెటర్, సచిన్ టెండూల్కర్ పేరు పొందారు. ఇప్పుడు ఆయన తర్వాతి స్థానాన్ని జాన్వి జిందాల్ దక్కించుకుంది. మునుపు 5 గిన్నిస్ ప్రపంచ రికార్డులను కలిగి ఉన్న జాన్వి, తాజాగా మరో ఆరు కొత్త ప్రపంచ రికార్డులను నెలకొల్పింది. 30 సెకన్ల ఇన్‌లైన్ స్కేట్స్‌లో అధిక 360 డిగ్రీల భ్రమణాలు, ఒక నిమిషంలో అత్యధిక 360 డిగ్రీల భ్రమణాలు, 30 సెకన్లలో అత్యధిక వన్ వీల్డ్ 360 డిగ్రీల భ్రమణాలు.. ఇలా మొత్తం ఆరు కొత్త రికార్డులతో అతి పిన్న వయసులో, అత్యధిక గిన్నిస్ రికార్డులు దక్కించుకున్న తొలి భారత మహిళగా జాన్వి గుర్తింపు తెచ్చుకుంది. చండీగఢ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న జాన్వి, ఆన్‌లైన్ వీడియోల ద్వారా, తండ్రి మార్గదర్శకత్వంలో ఫ్రీస్టైల్ స్కేటింగ్ మీద పట్టు పెంచుకుంది. జాతీయ స్కేటింగ్ పోటీలో ఇప్పటికే మూడు స్వర్ణ, రెండు కాంస్య, రెండు రజత పతకాలు గెలుచుకున్న జాన్వి జాతీయ పోటీల కోసం సన్నద్ధమవుతోంది.

ఆసక్తి మొదలైందిలా...

కుస్తీ పోటీలకు స్వయంగా శిక్షణ ఇచ్చి, అంతర్జాతీయ వేదికల మీద కూతుళ్లను గెలిపించుకున్న తండ్రీకూతుళ్ల కథ... దంగల్ సినిమాగా విడుదలై ప్రపంచవ్యాప్త ప్రజాదరణ పొందిందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఇదే సినిమా ఎంతోమందికి క్రీడల పట్ల ఆసక్తిని కూడా పెంచింది. జాన్వి తండ్రిని కూడా ఈ సినిమా ఎంతో ఆకట్టుకుంది. తాను కూడా కూతుర్ని క్రీడలకు సంసిద్ధం చేయాలని నిర్ణయించుకున్న తండ్రి మునిష్ జిందాల్, జాన్వికి 8 ఏళ్ల వయసు నుంచే శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాడు. 8వ ఏట జాన్వి, రివర్ జంపింగ్‌లో భాగంగా 30 అడుగుల ఎత్తు నుంచి ఏకంగా మూడుసార్లు దూకి, తన క్రీడా ప్రతిభను చాటుకుంది. సాటి పిల్లలు వెనకడుగు వేసే ఆ విన్యాసంతో జాన్వి తనలోని ధైర్యాన్నీ, క్రీడాస్ఫూర్తినీ చాటుకుంది. ఆ తర్వాత ఏడాదికి ఫ్రీస్టైల్ స్కేటింగ్ పట్ల తనకు మక్కువ ఏర్పడినట్టు గ్రహించి, ఎటువంటి అనుభవజ్ఞుల దగ్గర శిక్షణ తీసుకోకుండానే, కేవలం యూట్యూబ్ వీడియోల ద్వారా ఆ క్రీడలో నైపుణ్యం సాధించి, ప్రపంచ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. ఆమె అసాధారణమైన క్రీడా ప్రయాణం గురించి తండ్రి, మునిష్ మాట్లాడుతూ... 'ఎటువంటి శిక్షణ, ప్రత్యేకమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్తోమతా లేకుండానే మా అమ్మాయి క్రీడలో సత్తా చాటుకుని, ఆధునిక భారతదేశపు చిహ్నంగా మారింది. మక్కువ ఉన్నవాళ్లెవరికైనా నేడు జ్ఞానసముపార్జనకు సరిహద్దులు ఉండవనడానికి మా అమ్మాయే ఉదాహరణ. జాన్వి ఇంటర్నెట్‌నే వ్యక్తిగత కోచింగ్ అకాడమీగా మలుచుకుంది. దాన్నుంచే మెలకువలు నేర్చుకుని, సాధనతో ఈ స్థాయికి ఎదగగలిగింది' అంటూ మీడియాతో చెప్పుకొచ్చారు.

మరిన్ని పతకాలు తెచ్చేస్తా...

జాన్వి, తాను సాధించిన విజయం గురించి మాట్లాడుతూ...'మరిన్ని రికార్డులు నెలకొల్పి ఎటువంటి వనరులూ, మద్దతూ లేకపోయినా, కలలను నిజం చేసుకోవాలనుకునే యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా మారాలనుకుంటున్నాను. ఇతరులకు ప్రేరణగా మారడం కోసం సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని, నా ప్రయాణాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. జాతీయ స్కేటింగ్ పోటీలకు ప్రొఫెషనల్ కోచింగ్, బలమైన మద్దతు వ్యవస్థలు అవసరం. వాటితో నా దేశానికి మరిన్ని పతకాలు తెచ్చిపెట్టగలుగుతాననే నమ్మకం నాకుంది' అంటోంది జాన్వి జిందాల్. భటిండాలోని రాంపురా ఫూల్ ప్రాంతానికి చెందిన జాన్వి తండ్రి, మునిష్ జిందాల్ మాట్లాడుతూ....'నాతో పాటు దేశం గర్వించదగిన విజయమిది. 17 ఏళ్ల వయసులోనే మా అమ్మాయి, 11 గిన్నిస్ ప్రపంచ రికార్డులు సృష్టించిన ఏకైక యువతిగా చరిత్ర సృష్టించింది. ముందుముందు జాన్వి మరిన్ని రికార్డులు నెలకొల్పగలుగుతుందని భావిస్తున్నా' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కారాగారం.. ఆమెకు దేవాలయం

"తప్పులు చేయడం మానవ సహజం. ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నవారికి... తమ నడవడికను మార్చుకొని, సాధారణ జీవితం గడపగలిగే అవకాశాన్ని సమాజమే ఇవ్వాలి" అని చెబుతారు అరుణా సరీన్. ఇరవయ్యేళ్లకు పైగా మధ్యప్రదేశ్‌లోని పలు కారాగారాల్లో యోగ, నైపుణ్య శిక్షణ, ప్రసంగాల ద్వారా వేలాది ఖైదీల్లో మార్పునకు ఆమె దోహదం చేస్తున్నారు. ఇది కూడా దైవానికి చేస్తున్న సేవగానే భావిస్తున్నానంటున్న 83 ఏళ్ల అరుణ అరుదైన ప్రయాణం ఇది.

"అధ్యాపకురాలుగా, గృహిణిగా తీరిక లేని జీవితం గడిపిన నేను... ఖైదీల శ్రేయస్సు కోసం పని చేస్తానని ఎన్నడూ అనుకోలేదు. దీనికి కారణం ఢిల్లీకి చెందిన మంజు గోయెల్ అని చెప్పాలి. మంజు... ఢిల్లీలో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సంస్థలో పని చేసేవారు. తన తల్లిదండ్రులను కలుసుకోడానికి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వచ్చారు. అప్పటికే నేను కూడా అక్కడ 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' కార్యకర్తగా పని చేస్తున్నాను. స్థానిక జైలులో ఒక కోర్సును నిర్వహించాలని మంజు అనుకున్నారు.. నన్ను కూడా తోడుగా రమ్మన్నారు. అలా మొదటిసారిగా జబల్‌పూర్ కారాగారంలో మొదటిసారి అడుగు పెట్టాను. ఆ తరువాత... ఆదివారాలు, సెలవు దినాలు మినహా... మిగిలిన అన్ని రోజులూ జైలును సందర్శిస్తూనే ఉన్నాను. అందరూ రోజూ గుడికి ఎలా వెళ్తారో... నేను జైలుకు అలా వెళ్తూ ఉంటాను.

నా భర్తకు నచ్చేది కాదు...

నా భర్త కల్నల్ సరీన్ సైన్యంలో పని చేసేవారు. ఆయన ఉద్యోగ రీత్యా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉండాల్సి వచ్చింది. నేను వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలిని. నా భర్తకు జబల్‌పూర్ బదిలీ అయినప్పుడు... అక్కడే కేంద్రీయ విద్యాలయలో టీచర్‌గా చేరాను. అప్పుడే 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'కు సంబంధించిన ఒక కరపత్రాన్ని చూశాను. అందులో పేర్కొన్న అంశాలు నన్ను ఆకర్షించాయి. ఆ సంస్థలో చేరి... విపశ్యన ధ్యానం అభ్యసించాను. అయితే నా భర్తకు ఇదంతా పెద్దగా నచ్చేది కాదు. నన్ను 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' క్యాంపస్ దగ్గర వదిలేసి వెళ్ళేవారు. ఒక రోజు అక్కడి నిర్వాహకులు ఆయనను కూడా అభ్యాసం చెయ్యాలని కోరారు. "సరే, మీరు చెబుతున్నారు కాబట్టి ఈ రోజు చేస్తాను. రేపటి నుంచి ఈ వైపు రానే రాను" అన్నారాయన. కానీ ఆయన కూర్చొని, అభ్యాసం చేసిన తరువాత... రోజూ రావడం మొదలుపెట్టారు. పదవీవిరమణ చేశాక... ఆ సంస్థ నిర్వహించే పలు కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యారు. నేను కూడా ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఇద్దరం కలిసి ఆ సంస్థలో పని చేసేవాళ్ళం. ఇంతలో నా భర్త హఠాత్తుగా మరణించారు. తీవ్రమైన వేదనకు గురైన నాకు ఆధ్యాత్మికతే ఆలంబనగా నిలిచింది.

23 ఏళ్ల నుంచి...

ఆరు నెలల తరువాత... 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'లో యోగా టీచర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నాను. ఆ సంస్థ తరఫున వివిధ ప్రాంతాల్లో బోధన ప్రారంభించాను. అంతకుముందే మంజూ గోయెల్‌కు తోడుగా జబల్‌పూర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ కేంద్ర కారాగారానికి వెళ్ళాను. మేము ఖైదీలను కలుసుకున్నాం. వారితో మాట్లాడాం. వారి కోసం యోగా తరగతులు నిర్వహించాం. మహిళా ఖైదీలతో, జైలు అధికారులతో, సిబ్బందితో కలిసి భోజనం చేశాం. మా తరగతులకు వచ్చిన స్పందన గమనించిన అధికారులు... వాటిని కొనసాగించాల్సిందిగా కోరారు. మంజు తిరిగి ఢిల్లీ వెళ్ళాల్సి ఉండడంతో... ఆ బాధ్యతను నేనే స్వీకరించాను. అప్పటి నుంచి... ఇరవై మూడేళ్ళుగా దాదాపు ప్రతి రోజూ ఉదయం జైళ్ళకు వెళుతున్నాను. ఇండోర్, భోపాల్, సత్నాలతో సహా మధ్యప్రదేశ్‌లో పదికి పైగా కారాగారాల్లో కార్యక్రమాలు నిర్వహించాను. అవి సాధారణంగా మూడు గంటల సేపు కొనసాగుతాయి. ధ్యానం, శ్వాస తీసుకోవడంలో టెక్నిక్స్ లాంటి వాటితో కూడిన హ్యాపీనెస్ ప్రోగ్రామ్, సుదర్శన క్రియతో కూడిన అడ్వాన్స్‌డ్ కోర్సులు దీనిలో ప్రధానంగా ఉంటాయి. ఒత్తిడి కలిగించే కోర్టిసోల్ లాంటి హార్మోన్లను గణనీయంగా తగ్గించడానికి, రోగనిరోధక వ్యవస్థను పటిష్ఠ పరచడానికి, ఒత్తిడి నుంచి విముక్తికి, మెదడు పనితీరు మెరుగుపరచడానికి ఇవి దోహదం చేస్తాయి."



అలాంటివి తగ్గాయి...

ఇన్నేళ్ళలో నేను 50 వేలమందికి పైగా ఖైదీలతో తరగతులు నిర్వహించాను. మహిళలకు ముత్యాల ఆభరణాలు, బొమ్మలు తయారీ, బ్యూటీషియన్ కోర్సులు, పురుషులకు వాహనాల మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు తదితరాల్లో శిక్షణ కూడా మా సంస్థ నేతృత్వంలో అందించాం. జబల్‌పూర్ కారాగారంలో ఒక చిన్న తయారీ యూనిట్ ఏర్పాటుకు దోహదం చేశాం. యోగాభ్యాసం, ధ్యానం, నైపుణ్య శిక్షణ తదితరాల వల్ల ఖైదీల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఖైదీల మధ్య కొట్లాటలు, ఆగ్రహావేశాలు చాలా ఎక్కువగా ఉండేవి. మత్తుపదార్థాలకు అలవాటుపడినవారు డిప్రెషన్‌కు గురై, చేతులు కోసుకోవడం లాంటి చర్యలకు పాల్పడేవారు. జైలు నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారు. మా కార్యక్రమాలతో వారిలో పరివర్తన వచ్చింది. 'రెడ్ క్రాస్' సంస్థతో కలిసి డి-అడిక్షన్ తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. ఎంతోమంది ఖైదీలు తమ సమస్యలను నాకు వినిపిస్తారు. జీవితంలో ఇకపై తప్పులు చెయ్యబోమనీ, గౌరవంగా జీవిస్తామనీ చెబుతారు. వారందరిలో అధికశాతం పరిస్థితులకు బాధితులు. వారిలో మార్పుకోసం దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నేను అంకితం కావడం... దైవ సంకల్పంగా భావిస్తున్నాను.

అదనపు ఆదాయంపై ఆర్టీసీ దృష్టి

- బస్సులు, టికెట్లపైనా వాణిజ్య ప్రకటనలు
- ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రాక్టు విధానానికి స్వస్తి
- యాడ్ ఏజెన్సీల నుంచి ప్రకటనల స్వీకరణకు కసరత్తు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయం సమకూర్చుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇప్పటికే బస్సు సీట్లు, సిటీ బస్సుల్లో హ్యాండిళ్లపై ప్రకటనలు ఇస్తుండగా.. కొత్తగా బస్సుల బయటి వైపు ప్రకటనలతో ఆదాయం పొందేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న కాంట్రాక్టు పద్ధతిలో ప్రకటనలకు సంబంధించిన మొత్తాలను ఆయా సంస్థలు సకాలంలో ఆర్టీసీకి చెల్లించడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని యాడ్ ఏజెన్సీల నుంచి ప్రకటనలు స్వీకరించాలని అధికారులు భావిస్తున్నారు. ఆయా ప్రకటనలకు సంబంధించిన మొత్తాన్ని ముందుగానే తీసుకొని, సదరు యాడ్ ఏజెన్సీకి కమీషన్ చెల్లించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు బస్సుల బయటి వైపు ప్రకటన బోర్డుల ఏర్పాటుకు సంబంధించిన నమూనాను సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి బస్‌భవన్‌లో బుధవారం పరిశీలించారు. అలాగే, బస్సుల్లో ఇస్తున్న టికెట్ వెనుక భాగంపైనా ప్రకటనలు ముద్రించడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు.. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులు భోజనం, టిఫిన్ చేసేందుకు ఆయా మార్గాల్లోని దాబాలు, హోటళ్ల వద్ద ఆపుతున్న విషయం తెలిసిందే. ఆయా హోటళ్లు, దాబాల నుంచి గుడ్ విల్ పొందే విషయంపైనా సమాలోచనలు చేస్తున్నారు. ఎంపిక చేసిన దాబాలు, హోటళ్లలో ఆహారం నాణ్యత, శుచి, శుభ్రత వంటి అంశాలను అధికారుల బృందం పరిశీలించి, అంతా ఓకే అనుకున్న తర్వాత వారితో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. కాగా, సోషల్ మీడియా ద్వారా ప్రయాణికులకు మరింత చేరువ కావాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వేర్వేరు స్థాయి అధికారులు వినియోగించే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో సమాచారం అప్‌డేట్ అయ్యేలా చూస్తున్నారు. ఇందుకోసం ఆయా స్థాయిల్లో ప్రత్యేకంగా అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని బస్‌భవన్ అధికారులు నిర్ణయించారు.

కుమరం భీం జిల్లాను వణికిస్తున్న చలి

- తిర్యాణి మండలం గిన్నెధరిలో.. 7.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9 డిగ్రీలు.. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 9.5 డిగ్రీలు నమోదు

ఆసిఫాబాద్, సిరిసిల్ల, కోహీర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాలను చలి వణికిస్తోంది. పది రోజులుగా ఈ జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో తగ్గుముఖం పట్టడంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు చలికి గజగజలాడుతున్నారు. జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెధరిలో బుధవారం 7.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. కెరమెరిలో 8.8, సిర్పూర్(యు)10.3, వాంకిడిలో 11.1, చింతలమానేపల్లిలో 11.2, జైనూరులో 11.5, పెంచికల్‌పేట, రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాల్లో 11.6, లింగాపూర్‌లో 11.8, బెజ్జూర్, ఆసిఫాబాద్ మండలాల్లో 11.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు నెగళ్లు వేసుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం జిల్లాలో సరాసరి కనిష్ఠ ఉష్ణోగ్రత 9 డిగ్రీలుగా నమోదైంది. గంభీరావుపేటలో 9.5, బోయినపల్లిలో 10, చందుర్తిలో 10.4, వేములవాడ రూరల్‌లో 10.4, వీర్నపల్లిలో 10.7, తంగళ్లపల్లిలో 10.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పక్షం రోజుల నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. బుధవారం ఐదు గ్రామాల్లో స్వల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో కనిష్ఠంగా 9.5 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. కోహీర్‌లో 9.6, పోతిరెడ్డిపేట్ 9.6, ఝరాసంఘం 9.9, కంగ్టిలో 9.9 డిగ్రీలు నమోదయ్యింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

కాస్త పెరగనున్న రాత్రిపూట ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఈ నెల 22న ఒక అల్ప పీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 48 గంటల తర్వాత ఈ అల్ప పీడనం పశ్చిమ వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి ఈ నెల 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. తదుపరి 48 గంటల తర్వాత ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి నైరుతి బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అల్పపీడనం ప్రభావంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు రాగల 2 రోజుల్లో 12-17 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపింది.

హంగామా చేద్దాం!!

- నేడు హైదరాబాద్‌లో కోర్టుకు జగన్
- హడావుడి చేయాలని ప్రణాళిక
- తరలి రావాలని కార్యకర్తలకు సంకేతాలు
- తానొస్తే భద్రతా సమస్యలు తప్పవంటూ
- వ్యక్తిగత హాజరుకు డుమ్మా కొట్టే ఎత్తుగడ?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



అక్రమాస్తుల కేసులో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరేళ్ల తర్వాత కోర్టు మెట్లు ఎక్కనున్నారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అక్కడ తన పార్టీ శ్రేణుల ద్వారా నానా హడావుడి సృష్టించేందుకు రంగం సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. గురువారం ఉదయం 10.45 గంటలకు బేగంపేట విమానాశ్రయంలో దిగింది మొదలు నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు వెళ్లే దాకా... 'బలప్రదర్శన' చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'నేను కోర్టుకు ప్రత్యక్షంగా హాజరైతే భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయి' అంటూ సీఎంగా ఉన్నన్ని రోజులూ వ్యక్తిగత హాజరు నుంచి జగన్ మినహాయింపు పొందారు. 'మాజీ' అయ్యాకా అదే మినహాయింపు కొనసాగుతోంది. అయితే ఇటీవల ఆయన వ్యక్తిగతంగా తమ ముందుకు రావలసిందేనని కోర్టు తేల్చిచెప్పడంతో... గురువారం హాజరు కాక తప్పడం లేదు. ఇప్పుడు కూడా... 'భద్రతాపరమైన సమస్యల' సాకు చూపి, భవిష్యత్తులో కోర్టుకు హాజరు కాకుండా ఉండేందుకే వైసీపీ శ్రేణుల ద్వారా హైదరాబాద్‌లో... ముఖ్యంగా కోర్టు వద్ద హంగామా సృష్టించాలనే ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.

కోర్టులో గంటే ఉంటారంట!

జగన్ అక్రమాస్తుల కేసులో 'నిందితుడు'! కోర్టులో హాజరయ్యాక ఆయన ఎప్పుడు బయటికి వస్తారన్నది అక్కడి పరిస్థితులు, న్యాయాధికారి నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. కానీ... ఎన్నిగంటలకు కోర్టుకు వెళ్లేదీ, అక్కడ ఎంత సేపు ఉండేది కూడా జగనే నిర్ణయించుకున్నారు. గురువారం తన పర్యటనపై షెడ్యూలు విడుదల చేశారు. "11.30 గంటలకు సీబీఐ కోర్టుకు వెళ్లి... 12.30 గంటలదాకా అక్కడ ఉంటారు" అని అందులో తెలిపారు. అంటే... కోర్టులో ఎంతసేపు ఉండాలో నిందితుడే నిర్ణయిస్తారా అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

పోలీస్ కథతో...



అర్జున్ సర్జా, ఐశ్వర్యా రాజేశ్ జంటగా నటించిన చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేశ్ లక్ష్మణన్ దర్శకత్వంలో జి. అరుళ్‌కుమార్ నిర్మించారు. నిర్మాత ఏఎన్ బాలాజీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ 'ఇంటిలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. నిజాల్ని నిర్భయంగా వెలుగులోకి తేవాలని తపించిన ఓ సిన్సియర్ పోలీసాఫీసర్‌కు వృత్తి నిర్వహణలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయన్నది ఇతివృత్తం'అని చెప్పారు. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది అని దర్శకుడు చెప్పారు.

ఇది అభిమానుల సినిమా



రామ్ పోతినేని

"ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రం నన్ను చాలా భావోద్వేగానికి లోను చేసింది. ఈ కథకూ, ఇందులోని సాగర్ పాత్రకు కనెక్ట్ అయినంతగా ఇంతవరకూ ఏ చిత్రానికీ కనెక్ట్ అవ్వలేదు. వ్యక్తిగతంగా నాకు ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది' అని అన్నారు రామ్ పోతినేని. ఆయన కథానాయకుడిగా పి మహేశ్‌బాబు తెరకెక్కించిన చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ బేనర్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర కీలక పాత్రలో నటించారు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ పోతినేని మాట్లాడుతూ 'సినిమా, అభిమానుల విషయంలో ఎప్పటినుంచో నా మనసులో ఉన్న ఆలోచనలకి ప్రతిరూపమే ఈ చిత్రం. ఇది అభిమానుల సినిమా' అని అన్నారు. 'రామ్ కెరీర్‌లోనే గర్వకారణంగా మిగిలిపోయే చిత్రమిది.' అని పి. మహేశ్‌బాబు అన్నారు. 'విభిన్నమైన కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని చేశాం. చాలా కాలం మాట్లాడుకునేలా ఉంటుంది' అని వై.రవిశంకర్ తెలిపారు.

గుర్తుండిపోయే థ్రిల్లర్



రాజ్ తరుణ్, అమృత చౌదరి జంటగా రిత్విక్‌కుమార్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టార్టాయిస్'. శశిధర్, విజయ్‌కుమార్, సంతోశ్, రాంబాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలె ఈ చిత్రాన్ని ప్రారంభించారు మేకర్స్. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం కథ చాలా విభిన్నంగా ఉంటుంది. నా కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రం అవుతుంది' అని అన్నారు. 'ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే థ్రిల్లర్ ఇది' అని రిత్విక్ కుమార్ చెప్పారు.



ప్రేక్షకుల మదిలో నిలిచేలా ప్రేమంటే

నాగచైతన్య

'ప్రేక్షులను ఆకట్టుకునే మంచి ప్రేమకథా చిత్రం 'ప్రేమంటే'. దర్శకుడు ఓ కొత్త పాయింట్‌తో తెరకెక్కించారు. ప్రేక్షకుల మదిలో నిలిచిపోయేలా ఉంటుంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని నాగచైతన్య అన్నారు. ప్రియదర్శి ఆనంది జంటగా నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. పుస్కూర్ రామ్‌మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా నాగచైతన్య పాల్గొని సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో యువతరం దూసుకెళ్తోంది. ఇది మంచి పరిణామం. ఈ సినిమా అందర్నీ అలరిస్తుందన్న నమ్మకం ఉంది' అని తెలిపారు. టాలీవుడ్ చరిత్రలో 'ప్రేమంటే' ఓ మంచి చిత్రంగా మిగిలిపోతుంది' అని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. 'చిత్రబృందం సమష్టి కృషికి గొప్ప ఉదాహరణ ఈ చిత్రం' అని జాన్వీనారంగ్ పేర్కొన్నారు. 'ఈ చిత్రంతో ప్రేక్షకుల నుంచి మరింత ప్రేమ దక్కుతుందని ఆశిస్తున్నా' అని ప్రియదర్శి తెలిపారు.

సంగీత దర్శకుడిగా సంతృప్తినిచ్చింది



భీమ్స్ సిసిరోలియో

'ఇప్పటివరకూ నేను మాస్, ఫ్యామిలీ, యూత్‌ఫుల్ చిత్రాలకు మాత్రమే సంగీతం అందించాను. '12 ఏ రైల్వే కాలనీ' లాంటి ఒక థ్రిల్లర్‌కు తొలిసారి సంగీతం అందిస్తున్నాను. ఈ తరహా చిత్రాలకూ మంచి సంగీతం అందివ్వగలననే నమ్మకం ఈ చిత్రంతో కలిగింది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు కూడా అదే ఫీలవుతారు' అని భీమ్స్ సిసిరోలియో అన్నారు. అల్లరి నరేశ్ కథానాయకుడిగా నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా భీమ్స్ సిసిరోలియో మీడియాతో మాట్లాడారు. 'ఈ చిత్రంలో సౌండ్ విభిన్నంగా ఉంటుంది. కొత్త ఇన్‌స్ట్రుమెంట్స్ వాడాం. నిన్ననే సినిమా చూశాను. కొత్త తరహా అనుభూతి కలిగింది. ఈ సినిమా సంగీత దర్శకుడిగా నాకు సంతృప్తినిచ్చింది. అవుట్‌పుట్ చూశాక అల్లరి నరేశ్, దర్శక నిర్మాతలు అభినందించారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రస్తుతం 'భక్తమహాశయులకు విజ్ఞప్తి, మన శంకరవరప్రసాద్ గారు, డెకాయిట్, బైసన్ నాయుడు' తదితర చిత్రాలకు సంగీతం అందిస్తున్నాను' అని భీమ్స్ చెప్పారు.

రాణి మరియా బయోపిక్



పేదలు, మహిళా సాధికారత కోసం కృషి చేసిన సామాజిక కార్యకర్త, కేరళకు చెందిన సిస్టర్ రాణి మరియా జీవితం ఆధారంగా తెరకెక్కిన మలయాళ చిత్రం 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్'. షైషన్ పి.ఊసెఫ్ దర్శకత్వంలో సాండ్రా డిసౌజా రాణా నిర్మించారు. విన్సీ అలోషియస్ టైటిల్ పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత డాక్టర్ ఐ. లూర్దు రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా తెలుగు హక్కులు పొందినందుకు సంతోషంగా ఉంది. రాణి మరియా జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, ఆమె మరణం, హంతకుల పట్ల వారి కుటుంబం చూపిన క్షమాగుణం ప్రధానాంశాలుగా ఈ చిత్రం తెరకెక్కింది. వందకు పైగా అంతర్జాతీయ పురస్కారాలను గెలుచుకున్న చిత్రమిది' అని చెప్పారు.

ఈ తరాన్నీ అలరించే కొదమసింహం

చిరంజీవి



"కొదమసింహం' చిత్రం నాకూ, రామ్‌చరణ్‌కూ ఫేవరేట్ మూవీ. చిన్నప్పుడు వాళ్లమ్మ ఈ సినిమా క్యాసెట్ పెడితే తప్ప చరణ్ భోజనం చేసేవాడు కాదు. రీ రిలీజ్‌తో ఈతరం ప్రేక్షకులు కూడా 'కొదమసింహం' చిత్రాన్ని ఆస్వాదిస్తారు' అని చిరంజీవి అన్నారు. 1990లో విడుదలైన ఈ సినిమాను 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు విడుదల చేస్తున్నారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిరంజీవి వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. 'నాకు కౌబాయ్ చిత్రాలంటే ఇష్టం కావడంతో కథ వినగానే 'కొదమసింహం' చేసేందుకు అంగీకరించాను. ఈ తరం ప్రేక్షకులనూ అలరిస్తుంది. డాన్స్, ఫైట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. కైకాల నాగేశ్వరరావు మాట్లాడుతూ 'మంచి క్వాలిటీతో 'కొదమసింహం చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నాం. రాజ్‌కోటి సూపర్‌హిట్ సాంగ్స్‌తో పాటు నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. అప్పట్లో కొత్త తరహా పాత్రలో చిరంజీవి గారిని చూపించాలని ఈ సినిమా చేశాం' అని అన్నారు. ఈ సినిమా అంత గొప్పగా రావడానికి చిరంజీవి గారి పట్టుదలే కారణం అని దర్శకుడు మురళీమోహన్‌రావు అన్నారు.

రాజూ రాంబాయిల కథ



'మన కళ్ల ముందు జరుగుతున్న కథ అనే అనుభూతిని ఇచ్చే చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఒక ఊళ్లో కూర్చొని మన మధ్య జరుగుతున్న సంఘటనలను చూస్తున్నట్లే ఉంటుంది' అని నిర్మాత సాయికృష్ణ అన్నారు. అఖిల్ రాజ్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి, సాయికృష్ణ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. గాఢతతో నిండిన ప్రేమకథాంశంతో సాయిలు తీర్చిదిద్దారు. ఆయన నిజాయితీ వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చింది. గ్రామీణ పాత్రల్లో హీరో హీరోయిన్ల నటన సినిమాకు ప్రత్యేకార్షణ. దర్శకుడు వేణు ఊడుగుల నిర్మాణంలో పాలుపంచుకోవడంతో పాటు విలువైన సలహాలు ఇచ్చారు. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

స్పోర్ట్స్

వరంగల్ ● గురువారం 20 నవంబరు 2025

'హాల్ ఆఫ్ ఫేమ్'లో ఫెడరర్



న్యూయార్క్: టెన్నిస్ దిగ్గజం, స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెడరర్‌కు ప్రతిష్ఠాత్మక 'టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కింది. వచ్చే ఏడాదికిగాను ఆటగాళ్ల కేటగిరిలో రోజర్ ఒక్కడే ఈ పురస్కారానికి ఎంపికైనట్టు నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. 2026 ఆగస్టులో జరిగే వేడుకలో రోజర్‌కు హాల్ ఆఫ్ ఫేమ్ పురస్కారాన్ని అందజేస్తారు. ప్రొఫెషనల్ కెరీర్‌కు దూరమై ఐదేళ్లు దాటినవారిని ఆటగాళ్ల విభాగంలో హాల్ ఆఫ్ ఫేమ్ ఎంపికకు అర్హులుగా పరిగణిస్తారు.

క్వార్టర్స్‌లో అర్జున్ అవుట్

ముగిసిన భారత్ పోరు ● చెస్ వరల్డ్‌కప్

పనాజీ: చెస్ వరల్డ్‌కప్‌లో అర్జున్ ఇరిగేసి పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో అర్జున్ 1.5- 2.5తో వి యి (చైనా) చేతిలో ఓడాడు. దీంతో ఈ వరల్డ్‌కప్‌లో భారత కథ ముగిసింది. క్వార్టర్స్ టైబ్రేక్ తొలి గేమ్ డ్రా కాగా.. రెండో గేమ్‌లో అర్జున్ ఓటమి పాలయ్యాడు. జోస్ మార్టినెజ్ (మెక్సికో)పై సిండరోవ్ (ఉజ్బెకిస్థాన్), షంక్‌లాండ్ (అమెరికా)పై ఎసిపెంకో (రష్యా) గెలిచి సెమీస్ చేరారు.

రెండో రౌండ్‌లో లక్ష్య, ప్రణయ్

సిడ్నీ: స్టార్ షట్లర్ లక్ష్యసేన్, ప్రణయ్‌తోపాటు పలువురు భారత ఆటగాళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో లక్ష్యసేన్ 21-17, 21-13తో సు లీ యాంగ్ (తైపీ)ని చిత్తుచేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో ప్రణయ్ 6-21, 21-12, 21-17తో యోహానెస్‌పై, ఆయుష్ షెట్టి 21-11, 21-15తో యువాన్‌పై, తరుణ్ 21-13, 17-21, 21-19తో జొహాన్సెన్‌పై, కిడాంబి శ్రీకాంత్ 21-19, 19-21, 21-15తో లీ చియాపై నెగ్గాడు. అయితే కిరణ్ జార్జ్ నిషిమోటా చేతిలో పోరాడి ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

వేర్వేరు గ్రూపుల్లో భారత్, పాక్

అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్

దుబాయ్: జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరిగే అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ బుధవారం విడుదల చేసింది. ఈ టోర్నీ వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరగనుంది. వరల్డ్‌కప్‌లో పాల్గొంటున్న 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. అయితే, లీగ్ దశలో భారత్, పాక్ పరస్పరం తలపడే అవకాశం లేదు. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు న్యూజిలాండ్, బంగ్లాదేశ్, అమెరికా ఉండగా.. పాక్‌కు గ్రూప్-బిలో చోటు దక్కింది. భారత జట్టు జనవరి 15న ఆరంభ మ్యాచ్‌లో అమెరికాతో, 17న బంగ్లాతో, 24న న్యూజిలాండ్‌తో తలపడనుంది.

సైలెంట్ బుల్లెట్

ధనుష్ గురిపెడితే స్వర్ణమే



ధనుష్ శ్రీకాంత్.. భారత షూటింగ్‌లో సరికొత్త సంచలనం. వినలేడు.. మాట్లాడలేడు.. కానీ అతడి గన్ 'స్వర్ణా'లను గర్జిస్తోంది. టోక్యోలో జరుగుతున్న బధిర ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత స్వర్ణంతోపాటు మిక్స్‌డ్ విభాగంలో కూడా పసిడితో ఔరా.. అనిపించాడు 23 ఏళ్ల ధనుష్. సాధారణ షూటర్లకు దీటుగా నిలుస్తున్న ఈ హైదరాబాద్ కుర్రాడు.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాడు.



బొమ్మల సాయంతో..

ధనుష్‌కు పుట్టుక నుంచే వినబడదు. కానీ, అతడి తల్లిదండ్రులు మాత్రం ఎప్పుడూ ప్రత్యేక అవసరాలు కలిగిన వాడిగా చూడలేదు. షూటింగ్ పట్ల అతడి ఆసక్తిని గుర్తించి హైదరాబాద్‌లోని గగన్ నారంగ్ అకాడమీకి తీసుకెళ్లారు. అయితే, బధిరుడు కావడంతో కోచింగ్ ఇవ్వడం పెద్ద సవాల్‌గా మారింది. దీంతో డ్రాయింగ్‌లు, బొమ్మల సాయంతో ధనుష్‌కు శిక్షణ ఇవ్వడం ఆరంభించారు. అతడికి తల్లి ఆషా ఎంతో అండగా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు వెళ్లడం ఆరంభమైన తర్వాత నెమ్మదిగా సంజ్ఞా భాష నేర్చుకొన్నాడు.

జాతీయ జట్టుకు ఆడిన బధిరుడిగా..

2018 తెలంగాణ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్ బరిలోకి దిగిన ధనుష్ జూనియర్, యూత్, సీనియర్ విభాగాల్లో పతకాలు సాధించాడు. 2019లో ఖేలో యూత్ గేమ్స్‌లో పాల్గొని ఈ క్రీడల్లో మెడల్ సాధించిన తొలి బధిర ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు. 16 ఏళ్ల వయసులో 2019లో జరిగిన ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత అండర్-21 జట్టుకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో జాతీయ జట్టులో చోటుదక్కించుకొన్న తొలి బధిర షూటర్‌గా నిలిచాడు. అనేక ఈవెంట్లలో సత్తాచాటినా.. ట్రయల్స్‌లో విఫలమవడంతో 2022 ఆసియా క్రీడల్లో పోటీపడే చాన్స్ లభించలేదు. కానీ, అదే ఏడాది బ్రెజిల్ వేదికగా జరిగిన డెఫ్లింపిక్స్‌లో తలపడిన ధనుష్.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని సాధించాడు. డెఫ్లింపిక్స్‌లో దేశానికి తొలి బంగారు పతకం అందించిన షూటర్‌గా అందరి దృష్టిని ఆకర్షించాడు. మిక్స్‌డ్‌లో ప్రియేషా దేశ్‌ముఖ్‌తో కలసి మరో పసిడి కొల్లగొట్టాడు. తాజాగా టోక్యో డెఫ్లింపిక్స్‌లోనూ స్వర్ణాలను నిలబెట్టుకొని చరిత్ర సృష్టించాడు. 2023లో జూనియర్ వరల్డ్‌కప్‌లోనూ స్వర్ణంతో మెరిశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఫైనల్లో నిఖత్

ప్రపంచ బాక్సింగ్ కప్



గ్రేటర్ నోయిడా: సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తెలుగమ్మాయి నిఖత్ జరీన్ 21 నెలల అనంతరం తొలి అంతర్జాతీయ పతకాన్ని ఖరారు చేసుకుంది. ఈ తెలంగాణ స్టార్ ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో 51 కిలోల విభాగంలో టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. బుధవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో నిఖత్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ జెనీవా గుల్సెవార్‌ను చిత్తుచేసింది. ఈ ప్రదర్శనతో కనీసం రజతాన్ని ఖాయం చేసుకున్న నిఖత్.. స్వర్ణం కోసం చైనీస్ తైపీకి చెందిన గువా యి గ్జువాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. 29 ఏళ్ల నిఖత్ చివరిగా గతేడాది ఫిబ్రవరిలో స్ట్రాంజా మెమోరియల్ టోర్నీలో పతకం సాధించింది. ఇక, ప్రపంచ బాక్సింగ్ కప్‌లో నిఖత్‌తో పాటు మిగతా భారత బాక్సర్లు జాస్మిన్ లంబోరియా (57 కిలోలు), జాదూమణి సింగ్ (50 కిలోలు), పవన్ బర్త్వాల్ (55 కి), సచిన్ సివాచ్ (60 కి), హితేశ్ గులియా (70 కి) తమ విభాగాల్లో ప్రత్యర్థులను ఓడించి ఫైనల్ చేరారు. ఓవరాల్‌గా 15 మంది భారత బాక్సర్లు గురువారం జరిగే ఫైనల్స్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు.

ఆంధ్ర ఇన్నింగ్స్ విజయం

● సౌరభ్‌కు ఐదు వికెట్లు
● జార్ఖండ్‌తో రంజీ

జంషెడ్‌పూర్: సౌరభ్ కుమార్ (5/47), త్రిపురాన విజయ్ (3/39) విజృంభించడంతో.. గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్ 81 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. 239 పరుగుల లోటుతో.. ఆటకు నాలుగో, ఆఖరి రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 34/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జార్ఖండ్ 158 రన్స్‌కే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 328 పరుగులు చేయగా.. ఆంధ్ర 567/6 వద్ద డిక్లేర్ చేసింది. ఆంధ్రకు బోనస్ సహా 7 పాయింట్లు లభించాయి.

హైదరాబాద్ భారీ ఓటమి

281 పరుగులతో జమ్మూ గెలుపు

జమ్మూ: అబిద్ ముస్తాక్ (7/68) స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న హైదరాబాద్ ఘోర ఓటమిని చవిచూసింది. గ్రూప్-డిలో జమ్మూ కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 281 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 472 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు నాలుగో, ఆఖరి రోజైన బుధవారం 169/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 190 రన్స్‌కే కుప్పకూలింది. జమ్మూ 170, 422 స్కోర్లు చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 121 రన్స్ సాధించింది.

ప్రాంజలి జోడీకి పసిడి


కుశాగ్రకు కాంస్యం ● బధిర ఒలింపిక్స్

టోక్యో: బధిర ఒలింపిక్స్ (డెఫ్లింపిక్స్)లో భారత షూటర్లు మరో స్వర్ణ పతకాన్ని మన ఖాతాలో చేర్చారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్లో ప్రాంజలి ధూమల్/అభినవ్ దేశ్వాల్ ద్వయం పసిడి దక్కించుకుంది. ఫైనల్లో ప్రాంజలి జోడీ 16-6తో చైనీస్ తైపీ జంట యా జు కావో/మింగ్ జుయి సూను చిత్తుచేసి విజేతగా నిలిచింది. ఇరాన్ ద్వయానికి కాంస్యం దక్కింది. ఇక, 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో కుశాగ్రసింగ్ రజావత్ కాంస్యం నెగ్గి బుధవారం భారత్‌కు రెండో పతకాన్ని అందించాడు. ఫైనల్స్‌లో కుశాగ్ర 224.3 స్కోరుతో మూడో స్థానంలో నిలిచాడు. ఇప్పటిదాకా టోర్నీలో భారత షూటర్లు మొత్తం 11 పతకాలు కొల్లగొట్టారు.

హోప్ శతక్కొట్టినా..

విండీస్‌కు తప్పని ఓటమి
కివీస్‌దే వన్డే సిరీస్

నేపియర్: కెప్టెన్ షాయ్ హోప్ (69 బంతుల్లో 109 నాటౌట్) సెంచరీ చేసినా న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో వెస్టిండీస్‌కు పరాజయం తప్పలేదు. బుధవారం జరిగిన మ్యాచ్‌ను వర్షం వల్ల 34 ఓవర్లకు కుదించారు. తొలుత విండీస్ 247/9 స్కోరు చేసింది. ఛేదనలో కివీస్ 33.3 ఓవర్లలో 248/5 స్కోరు చేసి నెగ్గింది.



హోప్ అరుదైన రికార్డు: సెంచరీతో హోప్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్ హోదా కలిగిన అన్ని దేశాలపై శతకం చేసిన ఏకైక బ్యాటర్‌గా షాయ్ ఘనత సాధించాడు. ఓవరాల్‌గా హోప్‌కు ఇది 50 ఓవర్ల ఫార్మాట్‌లో 19వ సెంచరీ. దాంతో వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన రెండో వెస్టిండీస్ బ్యాటర్‌గా లారాతో హోప్ సమంగా నిలిచాడు. క్రిస్ గేల్ (25) అగ్రస్థానంలో ఉన్నాడు.

లక్షన్నర జనాభాగల దేశం..

'ఫిఫా' బెర్త్ పట్టేసింది



కింగ్‌స్టన్ (జమైకా): 2026 'ఫిఫా' వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన అతి చిన్న దేశంగా కురాకో చరిత్ర సృష్టించింది. కరీబియన్ సముద్రంలోని ఓ ద్వీపమైన కురాకో జనాభా కేవలం లక్షా 56 వేలు. 2018లో అతి తక్కువ జనాభా 3.50 లక్షలు కలిగిన ఐస్‌లాండ్ మెగా ఈవెంట్‌కు క్వాలిఫై అయింది. ఆ రికార్డును కురాకో బద్దలుకొట్టింది. క్వాలిఫయర్స్‌లో జమైకాతో మ్యాచ్‌ను కురాకో 0-0తో డ్రా చేసుకొంది. దీంతో గ్రూప్-బి టాపర్‌గా మెగా కప్ బెర్త్‌ను పట్టేసింది.

గర్ల్‌ఫ్రెండ్‌తో హార్దిక్ 'ముద్దు' ముచ్చట!





ముంబై: ప్రముఖ మోడల్ మహికా శర్మతో రిలేషన్‌షిప్‌లో ఉన్న టీమిండియా బ్యాటర్ హార్దిక్ పాండ్యా ఆమెతో కలిసున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. అందులో ఒక ఫొటోలో మహిక, హార్దిక్ సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయారు. మరో చిత్రంలో మహికాను హార్దిక్ బుగ్గపై ముద్దు పెడుతూ కనిపించాడు. మేరీల్యాండ్ యూనివర్సిటీ నుంచి కమ్యూనిటీ సైకాలజీలో డిగ్రీ అందుకున్న 31 ఏళ్ల మహిక.. ప్రస్తుతం మోడల్‌గా రాణిస్తోంది.

ఫిట్‌గా లేకపోయినా.. ఆడేందుకు గిల్ పట్టు?

గువాహటి: దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్‌కు ముందు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తీరు వివాదాస్పదంగా మారింది. మెడనొప్పితో బాధపడుతున్న గిల్‌ను వైద్యుల బృందం విశ్రాంతి తీసుకోవాలని సూచించినా.. పెడచెవిన పెట్టిన అతడు జట్టుతో కలసి గువాహటి చేరుకొన్నాడు. పూర్తి ఫిట్‌గా లేకపోయినా.. బరిలోకి దిగడానికే ఆసక్తి చూపిస్తున్నాడని సమాచారం. మెడనొప్పి చాలా వరకు తగ్గినా.. మ్యాచ్ ఫిట్‌నెస్ కష్టమేనని అంటున్నారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,860 ▲	1,14,450 ▲	1,73,000 ▲
విజయవాడ	1,27,000 ▼	1,20,000 ▲	1,60,000 ▲
విశాఖపట్నం	1,27,780 ▲	1,15,000 ▲	1,76,000 ▲
రాజమండ్రి	1,24,850 ▲	1,14,450 ▲	1,58,000 ▲
ప్రొద్దుటూరు	1,24,800 ▲	1,14,820 ▲	1,61,100 ▲
ముంబై	1,23,880 ▲	1,13,480 ▲	1,58,120 ▲

బజాజ్ ఆటో చేతికి కేటీఎం

న్యూఢిల్లీ: ఆస్ట్రియా కేంద్రంగా పనిచేసే బైక్‌ల తయారీ కంపెనీ కేటీఎం ఏజీ ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసినట్టు బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రకటించింది. యూరోపియన్ రెగ్యులేటరీ సంస్థల నుంచి అన్ని అనుమతులు లభించడంతో ఈ ప్రక్రియ పూర్తయినట్టు తెలిపింది.

టాప్-100 దేశీయ బ్రాండ్ల విలువ

రూ.46.32 లక్షల కోట్లు

» జీడీపీలో 13 శాతానికి సమానం
» హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్ బ్రాండ్

కాంటార్ నివేదిక

న్యూఢిల్లీ: భారత్‌లోని టాప్-100 బ్రాండ్ల మొత్తం విలువ ఈ ఏడాదిలో 52,350 కోట్ల డాలర్లకు (రూ.46.32 లక్షల కోట్లు) చేరుకుందని లండన్‌కు చెందిన మార్కెట్ రీసెర్చ్ కంపెనీ కాంటార్ వెల్లడించింది. ఇది భారత జీడీపీలో దాదాపు 13 శాతానికి సమానమని 'కాంటార్ బ్రాండ్స్ రిపోర్ట్ 2025' పేరుతో బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈసారి జాబితాలోని బ్రాండ్ల మొత్తం విలువ వార్షిక ప్రాతిపదికన 6 శాతం పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థలో బ్రాండ్ విలువ ప్రాముఖ్యత పెరుగుతున్నదని, అంతర్జాతీయ విస్తరణ ద్వారా మరింత వృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని నివేదిక అభిప్రాయపడింది.

మరిన్ని విశేషాలు...

- ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి దేశంలో అత్యంత విలువైన బ్రాండ్‌గా నిలిచింది. బ్యాంక్ బ్రాండ్ విలువ 18 శాతం వృద్ధితో దాదాపు 4,500 కోట్ల డాలర్లకు (రూ.3.98 లక్షల కోట్లు) చేరుకుంది. 2014లో బ్రాండ్స్ ఇండియా రిపోర్టు విడుదల చేయడం ప్రారంభమైన నాటి నుంచి ఈ బ్యాంక్ బ్రాండ్ విలువ నాలుగింతలకు పైగా పెరిగింది.
- దేశంలో అతి పెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 4,420 కోట్ల డాలర్ల (రూ.3.91 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో రెండో స్థానంలో ఉంది.
- 4,110 కోట్ల డాలర్ల (రూ.3.64 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో ఎయిర్‌టెల్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ (2,550 కోట్ల డాలర్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (2,060 కోట్ల డాలర్లు) వరుసగా 5, 6 స్థానాల్లో నిలిచాయి.
- 100 బ్రాండ్ల మొత్తం విలువలో టాప్-10 బ్రాండ్ల వాటా 47 శాతంగా ఉంది.
- బ్రాండ్ విలువ అత్యంత వేగంగా పెరుగుతున్న కంపెనీల్లో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానంలో ఉంది. జొమాటో బ్రాండ్ వేల్యూ గడిచిన ఏడాది కాలంలో 69 శాతం పెరిగింది.
- అల్ట్రాటెక్ సిమెంట్, హ్యుండయ్ సహా 18 కంపెనీలకు ఈ జాబితాలో తొలిసారి చోటు లభించింది. 111 విభాగాలకు చెందిన 1,620 బ్రాండ్లపై 1.45 లక్షల మంది వెల్లడించిన అభిప్రాయాల ఆధారంగా ర్యాంకింగ్‌లు కేటాయించడం జరిగిందని కాంటార్ వెల్లడించింది.

మోసాల కట్టడికి 1600 సిరీస్ ఫోన్ నంబర్లు

బ్యాంకులు జనవరి 1 నుంచే అమలు చేయాలి ● ట్రాయ్ ఉత్తర్వులు



న్యూఢిల్లీ: మోసపూరిత ఫోన్ కాల్స్ ద్వారా జరిగే ఆర్థిక నేరాల కట్టడికి ట్రాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ వంటి నియంత్రణ సంస్థల పరిధిలోని బ్యాంకులు, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీలు తమ కస్టమర్లకు చేసే సర్వీస్, లావాదేవీల ఫోన్ కాల్స్ కోసం తప్పనిసరిగా 1600 నంబర్ సిరీస్ ఫోన్ నంబర్లు మాత్రమే వాడాలని ఆదేశించింది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలకూ ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు, విదేశీ బ్యాంకులు ఈ నిబంధనలను వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచే అమలు చేయాలని ట్రాయ్ ఆదేశించింది. వాయిస్ కాల్స్ ద్వారా జరిగే ఆర్థిక మోసాలను కట్టడి చేసేందుకు ట్రాయ్ ఈ చర్య తీసుకుంది. దీంతో ఏది మోసపూరిత కాల్, ఏది నిజమైన కాల్ అని తెలుసుకునే అవకాశం ఈ సంస్థల ఖాతాదారులకు ఏర్పడనుంది. కాగా ఐఆర్‌డీఏతో జరుగుతున్న చర్చలు పూర్తయ్యాక బీమా కంపెనీలకూ ఈ సిరీస్ వర్తిస్తుందని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ ఆదేశాల ప్రకారం ఈ దిగువ సంస్థలు ఆయా తేదీల నుంచి 1600 సిరీస్ ఫోన్ నంబర్లు అమలు చేయాలి.

- మ్యూచువల్ ఫండ్ సంస్థలు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు మాత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి.
- క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లకు మార్చి 15, 2026 నుంచి.
- ఆర్‌బీఐ నియంత్రణలోకి వచ్చే పెద్ద ఎన్‌బీఎఫ్‌సీలు, పేమెంట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు (ఎస్ఎఫ్‌బీ) వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 లోగా.
- ఇతర ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, ఇతర చిన్న సంస్థలు 2026 మార్చి 1 నుంచి.
- కేంద్రీయ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీలు, పెన్షన్ ఫండ్ మేనేజర్లు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15లోగా.

రిలీఫ్ ర్యాలీతో మార్కెట్ దూకుడు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం బాగా పుంజుకుంది. సెన్సెక్స్ 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద ముగియగా నిఫ్టీ 142.60 పాయింట్ల లాభంతో 26,052.65 వద్ద క్లోజయింది. ఇంట్రా డేలో సెన్సెక్స్ 85,236.77 పాయింట్లు, నిఫ్టీ 26,074.65 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు, త్వరలోనే భారత-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న అంచనాలు బుధవారం సూచీలను లాభాల బాట పట్టించాయి. జపాన్, దక్షిణ కొరియా, హాంకాంగ్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నా, భారత మార్కెట్లు మాత్రం లాభాలతో ముగియడం విశేషం. అమెరికాలో ఏఐ బుడగ పేలితే ఎఫ్‌పీఐలు మళ్లీ పెద్ద ఎత్తున భారత మార్కెట్‌లో కొనుగోళ్లకు దిగుతాయన్న అంచనాలూ ఇందుకు దోహదం చేశాయి. అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వు మినిట్స్ కోసం మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోంది.

నేటి నుంచి ఇన్ఫోసిస్ బైబ్యాక్ : ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ బైబ్యాక్ గురువారం ప్రారంభం కానుంది. కంపెనీ మదుపరుల నుంచి రూ.18,000 కోట్లతో 10 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.1,800 చొప్పున బైబ్యాక్ చేయనుంది. దీంతో బీఎస్ఈలో బుధవారం ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 3.74 శాతం లాభంతో రూ.1,541.25 వద్ద ముగిశాయి. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రూ.23,098.48 కోట్లు పెరిగి రూ.6,40,297.11 కోట్లకు చేరింది.



కెనరా బ్యాంక్ @10,000

బెంగళూరులో కొత్త బ్రాంచ్ ఏర్పాటు

బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని కెనరాబ్యాంక్ 10 వేలు బ్రాంచ్‌ల మైలురాయిని చేరింది. 120వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని బుడిగెరె క్రాస్‌లో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేయడంతో ఈ రికార్డు నమోదు చేసింది. ఈ బ్రాంచిని బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజుతో కలిసి కేంద్ర ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు ప్రారంభించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	660
వరంగల్	632	గోదావరి	630
చిత్తూరు	663	విశాఖపట్నం	625
		దజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	114
కర్నూలు	117	నెల్లూరు	119
విశాఖపట్నం	110	అనంతపురం	119
గోదావరి	111		

జేపీ అసోసియేట్స్ రేసులో అదానీయే విజేత

రూ.14,535 కోట్ల బిడ్‌కు రుణదాతల కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ: ఆర్థికంగా దివాలా తీసిన జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్) ఎట్టకేలకు అదానీ గ్రూప్ పరమైంది. దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా జేపీ అసోసియేట్స్ రుణదాతల కమిటీ (సీఓసీ) అదానీ గ్రూప్ సమర్పించిన రూ.14,535 కోట్ల బిడ్‌కే ఆమోదం తెలిపింది. ఇతర బిడ్డర్లతో పోలిస్తే, అధిక మొత్తంలో అప్‌ఫ్రంట్ చెల్లింపులు (రూ.6,005 కోట్లు) ఆఫర్ చేసిన అదానీ బిడ్‌కే సీఓసీ మొగ్గుచూపింది. జేపీ అసోసియేట్స్‌ను చేజిక్కించుకునేందుకు అదానీ గ్రూప్, వేదాంత, దాల్మియా సిమెంట్స్ పోటీపడ్డాయి. ఈ మూడింటిలో అదానీ బిడ్‌కు 89 శాతం ఓట్లు వచ్చినట్లు తెలిసింది. దాల్మియా సిమెంట్, వేదాంత బిడ్లు ఆ తర్వాత స్థానంలో ఉన్నాయి. జేపీ అసోసియేట్స్ రియల్టీ, సిమెంట్ తయారీ, ఆతిథ్య సేవలు, విద్యుత్, ఇంజనీరింగ్ అండ్ నిర్మాణ రంగాల్లోకి విస్తరించింది. రుణదాతలకు రూ.57,185 కోట్లు బకాయిల చెల్లింపుల్లో విఫలమవడంతో గత ఏడాది జూన్‌లో ఈ గ్రూప్‌పై కార్పొరేట్ దివాలా పరిష్కార చర్యలు ప్రారంభమయ్యాయి.

ఏడబ్ల్యూఎల్‌లో మరో 13 శాతం వాటా విక్రయం : అదానీ గ్రూపు ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌లో (గతంలో అదానీ విల్మర్ లిమిటెడ్) మరో 13% వాటాను విల్మర్ ఇంటర్నేషనల్‌కు విక్రయించింది. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ ఈ కంపెనీలో 13% వాటాకు సమానమైన 16.9 కోట్ల ఈక్విటీ షేర్లను విల్మర్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ లెన్స్ పీటీఈ లిమిటెడ్‌కు విక్రయించింది. తదనంతరం ఏడబ్ల్యూఎల్‌లో అదానీ కమోడిటీస్ వాటా 20% నుంచి 7 శాతానికి తగ్గగా.. లెన్స్ పీటీఈ లిమిటెడ్ వాటా 56.94 శాతానికి పెరిగింది. ఎఫ్ఎంసీజీ వ్యాపారం నుంచి వైదొలిగి మౌలిక రంగ పోర్ట్‌ఫోలియోపై ప్రధానంగా దృష్టిని కొనసాగించే వ్యూహంలో భాగంగా ఏడబ్ల్యూఎల్‌లో 20% వాటాను విల్మర్‌కు రూ.7,150 కోట్లకు విక్రయించనున్నట్లు అదానీ గ్రూప్ ఈ జూలైలోనే ప్రకటించింది.

బొండాడతో అదానీ ఒప్పందం

హైదరాబాద్‌కు చెందిన బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్‌తో అదానీ గ్రూప్ దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న అదానీ గ్రూప్ కార్పొరేట్ కార్యాలయంలో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎండీ, సీఈఓ వినీత్ జైన్, బొండాడ ఇంజనీరింగ్ చైర్మన్/ఎండీ బీ రాఘవేంద్ర రావు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా అదానీ గ్రూప్ నిర్మించే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు బొండాడ ఇంజనీరింగ్ వ్యూహాత్మక డిజైన్, నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించనుంది. ఈ ఒప్పందం తొలి విడతలో భాగంగా అదానీ గ్రూప్ 650 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు పనులను బొండాడకు అప్పగించింది.

హెల్త్‌కేర్ బడ్జెట్ పెంచాలి: సంగీతా రెడ్డి

న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగాకి కేటాయింపులు పెంచాని ఈ రంగానికి ప్రాతినిధ్యం వహించే నాట్‌హెల్త్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతా రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. 'భవిష్యత్‌లో దేశ ఆరోగ్య రంగం బహుముఖ విస్తరణకు ఈ కేటాయింపులు ప్రారంభ వేదికగా మారాలి' అన్నారు. ఈ కేటాయింపులు ఈ రంగంలో మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సరికొత్త ఆవిష్కరణలకు దోహదం చేసేలా ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో మన దేశం ఇప్పటికే తన సత్తా నిరూపించుకుందని సంగీతా రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఈ రంగానికి కావలసిందల్లా విస్తరణకు అవసరమైన ఆర్థిక, విధాన పరమైన ప్రోత్సాహకాలు మాత్రమేనన్నారు. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం సైతం అవసరమన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుంటే భవిష్యత్ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రపంచంలోనే మేలైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మన దేశంలో అభివృద్ధి చేసుకోవచ్చని సంగీతా రెడ్డి సూచించారు.

ఆ భూమిలో జోక్యం చేసుకోవద్దు

» గుట్టల బేగంపేట భూమిపై హైడ్రాకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 16లో ఉన్న 10 ఎకరాల 20 గుంటల భూమి విషయంలో జోక్యం చేసుకోరాదని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. ఈ భూమి సున్నం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ హైడ్రా అధికారులు క్లియరింగ్, ఫెన్సింగ్ పనులు చేపట్టారు. దీంతో తమ భూమిలో హైడ్రా జోక్యం చేసుకోవడం చెల్లదని భూ యజమానులు వై అంతిరెడ్డి, మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. తమ భూమిని స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా అధికారులు ప్రయత్నించారని ఆరోపించారు. హైడ్రా తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. ఈ అంశంపై హైడ్రా నుంచి వివరాలు తెలుసుకొనేందుకు సమయం ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. రికార్డుల ప్రకారం 2002లోనే ఈ భూమిని రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 455 ద్వారా రెగ్యులరైజ్ చేసిందని గుర్తుచేసింది. సదరు భూమిలో హైడ్రా జోక్యం చేసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను డిసెంబరు 23వ తేదీకి వాయిదా వేసింది.

జూబ్లీహిల్స్ రోడ్డు భూసేకరణపై హైకోర్టు స్టే

» బాధితులందరికీ నోటీసులు ఇవ్వకపోవటంపై అభ్యంతరం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ విరించి ఆస్పత్రి నుంచి రోడ్డు నెంబర్ 12 మీదుగా అగ్రసేన్ జంక్షన్ వరకు ప్రతిపాదిత 100 ఫీట్ల రోడ్డు, అగ్రసేన్ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ప్రతిపాదిత 120 ఫీట్ల రోడ్డు కోసం భూసేకరణపై హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది. ఈ భూసేకరణ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ కే విక్రమ్‌దేవ్, మరో 20 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రతిపాదిత రోడ్డులో ఆస్తులు కోల్పోతున్న బాధితులందరికీ నోటీసులు జారీ కాలేదని.. అందువల్ల బాధితులకు అభ్యంతరాలు వ్యక్తంచేసే అవకాశం లభించలేదని ధర్మాసనం పేర్కొంది. ఈ అంశాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉండటంతోపాటు భూసేకరణ చట్టం - 2013 సెక్షన్ 11(1) కింద ప్రచురించిన నోటీసు చట్టబద్ధంగా లేదని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

మత్స్య సొసైటీల పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించొద్దు: హైకోర్టు

రాష్ట్రంలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వనపర్తి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో జిల్లా మత్స్యకారుల సహకార సొసైటీల పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించడానికి వీలు లేదని హైకోర్టు ఆదేశాలిచ్చింది. వారిని అదే పదవుల్లో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం, మత్స్యశాఖ కమిషనర్, కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ కం కమిషనర్, తెలంగాణ మత్స్య సహకార సొసైటీల ఫెడరేషన్ జీఎంలకు ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదిస్తూ.. ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించడం చెల్లదన్నారు. వాదనలు విన్న జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం.. తదుపరి విచారణ డిసెంబరు 16వ తేదీకి వాయిదా వేశారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్ ఏకే సింగ్

హైకోర్టులో మెగా మెడికల్ క్యాంప్

» ప్రారంభించిన చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, హైకోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, న్యాయమూర్తులు జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ నందా, జస్టిస్ తిరుమలాదేవి, జస్టిస్ గాడి ప్రవీణ్, జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ సుజన, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ బుధవారం ప్రారంభించారు. మూడురోజులపాటు నిర్వహించనున్న ఈ మెడికల్ క్యాంప్‌ను న్యాయవాదులు, అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ ఏకే సింగ్ సూచించారు. ఇటీవల న్యాయవాదుల్లో అనారోగ్య సమస్యలు పెరిగిపోవడం.. ఆకస్మిక మరణాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు జగన్ తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

» కాంగ్రెస్, బీజేపీ నేతలు.. బీసీ వ్యతిరేకులే: జాజుల

కవాడిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ సమావేశాలే వేదికగా 42% బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం తేలకముందే స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. ఎవరి వాటా వారికి దక్కాలన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాటకు రాష్ట్రంలో విలువ లేకుండా పోయిందని దుయ్యబట్టారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సైతం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ స్పీకర్ మధుసూదనచారి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకుని బీసీలను నిండా ముంచాయని ధ్వజమెత్తారు.

టేక్మాల్ ఎస్సై అరెస్టుపై ఏసీబీకి డీజీపీ అభినందన

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు వచ్చిన మెదక్ జిల్లా టేక్మాల్ ఎస్సైని అరెస్టు చేయడం పట్ల ఏసీబీ అధికారులను డీజీపీ శివధర్‌రెడ్డి అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏసీబీ డీజీ చారుసిన్హాతో పాటు ఇతర అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. అవినీతిపరులైన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని సూచించారు. లంచం తీసుకున్న ఓ ఎస్సైని అరెస్టు చేస్తే ప్రజలు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారంటే అవినీతిని వారు ఏమాత్రం సహించరని అర్థం చేసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పోలీసుల పట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. ప్రజలు పోలీసుల నుంచి శాంతి భద్రతల పరిరక్షణను, చక్కని పోలీసింగ్‌ను కోరుకుంటారని, పీడించే వారిపట్ల వారు నిర్దయగా ఉంటారని ఈ సంఘటన రుజువు చేసిందని అన్నారు. ఇకపై పోలీసు అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే అది వారిని పర్యవేక్షించే అధికారుల లోపంగానే భావిస్తానని వారి మీద కూడా చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు.

ఐదేళ్ల సర్వీస్ తర్వాత తొలగింపు సరికాదు

» 'గ్రూప్-2' తీర్పుపై అప్పీల్ దాఖలుకు టీజీపీఎస్సీ కసరత్తు

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను మళ్లీ మూల్యాంకనం చేసి, ఫలితాలు ప్రకటించాలంటూ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయించినట్లు తెలిసింది. 2019లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించగా, 2020లో 1032 మంది ఉద్యోగాల్లో చేరారు. అప్పటి తప్పిదాలపై హైకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం బుధవారం అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఫలితాలు మళ్లీ ప్రకటిస్తే తలెత్తబోయే పరిణామాలపై నిపుణుల సూచనలు తీసుకున్నారు. నాటి నోటిఫికేషన్‌లో ఎంపికైన 1032 మంది ఐదేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. వారిని ఇప్పుడు తొలగించడం సరికాదని, ఫలితాలు మళ్లీ ప్రకటిస్తే కేటాయింపుల్లో సమస్యలు ఎదురవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు హైకోర్టు తీర్పుపై అప్పీలు దాఖలు చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. ఇలాంటి వృద్ధిని సాధించడానికి ప్రధాన రంగాలపై దృష్టి సారిస్తామని తెలిపింది. ఆ డాక్యుమెంట్‌లోని ముఖ్యాంశాలు..



మూడు ప్రాంతాలుగా అభివృద్ధి

రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి, సమాన అభివృద్ధిని సాధించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. అర్బన్ కోర్, పెరి అర్బన్, గ్రామీణ తెలంగాణగా వర్గీకరించి, దీర్ఘకాలిక లక్ష్యంతో అభివృద్ధిని సాధిస్తామని తెలిపింది. అర్బన్ కోర్ ఏరియాలో భాగంగా హైదరాబాద్, ఇతర ప్రధాన నగర నోడ్‌లను టెక్నాలజీ, ఇన్నోవేషన్స్, అత్యాధునిక తయారీ, పరిశ్రమలు-4.0, జీసీసీలు, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రపంచ స్థాయి హబ్‌లుగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం. పెరి అర్బన్ ఏరియాలో భాగంగా మధ్య తరహా తయారీ పరిశ్రమలు, ఆరెంజ్, ఎల్లో పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈ, లాజిస్టిక్ హబ్స్ ఏర్పాటు చేసి ఆర్థిక సమగ్రతను సాధించనున్నారు. గ్రామీణ తెలంగాణ ప్రాంతంలో సుస్థిర జీవనోపాధి అవకాశాలను పెంచుతారు. ముఖ్యంగా సాంకేతిక వ్యవసాయం, పశు సంపద, అటవీ ఆధారిత ఉపాధి, హస్తకళాఖండాల తయారీ వంటి సంప్రదాయ పరిశ్రమల ద్వారా ఈ అభివృద్ధిని సాధించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంను అభివృద్ధి చేసి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య కనెక్టివిటీని పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. అలాగే.. తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రపంచ హబ్‌గా మార్చాలని, తయారీ, అన్వేషణలు, నాలెడ్జ్ ఇండస్ట్రీస్‌కు గమ్యస్థానంగా మార్చాలని.. సెమీకండక్టర్ సిటీ, ఎనర్జీ పార్కు, ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

మహిళా శక్తే దేశ శక్తి...

మహిళలు శక్తిమంతులైతేనే దేశం శక్తిమంతంగా మారుతుందని భావిస్తున్న ప్రభుత్వం.. 'ఇందిరా మహిళా శక్తి మిషన్'లో భాగంగా రాష్ట్రంలోని మహిళలను 2047 నాటికి ప్రధాన శక్తిగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను 2047 నాటికి కోటీశ్వరుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. మహిళలకు ప్రతి రంగంలో, ప్రతి స్థాయిలో సహకరించనుంది. ఎంఎస్‌ఎంఈ పార్కులు, స్వయం సహాయక గ్రూపులు, ఇన్నోవేషన్ హబ్‌లలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భాగస్వామ్యం కల్పించనుంది.

యువతకు ఊతం

ప్రస్తుతం రాష్ట్రంలో 35 ఏళ్ల లోపు యువత 65 శాతం వరకు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరికి నాణ్యమైన విద్యను అందించడం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతను పెంపొందించడం, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడం వంటి చర్యలు చేపట్టనుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాన్ని పెంచాలని నిర్ణయించింది. అడ్వాన్స్ మానుఫ్యాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో వారికి అవకాశాలు కల్పించనుంది. ఇండస్ట్రియల్ క్లస్టర్లు, జీఐఎస్ మ్యాపింగ్ ఆధారిత ఆర్థిక జోన్లలో యువతకు అవకాశం కల్పించడం, విద్య, క్రీడలకు ఉపకార వేతనాలు అందించడం వంటి చర్యలు చేపడుతోంది.

సున్నాస్థాయికి కర్బన ఉద్గారాలు..

రాష్ట్రంలో కర్బన ఉద్గారాలను జీరో స్థాయికి తగ్గించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు కోసం సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి, సుస్థిర వ్యవసాయం, హరిత భవనాల్లో పెట్టుబడులను ప్రోత్సహించనుంది. ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించడం, సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి సదుపాయాలను విస్తరించడం, పంప్‌డ్ స్టోరేజీ మౌలికవసతులను కల్పించడం ద్వారా నెట్ జీరో డెవలప్‌మెంట్ సాధించాలని నిర్ణయించింది.

రైతులే రాష్ట్రానికి వెన్నెముక

రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని భావిస్తున్న సర్కారు.. గ్రామీణ ప్రాంతాల స్వయం సమృద్ధి, 50 శాతం వర్క్‌ఫోర్స్‌కు పని కల్పించడం ద్వారా అన్నదాతలకు సహకరించాలని నిర్ణయించింది. పంట మార్పిడి, సాగులో సాంకేతికతను జొప్పించడం, పంటల విలువలను పెంచడం ద్వారా రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలని నిశ్చయించింది. రైతులకు మార్కెట్ సదుపాయాలు, పెట్టుబడి సాయం, రవాణా సదుపాయాలు, సాగునీటి సౌకర్యాన్ని కల్పించనుంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ ఉత్పత్తులు, డెయిరీ వ్యాపారాలకు గ్లోబల్ హబ్‌గా మారిందని.. ఆహార ఉత్పత్తుల ఎగుమతికి మరింత అవకాశం ఉందని తెలిపింది.

ప్రతి వ్యక్తికీ చౌకగా ఆరోగ్య సేవలు

రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికీ చౌక ధరల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి తేవాలని సర్కారు నిర్ణయించింది. ముఖ్యంగా.. వృద్ధులకు సంబంధించిన ఆరోగ్య సేవలపై మరింత దృష్టి పెట్టనుంది. డిజిటల్ ఆరోగ్య పరిష్కారాలు, టెలి మెడిసిన్, భవిష్యత్తులో అవసరమైన వైద్య సదుపాయాలకు ప్రాధాన్యమివ్వనుంది.

కీలక శక్తిదాయకాలు..

రాష్ట్ర ప్రగతికి పలు కీలక శక్తిదాయకాల(కీ ఎనేబ్లర్స్)ను ప్రభుత్వం గుర్తించింది. టెక్ అండ్ ఇన్నోవేషన్, లాజిస్టిక్స్, ఎఫిషియంట్ ఫైనాన్సింగ్, సుపరిపాలన వంటివి అందులో ఉన్నాయి. లాజిస్టిక్స్‌లో భాగంగా డ్రైపోర్టులు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, రోడ్డు, రైలు, విమాన కనెక్టివిటీ పెంచడంలో పెట్టుబడులు పెడుతుంది. పీఎం గతి శక్తి పథకం కింద కొన్ని ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. టీఎస్-ఐపాస్, గోదాముల్లో ఫాస్ట్ ట్రాక్ సిస్టం, సింగిల్ విండో క్లియరెన్స్‌ల ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను పెంచాలని నిర్ణయించింది. హైదరాబాద్ ఫార్మా ఎగుమతులు, కార్గో సౌకర్యాలను మరింత పెంచనుంది. టెక్ అండ్ ఇన్నోవేషన్‌లో భాగంగా.. వ్యవసాయం, విద్య, హెల్త్ కేర్, పరిశ్రమలు, పట్టణ పరిపాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. ఎఫిషియంట్ ఫైనాన్సింగ్‌లో భాగంగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్(పీపీపీ) విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, విద్య రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలని నిర్ణయించింది. సుపరిపాలనలో భాగంగా పారదర్శకత, జవాబుదారీతనంపై దృష్టి పెట్టనుంది.

ఏం చేయబోతున్నామో చెప్పేదే

» 'తెలంగాణ రైజింగ్' డాక్యుమెంట్

» గ్లోబల్ సమ్మిట్ నాటికి దాని రూపకల్పన పూర్తి చేయాలి

» సమీక్షలో అధికారులు, ఐఎస్‌బీకి డిప్యూటీ సీఎం భట్టి సూచన

భవిష్యత్ తరాలకు ఎలాంటి మేలు చేకూర్చాలి, ప్రభుత్వపరంగా ఎలాంటి అభివృద్ధి చేయబోతున్నాం, ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని ఎలా తీర్చిదిద్దనున్నాం అన్న వివరాలు చెప్పేదే 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్ అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని కూడా దాని ద్వారా వివరిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజాభవన్‌లోని 'విజన్ డాకుమెంట్ వార్ రూమ్'లో బుధవారం సాయంత్రం అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి రాష్ట్రంలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా ఈ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్టు భట్టి చెప్పారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ఇండియన్ బిజినెస్ స్కూల్(ఐఎస్‌బీ)తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. దీని కోసం ఇప్పటికే వివిధ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లను నియమించామని, వారిచ్చిన సమాచారం మేరకు ఐఎస్‌బీ బృందం ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిందని ఆయన తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనుందని, అప్పటిలోగా డాక్యుమెంట్‌ను సిద్ధం చేయాలని అధికారులు, ఐఎస్‌బీకి సూచించారు. విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను చేరుకోవడానికి అన్ని శాఖలవారూ ప్రణాళికలను రచించుకోవాలని సూచించారు. రూ.36 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య 39 రేడియల్ రోడ్లను నిర్మించనున్నామని వివరించారు. వాటిని కలుపుతూ పెద్ద సంఖ్యలో ఇండస్ట్రియల్ క్లస్టర్లు రానున్నాయన్నారు. భవిష్యత్తులో ఏం చేయబోతున్నామనేది.. గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే నిపుణులకు వివరిస్తామన్నారు. ప్రముఖ కంపెనీల సీఈవోలు కూడా ఆ సదస్సుకు రానున్నారని చెప్పారు. డాక్యుమెంట్‌కు తుది రూపు వచ్చాక.. సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి ఆమోదం తెలుపుతారని భట్టి పేర్కొన్నారు. కాగా.. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి ఇందిరాగాంధీ

» గరీబీ హటావో, రోటీ కపడా ఔర్ మకాన్ నినాదాలతో నిరుపేదల జీవితాలు మార్చారు

» మోదీ, అమిత్‌షా, బీజేపీ నేతలెవరైనా దేశం కోసం ప్రాణత్యాగం చేశారా..?

» ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భూములు పంచిన చరిత్ర ఇందిరాగాంధీది

» ఆమె చేపట్టిన సంస్కరణలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

» ఢిల్లీ బీజేపీ నాయకులారా ఈ చరిత్ర మీకుందా..!

» సంగారెడ్డిలో ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఈ దేశ ప్రజల కోసం తన రక్తాన్ని, ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వ్యక్తి స్వర్గీయ ఇందిరాగాంధీ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డిలో ఆమె విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడారు. తమ రక్తాన్ని, ప్రాణాన్ని అర్పిస్తామని ప్రసంగాలు చేసే మోదీ, అమిత్‌షా, ఇతర బీజేపీ నాయకుల్లో ఎవరైనా దేశం కోసం ప్రాణ త్యాగం చేశారా అని ప్రశ్నించారు. గరీబీ హటావో, రోటీ కపడా ఔర్ మకాన్ నినాదాలతో దేశంలోని నిరుపేదల స్థితిగతును ఇందిరాగాంధీ మార్చారని గుర్తుచేశారు. ఈ దేశంలో భూమిలేని వారికి భూములు పంచిన ఘనత ఇందిరాగాంధీదేనని వివరించారు. ఇందిరమ్మ చేపట్టిన సంస్కరణలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ఈ దేశం కోసం ఇందిర ప్రాణత్యాగం చేశారని, ఢిల్లీ బీజేపీ నేతలకు ఈ చరిత్ర ఉందా? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.



సంగారెడ్డిలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించి మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హిందువుల ఓట్లతోనే కేంద్రంలో బీజేపీ!

» వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడం వెనుకా ఆ ఓట్లే

» బల్దియా ఎన్నికల్లో 48స్థానాలు గెలవడం వెనుకా హిందూ ఓటర్లే

» ధర్మ పరిరక్షణకు నా పోరాటాన్ని చూసే అమిత్ షా రాష్ట్ర అధ్యక్ష పదవిచ్చారు

» పహల్గాంలో ఉగ్రవాదులు హిందువులను గుర్తించి మరీ కాల్చి చంపారు

» అలాంటప్పుడు హిందువుల గురించి మాట్లాడకుండా ఎలా ఉంటాం?: సంజయ్



హైదరాబాద్, హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాము బరాబర్ మతతత్వవాదులమేనని, ఇక ముందూ హిందుత్వ నినాదంతోనే గడపగడపకూ తిరుగుతామని, రాష్ట్రంలో రామరాజ్యాన్ని తెచ్చి తీరుతామని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ముస్లింలను పొగుడుతున్న పార్టీల నేతల నోట కూడా జైశ్రీరాం అనిపించేలా పోరాటం చేస్తాం అని నొక్కి చెప్పారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో బండి సంజయ్ విలేకర్లతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారాన్ని బండి సంజయ్ పూర్తిగా హిందుత్వ ఎజెండాతో సాగించడం.. అయినా ఫలితాల్లో పార్టీ చతికిల పడిన నేపథ్యంలో 'ఇలాగైతే అధికారంలోకి రావడం సాధ్యం కాదు' అంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పెదవి విరిచారు. కుల, మత రాజకీయాలకు కాలం చెల్లిందని, మత ప్రాతిపదికన విభజన రాజకీయాలు కుదరవని కూడా ఈటల వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఈటలకు కౌంటర్‌గానే ఆయన గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన, ఆయనకు గట్టి పట్టున్న హుజూరాబాద్ వేదికగా బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు జోరుగా చర్చ నడుస్తోంది. తాను హిందూ ధర్మ పరిరక్షణ కోసం, ప్రజల కోసం చేస్తున్న పోరాటాన్ని గమనించే అమిత్‌షా తనకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టారని పేర్కొన్నారు. కేంద్రంలో వరుసగా మూడుసార్లు బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నా, రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ అధికారంలోకి వచ్చే వాతావరణం ఏర్పడిందన్నా.. కారణం హిందూత్వమేనని బండి సంజయ్ పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో హిందువులను ఓటుబ్యాంకుగా మార్చామని.. ఫలితంగానే బల్దియాలో 48 స్థానాలు సాధించగలిగామని చెప్పారు. హిందువులను ఎగతాళి చేయడం వల్లే బీఆర్‌ఎస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని పేర్కొన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకుల్లో హిందువులెవరని గుర్తించి మరీ కాల్చి చంపారని.. హైదరాబాద్‌లో ముస్లింలు రెండు ఆలయాలను కూల్చివేశారని, గోరక్షకులపైనా కాల్పులు జరిపారని, ఇటీవల ఓ ముస్లిం యువకుడు నిజామాబాద్‌లో కానిస్టేబుల్‌ను చంపాడని.. అలాంటప్పుడు హిందుత్వంపై మాట్లాడకుండా ఎలా ఉంటాం? అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. దేశ జనాభాలో 12శాతం మాత్రమే ఉన్న ముస్లింలు ఏకతాటిపైకొచ్చి బీజేపీకి వ్యతిరేకంగా మారడం సరైనదే అయితే.. 80శాతం ఉన్న హిందువులను ఒక్కటి చేయడం తప్పెలా అవుతుంది? అని ప్రశ్నించారు. మతాలకు అతీతంగా మోదీ ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే.. బీజేపీకి ముస్లింలు ఓటు వెయ్యరెందుకు? అని నిలదీశారు. తమను తాము సెక్యులర్ అని చెప్పుకునే పార్టీలు ముస్లిం మహిళల కోసం తాము ట్రిపుల్ తలాక్ రద్దు చేస్తే అడ్డుకోవాలని చూశాయని మండిపడ్డారు. కాగా నక్సలైట్లు అడవుల్లో ప్రాణాలు కోల్పోతుంటే అర్బన్ నక్సల్స్ మాత్రం నామినేటెడ్ పదవులు అనుభవిస్తున్నారని, ఆస్తులు కూడగట్టుకుంటున్నారని విమర్శించారు. అమాయక దళిత, గిరిజన యువతను అర్బన్ నక్సల్సే రెచ్చగొట్టి వారిని మావోయిస్టులుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్లలో చనిపోతున్న మావోయిస్టుల కుటుంబ సభ్యుల గుండెకోత మీకేం తెలుసునంటూ వారిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు మీరు వ్యతిరేకమైనప్పుడు నామినేటెడ్, కమిషన్ పోస్టుల్లో ఎందుకు కొనసాగుతున్నారని ప్రశ్నించారు. నక్సలిజానికి మద్దతిచ్చిన వారు కూడా నేరస్థులే అని పేర్కొన్నారు.

డీఎన్ఏ నమూనాల సేకరణ పూర్తి

» మదీనా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటన

» హైదరాబాద్ నుంచి వచ్చిన 39 మంది శాంపిళ్ల సేకరణ

» మదీనా చేరిన ఏపీ గవర్నర్ నజీర్ నేతృత్వంలోని బృందం



హైదరాబాద్ నుంచి మదీనా చేరుకున్న వారితో మంత్రి అజారుద్దీన్

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, న్యూఢిల్లీ, శంషాబాద్ రూరల్, నవంబరు 19 : సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమైన వారికి సంబంధించిన కుటుంబసభ్యులు బుధవారం మదీనా చేరుకున్నారు. హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్, ఎమ్మెల్సీ రహిమత్‌బేగ్, కమిటీ మెంబర్ మసూద్ అలీ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు చెందిన 39 మంది మంగళవారం అర్ధరాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి సౌదీ అరేబియా వెళ్లారు. మదీనా చేరుకున్న వీరికి తెలంగాణ రాష్ట్ర మంత్రి మహ్మద్ అజారుద్దీన్ విమానాశ్రయంలోనే స్వాగతం పలికారు. అజారుద్దీన్ రెండు రోజుల క్రితమే మదీనా చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి మదీనా వచ్చిన 39 మందిని నేరుగా స్థానిక ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగానికి తీసుకెళ్లి డీఎన్ఏ పరీక్షలకు నమూనాలు తీసుకున్నారు. అనుకున్న దాని కంటే త్వరగానే డీఎన్ఏ శాంపిళ్ల సేకరణ పూర్తి కాగా.. ఫలితాలు కూడా త్వరగా వస్తాయని చెబుతున్నారు. ఇక, తమ వారి అంతిమ కార్యక్రమాలు ముగిసిన తర్వాత ఆ 39 మంది తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. బస్సు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన షోయెబ్ కుటుంబ సభ్యుడిని కలిసిన మంత్రి అజారుద్దీన్ అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా లాంఛనాలను పూర్తి చేయడానికి, స్థానిక విధానాలు, కుటుంబ ప్రాధాన్యతలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం సౌదీ అధికారులతో కలిసి పనిచేస్తోంది. మంత్రి అజారుద్దీన్ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయంగా తెలియజేస్తున్నారు.

మదీనా చేరిన ఏపీ గవర్నర్ నజీర్ బృందం

మదీనాలో జరిగిన ప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయ యాత్రికుల కుటుంబాలకు అందుతున్న సహాయక చర్యల పరిశీలనకు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పంపిన అత్యున్నత స్థాయి కమిటీ కూడా బుధవారం మదీనా చేరుకుంది. ఈ బృందంలో విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ చటర్జీ, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. సౌదీ అరేబియాలో భారత రాయబారి సోహైల్ అహ్మద్ ఖాన్, కాన్సుల్ జనరల్ ఫహద్ ఖాన్ సూరీ.. గవర్నర్ బృందానికి విమానాశ్రయంలో స్వాగతం పలికారు. మృతుల అంతిమ కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ఏపీ గవర్నర్ నజీర్ మదీనాలోనే ఉంటారని అధికార వర్గాలు వెల్లడించాయి.

రష్యా పెట్టుబడులకు పూర్తి సహకారం: భట్టి



హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రష్యా నుంచి వచ్చే పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తిగా సహకరిస్తామని రష్యా బృందానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. గ్లోబల్ ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(జీటీటీసీఐ), వీటీబీ రష్యన్ బ్యాంక్ ప్రతినిధులు ప్రజా భవన్‌లో ఆయనతో భేటీ అయ్యారు. వ్యవసాయం, విద్యుత్తు, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సూచించారు. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్ర భాగాన నిలిచిందని, ఫార్మా, ఐటీ రంగాలకు హబ్‌గా ఉందని, మైనింగ్ రంగంలోనూ రాణిస్తోందని తెలిపారు.

కూకట్‌పల్లిలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్..!

హైదరాబాద్ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫుడ్ టెస్టింగ్ అండ్ అనాలసిస్ ల్యాబొరేటరీల ఏర్పాటు దిశగా అడుగు పడింది. కూకట్‌పల్లి మూసాపేట పరిధిలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఓ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదిస్తూ ఆ జోనల్ కమిషనర్ ప్రతిపాదనలు పంపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో ఒక్కొక్కటి చొప్పున ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు.. అనువైన స్థలాలు, భవనాలు గుర్తించాలని గతంలో కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ జోనల్ కమిషనర్లకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మూసాపేట సర్కిల్‌లో గ్రౌండ్ ప్లస్ ఒక అంతస్తుగా ఉన్న ఓ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ల్యాబ్ ఏర్పాటును ప్రతిపాదిస్తూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ప్రతిపాదనలు పంపారు. గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో దీనిపై చర్చ జరగనుంది. ల్యాబ్ ఏర్పాటుకు భవనం అనుకూలంగా ఉందని, ప్రస్తుతం ఫంక్షన్ హాల్ నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై కమిటీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రాజెక్టుల పనుల్లో పురోగతి నమోదుకు యాప్

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల ప్రాజెక్టుల పనుల పురోగతి వివరాలు ఇక ముందు యాప్‌లోనే నమోదుకానున్నాయి. డిసెంబరు 1వ తేదీ నుంచి ఈ యాప్ అందుబాటులోకిరానుంది. రాష్ట్రంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల పనుల పురోగతి నమోదుకు యాప్‌ను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బుధవారం జలసౌధలో యాప్ పనితీరుపై చీఫ్ ఇంజనీర్లతో వర్చువల్ విధానంలో ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్‌తో కలిసి సమీక్ష చేశారు. ప్రస్తుతం పనుల రికార్డుకు ఎం-బుక్ (మెజర్‌మెంట్ బుక్)ను వినియోగిస్తుండగా... ఇకముందు ఎం-బుక్‌తోపాటు యాప్‌లో పనుల పురోగతి రికార్డు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆలయాల్లో మతపరమైన సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాల్లో మతపరమైన సిబ్బంది నియామకానికి అధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. ఈ నోటిఫికేషన్ ద్వారా అర్చక, పరిచారక, పాచక సిబ్బంది సహా వాయిద్య కళాకారుల బృందం తదితర పోస్టులు కలిపి మొత్తం 324ఖాళీలను భర్తీ చేయనున్నారు. సిబ్బంది నియామకానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆలయాల ఈవోలను దేవాదాయ శాఖ డైరెక్టర్ హరీశ్ రావు ఆదేశించారు.

దేవాదాయ శాఖలో బదిలీలకు రంగం సిద్ధం..

దేవాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్(డీసీ) స్థాయి అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఈ శాఖలో పదోన్నతులు, పోస్టింగులకు సంబంధించి కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు.. బదిలీలకు చర్యలు చేపట్టారు. ప్రధానమైన డీసీ హైదరాబాద్‌తో పాటు బాసర, కొండగట్టు, కొమరవెల్లి ఆలయ ఈవోలు బదిలీ కానున్నట్లు సమాచారం.

కారు యజమాని అమానుషం

» సైడ్ ఇవ్వనందుకు.. కాలితో తన్ని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేస్తున్న కారు యజమాని

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తన కారుకు సైడ్ ఇవ్వలేదన్న కారణంతో ఓ వ్యక్తి ఆర్టీసీ డ్రైవర్‌పై అమానుషంగా దాడిచేశాడు. బస్సు ఇంజనుపై ఎక్కి మరీ.. డ్రైవర్‌ను కాలితో తన్నుతూ విచక్షణా రహితంగా ప్రవర్తించాడు. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇల్లంతకుంట మీదుగా వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆర్టీసీ డ్రైవర్ బాలరాజు బస్సు నడుపుతుండగా వల్లంపట్ల గ్రామ సమీపంలోకి రాగానే.. వెనక నుంచి వచ్చిన కారు యజమాని సైడ్ అడిగాడు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు రద్దీ కారణంగా వెంటనే డ్రైవర్ సైడ్ ఇవ్వలేకపోయాడు. దీంతో విచక్షణ కోల్పోయిన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్‌కు చెందిన పిట్టల శ్రీకాంత్ అనే వ్యక్తి ఏకంగా బస్సు డ్రైవర్ క్యాబిన్‌లోకి దూసుకెళ్లాడు. పక్కనున్న ప్రయాణికులు ఆపేలోపే దాడికి దిగిన శ్రీకాంత్.. కాలితో డ్రైవరు వీపుపై బలంగా తన్ని గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

దాడిని ఖండించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగిపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి హామీ ఇచ్చారు. దాడిచేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.

చెప్పిన చోట బస్సు ఆపలేదని కండక్టర్‌పై దాడి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాను అడిగిన చోట బస్సు నిలపలేదనే కోపంతో ఓ ప్రయాణికుడి కుటుంబం ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై దాడి చేసింది. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఈ సంఘటన జరిగింది. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ ఎల్‌బీనగర్ నుంచి చౌటుప్పల్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కింది. మహిళ దిగాల్సిన బస్టాప్ వద్ద కండక్టర్ బస్సు ఆపకపోవడంతో ఆగ్రహించిన మహిళ తన భర్త, కుమారుడికి ఫోన్‌లో విషయాన్ని తెలియజేసింది. దీంతో వారిద్దరూ బస్టాండ్ వద్దకు చేరుకుని, బస్సు ఎందుకు ఆపలేదని ఆగ్రహిస్తూ కండక్టర్ గోశిక దయానంద్‌పై దాడి చేశారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు భర్త వీరస్వామి, కుమారుడు ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థిని మోకాళ్లపై నడిపించిన ఉపాధ్యాయుడు

అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదని శిక్ష

గాయాలపాలైన బాలుడు



విద్యార్థి మోకాళ్లకు అయిన గాయాలు

వడ్డేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదని మూడో తరగతి విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు మోకాళ్లపై నడిపించాడు. దీంతో ఆ బాలుడి మోకాళ్లకు రక్తగాయాలయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని శారద విద్యానికేతన్ పాఠశాలలో కొంకల గ్రామానికి చెందిన రంగన్న కుమారుడు ఉదయ్ చదువుతున్నాడు. మంగళవారం టీచర్ అడిగిన ప్రశ్నకు అతడు సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆ బాలుడిని మోకాళ్లపై నడిపించడంతో రక్త గాయాలయ్యాయి. తండ్రి రంగన్న బుధవారం పాఠశాలకు వెళ్లి ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో కలెక్టర్, డీఈవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

మహిళల ఉన్నతే.. ప్రగతి

వారి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

» మహిళా సంఘాల ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు

» ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం అమెజాన్‌తో సంప్రదింపులు

» ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయం: సీఎం రేవంత్



కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్, భట్టి, పొన్నం, పొంగులేటి, సీతక్క, సీఎస్

హైదరాబాద్ /హైదరాబాద్ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అనే నినాదంతో తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయమని, అందుకనుగుణంగానే ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డనూ తోబుట్టువుగా భావించి చీర పెడుతోందని చెప్పారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామన్నారు. బుధవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులోని ఆమె విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ జిల్లాలకు చెందిన మహిళా సమాఖ్య ప్రతినిధులకు చీరలు అందించి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పరిపాలనలో ఇందిరాగాంధీ ఒక రోల్ మోడల్ అని, బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని కొనియాడారు. దేశంలో అనేక విప్లవాత్మకమైన, స్ఫూర్తిదాయకమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. "ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లతోపాటు మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలు, పెట్రోల్ బంక్‌లు అప్పగించడం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు బస్సులకు యజమానులను కూడా ఆడబిడ్డలను చేశాం.' అని సీఎం వివరించారు. మహిళా సంఘాలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులను ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళతామని, ఇందుకోసం అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ అన్నారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆశ చూపించి మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే మొదటి విడతగా రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు కట్టిస్తున్నామని, ప్రతి ఇంటికీ రూ.5 లక్షలను ఆడబిడ్డల పేరుతో ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన చీరలను పొలాల వద్ద పిట్టలను తరిమేందుకు కట్టుకునే పరిస్థితి ఉండేదని, వాటిపై చాలా మంది మహిళలు నిరసన తెలిపారని గుర్తు చేశారు. అనంతరం సచివాలయం నుంచి జిల్లాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి సంబంధించి ప్రతి నియోజకవర్గానికీ ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి మండల కేంద్రంలో నిర్వహించాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ప్రస్తుతం 65 లక్షల చీరలు సిద్ధమయ్యాయని సీఎం తెలిపారు. మొదటి విడతగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ చీరలను తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవమైన డిసెంబరు 9 వరకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇంకా 35 లక్షల చీరలు రావాల్సి ఉందని, వాటిని వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంలోపు పట్టణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తామని తెలిపారు.

అవకాశం ఉన్నచోటల్లా ప్రోత్సాహం..

మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అనే నినాదంతో తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాల విషయంలో నిర్లక్ష్యం వహించిందని, తాము వడ్డీలేని రుణాలు ఇవ్వడంతోపాటు అందుకు సంబంధించిన నిధులు విడుదల చేశామని అన్నారు. యూనిఫారాలు కుట్టే బాధ్యతను అప్పజెప్పడంతో మహిళా సంఘాలకు రూ.30 కోట్ల ఆదాయం సమకూరిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో రూ.534 కోట్ల పనులు చేపట్టామని, ధాన్యం కొనుగోళ్లు మహిళా సంఘాలకే అప్పజెప్పామని వివరించారు. శిల్పారామం పక్కన మూడెకరాల స్థలంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ చీరలు అందిస్తున్నామని తెలిపారు. కాగా, ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని మంత్రి సీతక్క అన్నారు. మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలనే సంకేతాన్నిచ్చేలా చీరలకు ఆకాశం రంగును ఎంచుకున్నామన్నారు.

మీ పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోంది?

మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా పలువురు మహిళలతో సీఎం రేవంత్ సంభాషించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతిని ఉద్దేశించి "మీ సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోంది?" అని సీఎం ప్రశ్నించారు. ఇందుకు ఆమె సమాధానమిస్తూ.. పెట్రోల్ బంక్ బాగా నడుస్తోందని, నెలకు రూ.4 లక్షల రాబడి వస్తోందని తెలిపారు. రూ.2 లక్షలు ఖర్చులు పోను రూ.2 లక్షల వరకు మిగులుతోందని చెప్పారు. దాంతో ఇతర జిల్లాల నుంచి కూడా సంఘాలను అక్కడికి తీసుకెళ్లి వారి పనితీరు, రాబడిని ప్రత్యక్షంగా చూపించాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. కాగా, తమకు ఇస్తున్న చీరల డిజైన్లు ఎంతో బాగున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య అన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరలు ఇవ్వడంతో తమకు యూనిఫాం వచ్చినట్లుగా సంతోషంగా ఉందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'కలెక్టర్‌గారూ.. తెలుగులో మాట్లాడండి'

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సిరిసిల్ల ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఉన్న గరీమా అగర్వాల్ తన తన ప్రసంగాన్ని ఇంగ్లీషులో ప్రారంభించడంతో.. సీఎం జోక్యం చేసుకొని తెలుగులో మాట్లాడాలని సూచించారు. "సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. ఆంగ్లంలో మీరు చెబుతున్న వివరాలు వారికి అర్థం కావు. మీకు తెలుగు వచ్చు కదా! తెలుగులో మాట్లాడండి" అని సీఎం అన్నారు. దీంతో ఇన్‌చార్జి కలెక్టర్ తన ప్రసంగాన్ని తెలుగులోనే కొనసాగించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

నేటి నుంచి ఓటర్ల జాబితా సవరణ

(మొదటిపేజీ తరువాయి)

డీజీపీ శివధర్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కూడా పాల్గొనున్నారు.

ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్‌లు..

గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఎస్‌ఈసీ పరిశీలకులను నియమించింది. అన్ని జిల్లాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులు, వ్యయ పరిశీలకులను నియమిస్తూ ఎస్‌ఈసీ కార్యదర్శి మంద మకరంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 31 జిల్లాలకు సాధారణ పరిశీలకులుగా (జనరల్ అబ్జర్వర్) ఐఏఎస్ అధికారులను నియమించారు. జిల్లాల వారీగా బి.బాల మాయాదేవి (వరంగల్), భారతి లక్పతి నాయక్ (మెదక్), ప్రశాంత్ జీవన్ పాటిల్ (రంగారెడ్డి), కొర్ర లక్ష్మి (నల్లగొండ), వాసం వెంకటేశ్వర్‌రెడ్డి (ఖమ్మం), కె.హరిత (సిద్దిపేట), గౌతం పొట్రు (హన్మకొండ), జి.రవి (సూర్యాపేట), కె.నిఖిల (జనగాం), అయేషా మసరత్ ఖానం (నిర్మల్), ఎస్‌కె. యాస్మిన్ బాషా (వికారాబాద్), హనుమంత్ కొండిబా (కామారెడ్డి), పి.ఉదయ్‌కుమార్ (సంగారెడ్డి), కోట శ్రీవాత్స (నాగర్ కర్నూల్), కాత్యాయనీదేవి (మహబూబ్ నగర్), కె.సీతాలక్ష్మి (నారాయణపేట్), జి.ఫణీంద్రరెడ్డి (భూపాలపల్లి), చంద్రశేఖర్ రెడ్డి (కరీంనగర్), పి.గౌతమి (భువనగిరి), ఆర్.ఉపేందర్ రెడ్డి (ఆదిలాబాద్), అనుగు నరసింహారెడ్డి (పెద్దపల్లి), జి.లక్ష్మీబాయి (సిరిసిల్ల), లక్ష్మణుడు (ఆసిఫాబాద్), ప్రశాంత్ కుమార్ (ములుగు), మధుకర్ బాబు (మహబూబాబాద్), సర్వేశ్వర్ రెడ్డి (కొత్తగూడెం), శ్యాంప్రసాద్ లాల్ (నిజామాబాద్), వెంకటేశ్వర్ రెడ్డి (జగిత్యాల), మల్లయ్యభట్టు (వనపర్తి), గంగాధర్ (మంచిర్యాల), జితేందర్ రెడ్డి (గద్వాల) నియమితులయ్యారు.

రెండు దశల్లోనే ఎన్నికలు!

పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో పూర్తిచేసే అవకాశాలున్నాయి. గతంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఇచ్చినప్పుడు.. మూడు దశల్లో పోలింగ్ నిర్వహిస్తామని ఎస్‌ఈసీ పేర్కొంది. అయితే ఈసారి మాత్రం రెండు దశల్లోనే ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా.. డిసెంబరు మొదటి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలకు వెళ్లే అవకాశాలున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాతో ప్రారంభించి సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో సీఎం పర్యటించనున్నారు. అయితే తుది పర్యటన వివరాలు ఇంకా ఖరారు కాలేదు. అదే సమయంలో ప్రభుత్వంలో మరో చర్చ కూడా జరుగుతోంది. ఈ నెలలోనే షెడ్యూలు ప్రకటిస్తే ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేస్తుంది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలు, ఆయా జిల్లాల్లో చేయాలనుకుంటున్న శంకుస్థాపనలకు ఏమైనా ఇబ్బంది అవుతుందా?, అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలు, ప్రతిష్ఠాత్మక తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు కోడ్ అడ్డంకి ఉంటుందా? అన్న కోణంలోనూ ప్రభుత్వంలో చర్చ జరిగింది. అయితే పట్టణ ప్రాంతాల్లో పర్యటనలు పెట్టుకోవచ్చని, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు గ్రామ పంచాయతీల ఎన్నికల కోడ్‌తో ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది.

వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు : మంత్రి దామోదర



హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వృద్ధులకు అవసరమైన వైద్య సేవలను విస్తరిస్తున్నామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు జనరల్ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి జీజీహెచ్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జబ్బులున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలదేనని మంత్రి స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వోలు, హాస్పిటల్ సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను తాము మానిటర్ చేస్తున్నామన్నారు. ఐవీఎఫ్ సెంటర్లు, రిహాబిలిటేషన్ సెంటర్ల పేరిట అవకతవకలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

విద్యుత్తుపై ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలో 2023-35 కల్లా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వాటా 20,874 మెగావాట్లు, థర్మల్ వాటా 18,248 మెగావాట్లు, పవన విద్యుత్తు వాటా 3,628 మెగావాట్లుగా ఉంటేనే డిమాండ్‌ను తీర్చగలమని, దీనికోసం ఎనర్జీ పాలసీ కింద కొత్త ప్లాంట్లు పెట్టడానికి వీలుగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని గుర్తించారు. 8వేల మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థను ప్రభుత్వ, ప్రైవేట్ భాగ స్వామ్యంతో పెట్టాల్సి ఉంటుందని, మరో 5 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తు కేంద్రాలు కూడా పెట్టాల్సి ఉంటుందని గుర్తించారు. 2034-25 కల్లా జెన్‌కో థర్మల్ సామర్థ్యం 7,980 మెగావాట్లుగా చేరనుందని, సింగరేణి థర్మల్ సామర్థ్యం 2వేల మెగావాట్లకు పేర్కొంది. పూర్తిగా సంప్రదాయేతర ఇంధన విద్యుత్తుపై ఆధారపడితే గ్రిడ్ కుప్పకూలే ప్రమాదం ఉన్నందున... గ్రిడ్ రక్షణ కోసం విధిగా థర్మల్ ప్లాంట్‌లు పెట్టాల్సి ఉంటుంది. రామగుండంలో 800 మెగావాట్లు, న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌పెట్టే దిశగా అడుగులు వేయాలని, కేటీపీఎస్‌లో 1600 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణంపై కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని జెన్‌కో ప్రతిపాదించింది. 20234-35 కల్లా 4400 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లు పెట్టడానికికూడా అవకాశం ఉంటుందని గుర్తు చేసింది.

కుప్పకూలిన విద్యుత్తు సంస్థలు

అత్యధిక ధరకు విద్యుత్తు కొనుగోళ్లు, అప్పులు, వివిధ ప్రభుత్వ శాఖల చెల్లింపులు ఆలస్యం కావడంతో విద్యుత్తు సంస్థలు కుప్పకూలాయని, 2014-15 నుంచి 2019-20 మధ్యకాలంలో డిస్కమ్‌లకు రూ.3553.84 కోట్ల టారిఫ్ సబ్సిడీ చెల్లించాల్సి ఉన్నా చెల్లించలేదని జెన్‌కో గుర్తు చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు వినియోగచార్జీల కింద రూ.31,763.1 కోట్లు, సర్‌చార్జి కింద రూ.16,242.2 కోట్లు కలిపి రూ.48,005.4 కోట్ల బిల్లులు డిస్కమ్‌లకు చెల్లించాల్సి ఉందని గుర్తించింది. బొగ్గును అత్యధిక ధరతో కొనుగోలు చేయడంతో ఆ భారం కరెంట్ చార్జీలపై పడుతోందని, దేశంలో మహానది కోల్ టన్ను బొగ్గును రూ.1120 లకు, వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ రూ.1340లకు, సౌత్-ఈస్ట్రన్ కోల్ రూ.1120లకు అమ్ముతుండగా.. సింగరేణి నుంచి రవాణా చార్జీలు కలిపి టన్ను బొగ్గు రూ.5670లకు పడుతుందని గుర్తించింది. ఇక మహానది బొగ్గు రవాణాతో కలిపి రూ.4449, వెస్ట్రన్ రూ.3789, సౌత్ ఈస్ట్రన్ టన్ను రూ.4431 లకు రానుందని తెలిపింది. నాలుగు సంస్థలు వర్కింగ్ క్యాపిటల్ రూపంలో రూ.53,900 కోట్లు, కేపెక్స్ రుణాల కింద రూ.44,904 కోట్లు కలిపి రూ.98,804 కోట్ల అప్పుల్లో ఉన్నాయని గుర్తించింది. సింగరేణికి కరెంట్, బొగ్గు కొనుగోళ్ల కింద రూ.23,311 కోట్లను చెల్లించాల్సి ఉందని తెలిపింది.

హైదరాబాద్‌లో భూగర్భ కేబుల్ వ్యవస్థ

జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యుత్తు అంతరాయాలను తగ్గించి...నాణ్యమైన విద్యుత్తు సరఫరా కోసం 43,384



కిలోమీటర్ల మేర వివిధ సామర్థ్యాల మేరకు భూగర్భ లైన్లు వేయాల్సి ఉంటుందని, దీని వ్యయం 14,725 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. అదే బెంగుళూరులో 14,199 కిలోమీటర్ల మేర లైన్లు వేసేందుకు 5,281 కోట్ల మేర వెచ్చించారని జెన్‌కో గుర్తు చేసింది.

పాత డిస్కమ్‌ల పరపతి కోసం కొత్త డిస్కమ్

2025 మార్చి 31 నాటికి ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ రూ.59,671 కోట్ల మేర నష్టాల్లో ఉన్నాయని, వీటి పరపతి పెంచడానికి కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వ్యవసాయ పంపుసెట్లు (28,89,921), ఎత్తిపోతల పథకాలు(429), మిషన్‌భగీరథ/గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ (276), హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌బోర్డు(60) ఇలా మొత్తంగా 28,90,686 కనెక్షన్లతో ప్రత్యేకంగా డిస్కమ్ ఏర్పాటు చేయనున్నట్లు గుర్తించింది. దీనికోసం ఆయా కనెక్షన్లకు కరెంట్ అందించే అన్ని రకాల డీటీఆర్‌లను బదిలీ చేయనున్నారు. అన్నిరకాల పీపీఏలను మూడు డిస్కమ్‌లు(ఇదివరకే ఉన్న రెండు కలిపి) పంచుకుంటాయని గుర్తు చేయనుంది. కొత్త డిస్కమ్ కోసం సీఎండీ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో పాటు 2 వేల మంది ఉద్యోగులు అవసరమని లెక్కగట్టింది. వివిధ జెన్‌కోలకు చెల్లించాల్సిన 26,950 కోట్లతో పాటు రూ.9032 కోట్ల అప్పులను కొత్త డిస్కమ్ బదిలీ చేయనున్నారు.

పత్తి కొనుగోలు బాధ్యత కేంద్రానిది కాదా?

» దేశంలో పండే మొత్తం పత్తిని కొంటామని మోదీ అనలేదా?

» కొత్తగా కిసాన్ కపాస్ యాప్, 7క్వింటాళ్ల రూల్ ఎందుకు?

» తేమ ఎక్కువున్న పత్తిని కొనాలని కేంద్రాన్ని ఎన్నోసార్లు కోరాం

» స్పందన లేకపోవడంతో రైతులకు ఇబ్బంది

» రాష్ట్ర రైతులను బీజేపీ ఇబ్బంది పెడుతోంది

» బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనా కాలంలో అధోగతిలోకి తెలంగాణ రాష్ట్రం: తుమ్మల

» "వాళ్లింట్లో అగ్గి అంటుకుందని అసత్య ప్రచారాలతో రాష్ట్రాన్ని కాల్చేస్తారా" అంటూ బీఆర్‌ఎస్ నాయకులను ఉద్దేశించి వ్యాఖ్యలు



హైదరాబాద్/ఖమ్మం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు అనేక షరతులు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతులను ఇబ్బంది పెడుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసే బాధ్యత కేంద్రానిదే అయినప్పటికీ బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. "పత్తి కొనుగోలు బాధ్యత కేంద్రానిది కాదా" అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. దేశంలో పండే పత్తి మొత్తాన్ని కొంటామని ప్రధాని మోదీ గతంలో చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడేమో కిసాన్ కపాస్ యాప్, పత్తి కొనుగోలుపై 7క్వింటాళ్ల పరిమితి, జిన్నింగ్ మిల్లుల విభజన... ఇలా ఒక్కో సమయానికి ఒక్కో నిబంధన పెడుతూ రైతులను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. పత్తి తేమపై దేశవ్యాప్తంగా ఒకే పాలసీ ఉన్నప్పటికీ, రాష్ట్రంలో వర్షాలు, మొంథా తుఫాను ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తేమ శాతం ఎక్కువ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయాలని అనేక సార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అయినా, కనీస స్పందన కూడా లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎకరానికి 5 క్వింటాళ్ల నుంచి 11 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంటే.. 7 క్వింటాళ్ల నిబంధన ఎందుకు పెట్టారని, అధికంగా పండించిన పత్తిని రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. జిన్నింగ్ మిల్లులను ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరీలుగా విభజించి.. కొన్నింటిలోనే కొనుగోలు చేస్తామని కొత్త నిబంధనలు పెట్టడంతో జిన్నింగ్ మిల్లుల యజమానులను గందరగోళంలో పడేశారని, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని జిన్నింగ్ మిల్లుల సమ్మెను పరిష్కరించిందని, కనీసం వారి సమస్యలు అర్థం చేసుకోలేని పరిస్థితిలో కేంద్రం ఉందని తుమ్మల ఎద్దేవా చేశారు. సీజన్ ప్రారంభంలో మద్దతు ధర ప్రకటించి వదిలేయడమే తప్ప, రైతులకు మద్దతు ధర అందుతుందా? లేదా? అని కేంద్రం ఏనాడూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రైతులు నష్టపోకూడదని రాష్ట్ర ప్రభుత్వమే పలు పంట ఉత్పత్తులను మద్దతు ధరకు సేకరిస్తున్నదని తుమ్మల తెలిపారు. "కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.2,500 కోట్లు వెచ్చించి మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్న విషయం మీకు తెలియదా.. నాఫెడ్ ద్వారా చేపడుతున్న సోయాబీన్ కొనుగోళ్లలో ఆధార్ ధృవీకరణతో కౌలు రైతులకు అన్యాయం చేస్తున్నది మీరు కాదా" అని తుమ్మల రాష్ట్ర బీజేపీ నాయకులను నిలదేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్‌ఎస్, బీజేపీ ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. ఆ రెండు పార్టీలు రాజకీయ కుట్రలతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ.. "వాళ్ల ఇంట్లో అగ్గి అంటుకుందని, అసత్య ప్రచారాలతో రాష్ట్రాన్ని కాల్చేస్తారా" అని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు..

బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను ఇంకా మభ్యపెట్టలేరు

తమ వల్లే పత్తి కొనుగోళ్లు జరుగుతున్నట్లు చెప్పుకొంటున్నారని, వారిని చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నేతల అవినీతి వల్లే వారు ఇప్పుడు ఇంట్లో కూర్చోవాల్సి వచ్చిందని, ఇంకా ప్రజలను మభ్యపెట్టాలంటే కుదరదని, వారి చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలియనిది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ముందుగా వారి కుటుంబసభ్యులు చేస్తున్న ఆరోపణలపై సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలోని బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంతో మాట్లాడి పంటలను కనీస మద్దతు ధరకు కొనేలా చూడాలని సవాలు చేశారు.

న్యాయ విచారణ చేపట్టాలి: కూనంనేని

» బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి: జాన్‌వెస్లీ

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న మావోయిస్టుల హత్యలపై వెంటనే న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే.. తక్షణమే కోర్టులు స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. మఖ్దూం భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన కుటుంబాల నేపథ్యంతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్‌కౌంటర్లు ఆపి.. పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టు నేత తిరుపతితోపాటు అందరినీ న్యాయస్థానాల్లో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు. వామపక్ష, ప్రజాస్వామిక మేధావులతో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిడ్మా, ఆయన భార్యతోపాటు మరికొంత మంది ఎన్‌కౌంటర్లు చూస్తే..నిర్బంధించి బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. మావోయిస్టులు కాల్పులు విరమించి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని పలు మార్లు ప్రకటించినా.. వాళ్లతో చర్చలు జరపకుండా ఏకపక్షంగా మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం పూనుకుందని తెలిపారు.



అరెస్టు అయిన డిప్యూటీ తహసీల్దార్, బీఆర్ఎస్ నేత, రియల్ ఎస్టేట్ వ్యాపారులు

నకిలీ పత్రాలతో 15 కోట్ల భూమి అక్రమ రిజిస్ట్రేషన్

» డిప్యూటీ తహసీల్దార్, బీఆర్ఎస్ నేత అరెస్టు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి రూ.15 కోట్ల విలువైన భూమిని మూడేళ్ల క్రితం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసులో డిప్యూటీ తహసీల్దార్, బీఆర్ఎస్ నేత, ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ మధుసూదన్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో ఆందోల్‌మైసమ్మ దేవాలయం సమీప సర్వే నంబర్ 42లో మూడెకరాల ఐదు గుంటల భూమి తెల్లపాటి భూపయ్య పేరిట రికార్డులో ఉంది. భూపయ్య కుటుంబం 60ఏళ్ల క్రితమే గ్రామం నుంచి వెళ్లిపోగా భూమి ఖాళీగా ఉంది. ఆ భూమి ఆక్రమణకు బీఆర్ఎస్ నేత, అధికారులు, రియల్టీ వ్యాపారులు రంగం సిద్ధం చేశారు. రియల్టీ వ్యాపారి అత్తపురం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్‌గౌడ్, అప్పటి చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ (ప్రస్తుతం అడ్డగూడూరు డిప్యూటీ తహసీల్దార్) ఉప్పు రాజేష్ కలిసి, వీఆర్వో, ఆర్ఐ సైదిరెడ్డిల సాయంతో తప్పుడు పత్రాలు సృష్టించి ఏపీలోని నెల్లూరు జిల్లా గువ్వడి గ్రామానికి చెందిన మోహన్‌రావు పేరిట భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. తిరిగి మోహన్‌రావు నుంచి నిరంజన్‌గౌడ్ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ భూమిని కబ్జా చేస్తున్నారని సామాజిక కార్యకర్తలు, గ్రామస్థులు పలు సందర్భాల్లో ఫిర్యాదులు చేయడంతో ఆ సర్వే నంబర్‌ను బ్లాక్‌లో ఉంచారు. దీనిని బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి పాస్‌పుస్తకాలు ఇప్పించాలని నిరంజన్‌గౌడ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదాన్ని పరిష్కరించాలని హైకోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది. చౌటుప్పల్ తహసీల్దార్ బి.వీరాబాయి విచారణ జరిపి భూకబ్జాగా తేల్చారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బుధవారం గిర్కాటి నిరంజన్‌గౌడ్, రాజేశ్, భోగినేని మోహన్‌రావు, నరేందర్‌రెడ్డిలను అరెస్టు చేసి రామన్నపేట కోర్టుకు తరలించారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు. నిరంజన్ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు.

సహచరులారా.. ఇప్పటికైనా లొంగిపోండి

హిడ్మా మరణం విచారకరం.. మావోయిస్టు నేత మల్లోజుల

హైదరాబాద్, మహబూబాబాద్, ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ సూచించారు. ఈ మేరకు మల్లోజుల వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హిడ్మాతో పాటు ఆరుగురు ఎన్‌కౌంటర్‌లో మరణించడం విచారకరమని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్లలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయుధాలతో సాయుధ పోరాటం చేసే పరిస్థితులు ఇపుడు లేవని, మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగణంగా మనలోనూ మార్పు రావాలని సూచించారు. సాయుధ పోరాటం వల్ల చాలా నష్టపోయామని ఇప్పటికైనా ఆయుధాలను వదిలివేసి ప్రజల్లోకి వచ్చి పోరాటం కొనసాగిద్దామని కోరారు. గతంలో తాను ఇదే విధమైన వినతి చేశానని ఎవరైనా తనను సంప్రదించదలిస్తే 88560 38533 ఫోన్ నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కాగా, ఏపీలోని మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న డిమాండ్ చేశారు. దైద వెంకన్న పేరిట మహబూబాబాద్ 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి బుధవారం ఓ లేఖ అందింది. విజయవాడలోని ఓ ఇంట్లో షెల్టర్ తీసుకున్న హిడ్మాతో పాటు ఆరుగురిని అక్రమంగా అరెస్టు చేసి, బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని ఆ లేఖలో ఆరోపించారు. కగార్ పేరుతో కర్రెగుట్టల నుంచి మారేడుమల్లి వరకు ప్రభుత్వం హత్యాకాండలు చేస్తోందని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లొంగిపోయేందుకు వచ్చిన ఉద్యమకారులను కోర్టులో హాజరుపర్చకుండా ప్రభుత్వం చిత్రహింసలు పెట్టి బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతోందని ఆరోపించారు.

నక్సల్స్ దాడిలో పోలీసు అధికారి మృతి

రాజ్‌నందగావ్ (ఛత్తీస్‌గఢ్) : ఛత్తీస్‌గఢ్ - మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ పోలీసు అధికారి మరణించారు. మహారాష్ట్ర-మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ (ఎం.ఎం.సి.) సరిహద్దుల్లో మావోయిస్టులు ఉన్నట్టు అందిన సమాచారంతో బుధవారం కూంబింగ్ జరుపుతుండగా, ఈ ఘటన జరిగినట్టు రాజ్‌నందగావ్ రేంజ్ ఐజీ అభిషేక్ శాండిల్యా తెలిపారు. ఈ ఘటనలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ల విభాగానికి చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ మరణించారని వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన ఆ అధికారిని ఛత్తీస్‌గఢ్‌లోని దంగర్‌గఢ్ ఆస్పత్రికి హెలికాప్టర్‌లో తరలించి చికిత్స అందించినా, ఫలితం లేక పోయిందని తెలిపారు.

మరో ఏడుగురి ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

అలియాస్ బాబు అలియాస్ శివతోపాటు మరో ఆరుగురు చనిపోయారు. వీరంతా మావోయిస్టు పార్టీ మిలిటరీ చీఫ్ హిడ్మా దళ సభ్యులు. టెక్ శంకర్ ఈ దళంలో అత్యంత సీనియర్ నేత అని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు ఇదే ప్రాంతంలో మంగళవారం ఎన్‌కౌంటర్ అయిన విషయం తెలిసిందే. హిడ్మా దళం కోసం 'ఆపరేషన్ సంభవ్' పేరుతో గాలిస్తున్న కేంద్ర, ఆంధ్ర పోలీసు బృందాలు గత రెండు రోజుల్లో 13 మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశాయి. పోలీసు వర్గాల కథనం ప్రకారం, మారేడుమిల్లి మండలం జీఎం వలస గ్రామ పరిధిలోని నల్లకొండ సమీపంలోని పెదనేరేడు చెట్టు ప్రాంతంలో బుధవారం ఉదయం ఐదు గంటల సమయంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులు జరిగాయి. మెట్టూరి జోగారావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. జోగారావు పదోతరగతి వరకు వజ్రపుకొత్తూరు మండలంలో చదువుకున్నాడు. 1988లో పీపుల్స్‌వార్‌లో చేరాడు. మిలిటరీ, టెక్నాలజీలో మంచి పట్టు సాధించి ఆంధ్ర-ఒడిశాలో టెక్ శంకర్‌గా ఎదిగాడు. ఐదేళ్ల క్రితం శ్రీకాకుళం అప్పటి ఎస్పీ... జోగారావు కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి ఆయనను లొంగిపోవాలని కోరాలని సూచించారు. ఆయన తలపై రూ. 20లక్షల రివార్డు ఉంది. ఇంకా మృతుల్లో మావోయిస్టు మాజీ చీఫ్ నంబాల కేశవరావు వద్ద గార్డ్ కమాండర్‌గా పనిచేసిన జ్యోతి అలియాస్ సరిత; సురేశ్ అలియాస్ రమేశ్; కేంద్రకమిటీ మాజీ సభ్యుడు కటకం సుదర్శన్ బాడీగార్డుగా పనిచేసిన లోకేశ్ అలియాస్ గణేశ్; సైను అలియాస్ వాసు, అనిత, సామినీ కూడా ఉన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు కావు: అల్లూరి ఎస్పీ

ఏవోబీలో మావోయిస్టులు మళ్లీ రిక్రూట్‌మెంట్ మొదలెట్టారని, ఇది తెలిసి తాము కూంబింగ్ నిర్వహించినట్టు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేయాల్సిన అవసరం లేదని, లొంగిపోతామంటే, దానికి అవకాశం ఇవ్వడంలోనే తమకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వివరించారు. మూడు రోజుల విస్తృత కూంబింగ్‌లో మావోయిస్టులపై పైచేయి సాధించగలిగామన్నారు. రంపచోడవరంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. "మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో హిడ్మా సహా ఆరుగురు మరణించారు. ఆ ఘటనలో తప్పించుకున్నవారికోసం కోసం మా బలగాలు గాలింపు సాగిస్తుండగా, బుధవారం మరోసారి మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఎదురు కాల్పులు జరపగా, ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే 47లు, ఐదు ఏకే 47 తూటాల మాలలు, ఐదు ఎస్‌బీబీఎల్ తుపాకులు, 34 రౌండ్ల ఎస్‌బీబీఎల్ తూటాలు, 303 రైఫిల్, 24 రౌండ్ల 303 తూటాలు, మూడు కిలోల వైర్, 18 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నాం" అని వివరించారు.


స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న ఏడీజీ లడ్హా

హిడ్మా దంపతులకు పోస్టుమార్టం పూర్తి

మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణి రాజే దంపతుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయింది. హిడ్మా సోదరుడు ముయా, రాజే సోదరుడు హెలిన్ సమక్షంలో ఫోరెన్సిక్ నిపుణులు పోస్టుమార్టం నిర్వహించారు. వీరి బంధువుల వద్ద నుంచి డీఎన్ఏ శాంపిళ్లను అధికారులు సేకరించారు. వీరితో పాటు మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మరో నలుగురు, బుధవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. కాగా, హిడ్మా భౌతికకాయం కోసం ఆయన కుటుంబ సభ్యులు వచ్చారు. రాత్రి 8గంటల వరకూ కూడా వారి బంధువులకు భౌతిక కాయాలను అందజేయలేదు. మరికొందరు మావోయిస్టుల బంధువులు కూడా వచ్చినట్టు తెలిసింది.

మృతదేహాల నుంచి దుర్వాసన

జీఎం వలస గ్రామం అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు మృతదేహాల నుంచి దుర్వాసన మొదలైంది. మధ్యాహ్నం సుమారు 1.30గంటల సమయంలో ఎన్‌కౌంటర్ ప్రాంతంనుంచి ఐషర్ వ్యాన్‌పై ముసుగువేసి మృతదేహాలను తీసుకొచ్చారు. కానీ పోస్టుమార్టంగది వద్ద తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో రంపచోడవరం గ్రామం మొదట్లోనే సుమారు గంటసేపు వ్యాన్‌ను రోడ్డు పక్కనే నిలిపి ఉంచారు. ఈ వ్యాన్ నుంచి దుర్వాసన వస్తోందని ఆ దారిన వెళ్లేవారంతా చర్చించుకున్నారు.


తిరుపతి సోదరుడు గంగాధర్, సుమ

పోలీసుల అదుపులో తిరుపతి ఉన్నాడా?

» మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి ఎక్కడ?

» ఆందోళనలో కుటుంబ సభ్యులు

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పరి తిరుపతి ఆంధ్రప్రదేశ్ పోలీసుల అదుపులో ఉన్నాడన్న ప్రచారంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా మరణించిన సంగతి తెలిసిందే. అదేసమయంలో పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. దేవ్‌జీ రక్షణ బృందంలోని 9మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు వస్తున్న వార్తలతో ఆయన కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. 1980లో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇంటర్ పూర్తి చేసిన తిరుపతి ఆర్ఎస్‌యూలో కీలక కార్యకర్తగా పని చేశారు. 1983లో పీపుల్స్‌వార్‌లో చేరి, అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇటీవలే కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితుడయ్యారు. కాగా, తిరుపతిని పోలీసులు అరెస్టు చేస్తే కోర్టులో హాజరు పరచాలని ఆయన తమ్ముడు గంగాధర్ కోరారు. గంగాధర్ కుమార్తె సుమ 'పెద్ద నాన్నా లొంగిపో' అని గతంలో రెండుసార్లు సామాజిక మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేశారు. 2 రోజులుగా జరుగుతున్న ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో తిరుపతి క్షేమ సమాచారంపై గంగాధర్, సుమలు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ తిరుపతిని అరెస్ట్ చేసి ఉంటే కోర్టులో హాజరు పరచాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

45 మందికి రిమాండ్

రాజమండ్రి, నెల్లూరు కేంద్ర కారాగారాలకు మావోయిస్టులు తరలింపు

విజయవాడ/ఏలూరు క్రైం/కాకినాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ, ఏలూరుల్లో పట్టుబడిన మావోయిస్టుల్లో 43 మందికి వేర్వేరు కోర్టులు రిమాండ్ విధించాయి. మరో నలుగురికి వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని న్యాయాధికారి ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు, కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో పట్టుబడిన మావోయిస్టులను పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. నిడమానూరులో పట్టుకున్న నలుగురినీ పటమట పోలీసులు నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. వారికి వచ్చే నెల 3 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి యు. రామ్మోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. వారిని నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. కొత్త ఆటోనగర్‌లో చిక్కిన 28 మందిని పెనమలూరు పోలీసులు ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వారిలో 24 మందికి డిసెంబరు 2 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఆదేశాలు ఇచ్చారు. వారిని రెండు బస్సుల్లో రాజమండ్రి కేంద్ర కారాగారానికి పోలీసులు తరలించారు.


విజయవాడలో అరెస్టు చేసిన నక్సల్స్‌ను కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

పిల్లల్లా ఉన్నారే...!

కొత్త ఆటోనగర్‌లో పట్టుబడిన మావోయిస్టుల్లో మడకం హంగ(ఏ7), కుంజం రాంబు(ఏ9), దోడి వాకాడ్(ఏ10), మాధవి మహిని(ఏ26) పొట్టిగా ఉండటంతో వారి వయసుపై న్యాయాధికారి సందేహం వ్యక్తం చేశారు. కోర్టు హాలులో వారిని గమనించిన న్యాయాధికారి ఈ నలుగురూ పిల్లల్లా ఉన్నారని వ్యాఖ్యానించారు. వారు కొండ ప్రాంతాల్లో ఉండటంతో ఆ విధంగా కనిపిస్తారని ఏపీపీ రాధిక వివరించారు. ఏమైనా సందేహం ఉంటే ముందుగా రిమాండ్ విధించి తర్వాత వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. దీనికి న్యాయాధికారి లెనిన్‌బాబు అంగీకరించలేదు. వారికి రిమాండ్ విధించడానికి నిరాకరించారు. వయసు నిర్ధారణకు వైద్య పరీక్షలు చేయించిన తర్వాత కోర్టులో గురువారం హాజరుపరచాలని ఆదేశించారు. పెనమలూరు పోలీసులు 28మంది మావోయిస్టులను తీసుకురావడానికి ముందు కోర్టు హాలు న్యాయవాదులతో నిండిపోయింది. దీంతో కేసుతో సంబంధం లేని న్యాయవాదులు బయటకు వెళ్లిపోవాలని న్యాయాధికారి లెనిన్‌బాబు సూచించారు. దీనిపై న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం మావోయిస్టుల రిమాండ్ వాదనలను ఇన్ కెమెరా విధానంలో చేస్తున్నట్టు న్యాయాధికారి ఆర్డర్ ఇవ్వడంతో న్యాయవాదులంతా బయటకు వెళ్లిపోయారు.

ఏలూరులో అదుపులోకి తీసుకున్న 15మంది మావోయిస్టులను బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఏలూరు స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. అరెస్టయిన మావోయిస్టుల మాతృభాష గోండు భాష కావడంతో దాన్ని తెలుగులోకి తర్జుమా చేయడానికి కుక్కునూరు ప్రాంతాల్లో ఉన్న ఛత్తీస్‌ఘడ్ ప్రాంతం నుంచి వచ్చిన ఇద్దరు యువకులను కోర్టుకు తీసుకువచ్చారు. వారందరికీ వచ్చే నెల 3 వరకూ రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఎన్ మేరీ ఉత్తర్వులు ఇచ్చారు. పటిష్ఠ బందోబస్తు మధ్య పోలీసులు వారిని రాజమండ్రి సెంట్రల్‌కు తరలించారు. కాగా, కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టులను సామర్లకోట పోలీసులు బుధవారం సాయంత్రం ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి షేక్ షరీన్ వారికి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

హిడ్మా అనుచరుడి అరెస్టు

కోనసీమ జిల్లాలోని రావులపాలెంలో మావోయిస్టు హిడ్మా అనుచరుడు సరోజ్ మడివి అలియాస్ ఓండాను పోలీసులు అరెస్టు చేశారు. సుక్మా జిల్లా గుర్గేలంకకు చెందిన సరోజ్ 5వ తరగతి వరకూ కుంటలో చదువుకున్నాడు. మావోయిస్టు కార్యకలాపాలకు ఆకర్షితుడై 12వ ఏట ఉద్యమంలో చేరాడు. ప్రస్తుతం మోచాకీ ఎర్ర అలియాస్ ఎర్రదాద సౌత్ డివిజనల్ మావోయిస్టు కమాండర్ ఇన్‌చార్జ్‌గా, కమ్యూనికేషన్ కమాండర్‌గా ఉంటూ మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. మావోయిస్టు అగ్రనేత హిడ్మాకు అత్యంత సన్నిహితుడు. సఖినేటిపల్లిలో ఒక చేపల చెరువులో సరోజ్ పనికి కుదిరినట్లు సమాచారం. నిఘా వర్గాల సమాచారంతో మంగళవారం రాత్రి రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద అతడిని అరెస్టు చేశారు.

మావోయిస్టులు ఉన్న అంతస్తు అద్దె నెలకు రూ.లక్ష!

కృష్ణాజిల్లా కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు అద్దెకు తీసుకున్న మారుతి బిల్డింగ్ మూడో అంతస్తుకు అద్దె నెలకు లక్ష రూపాయిలు. భవనం యజమాని విదేశాల్లో ఉండటంతో అక్కడ పనిచేసే సూపర్‌వైజర్ వీరికి అద్దెకు ఇచ్చారు. రోడ్డు పనులు చేసేందుకు వచ్చామని చెప్పి మావోయిస్టులు ఆ బిల్డింగ్‌లో దిగినట్లు ఆటోనగర్‌లోని పలువురు కార్మికులు చెబుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మూడు అంతస్తులుగా తొమ్మిదేళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను సెల్‌ఫోన్‌ల గోడౌన్‌కు అద్దెకు ఇచ్చారు. మిగిలిన అంతస్థులు నిర్మించిన నాటి నుంచి ఖాళీగానే ఉన్నాయని తెలిపారు. 4 నెలలు ఉంటామని చెప్పి మావోయిస్టులు అద్దెకు దిగినట్టు సమాచారం. వీరు ఉన్న ఫ్లోర్ మొత్తం ఒకే హాలుగా ఉంటుంది. ఇదే హాలులోనే ఆయుధాలు, ఇతర సామగ్రిని భద్రపర్చుకున్నారు. వీరంతా రోడ్డు పనులకు వెళ్లడం, తిరిగి రావడాన్ని ఎప్పుడూ గమనించలేదని స్థానికులు చెబుతున్నారు.

అగ్రనేతలే లక్ష్యంగా ప్రణాళిక

మావోయిస్టులను బయటికి రప్పించేందుకు కేంద్ర నిఘా వర్గాల ఆపరేషన్

» తెలంగాణ, ఏపీ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ పోలీసులతో కలిసి అడవుల జల్లెడ

» నాలుగు కిలోమీటర్లకు ఒక బేస్‌క్యాంప్

» మావోయిస్టుల కొంపముంచిన డ్రోన్లు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేతలను బయటకు రప్పించడమే లక్ష్యంగా కేంద్ర నిఘా వర్గాలు పక్కా ప్రణాళికను రూపొందించుకున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టు పార్టీని అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మావోయిస్టు అగ్రనేతలే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ రోజుల తరబడి కొనసాగింది. ఏపీ, తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులతో కేంద్ర నిఘా బృందాలు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ అడవుల్లో తలదాచుకున్న హిడ్మా, దేవ్‌జీ లాంటి అగ్రనేతలను బయటకు రప్పించడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. ఆపరేషన్ కగార్ పేరిట అడవులను జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో ఇటీవల కొంతమంది మావోయిస్టు సానుభూతిపరుల ద్వారా లొంగిపోవడానికి వచ్చే అగ్రనేతలు, వారి బృందానికి ప్రాణరక్షణ కల్పిస్తామని నిఘావర్గాలు సందేశాన్ని పంపినట్లు తెలుస్తోంది. వివిధ దశల్లో జరిగిన సంప్రదింపుల తర్వాత హిడ్మా, దేవ్‌జీతో పాటు పలువురు నాయకులు ముందుకొచ్చారని.. అయితే, మధ్యవర్తుల మాటలు నమ్మలేక ముందుగా కొందరు అనుచరులను ఏపీకి పంపించారని తెలుస్తోంది. తమ వాళ్లు క్షేమంగా ఉండడంతో హిడ్మా, దేవ్‌జీ ఇతర నాయకులు ఏపీ సరిహద్దుల్లోకి ప్రవేశించిన వెంటనే కూంబింగ్ బృందాలు చుట్టుముట్టాయని.. ఈ క్రమంలోనే హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగిందని మాజీ మావోయిస్టులు చెబుతున్నారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి రక్షణ బృందమంతా ఏపీ పోలీసులకు పట్టుబడిందని, అతను ఎక్కడున్నాడనేది తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొంప ముంచిన డ్రోన్లు

ఆపరేషన్ కగార్‌లో కేంద్ర, రాష్ట్ర బలగాలు ఉపయోగించిన డ్రోన్లు మావోయిస్టుల పాలిట శాపంగా మారాయి. దట్టమైన అడవుల్లో సంచరించే మావోయిస్టులు డ్రోన్ల భయంతో రహస్య స్థావరాల నుంచి బయటకు రావడానికి భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. దండకారణ్యాన్ని జల్లెడ పట్టిన కేంద్ర బలగాలు ప్రతి 4కిలోమీటర్లకు ఒక బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేసుకొని ఆ ప్రాంతంపై పట్టు సాధిస్తూ.. అడవుల్లోకి చొచ్చుకొని వెళ్లారు. మావోయిస్టుల కదలికలను పసిగట్టడానికి పగలు, రాత్రి తేడా లేకుండా డ్రోన్లను వినియోగించారు. దండకారణ్యంలోని సురక్షిత స్థావరాలన్నీ పోలీసుల వశం కావడంతో కర్రెగుట్టల వైపు వచ్చిన మావోయిస్టులు కొన్నాళ్లు అక్కడే ఉన్నారు. అదే సమయంలో కర్రెగుట్టలను కేంద్ర, రాష్ట్ర బలగాలు జల్లెడ పట్టడంతో అక్కడి నుంచి తప్పించుకుని ఒడిసా వైపు వెళ్లడానికి ప్రయత్నించారని తెలుస్తోంది. నాలుగు కిలోమీటర్లకో బేస్ క్యాంప్ ఉండడంతో డ్రోన్ల ద్వారా మావోయిస్టుల కదలికలు గుర్తించిన వెంటనే బలగాలు ఆయా ప్రాంతాలను చుట్టుముట్టి, వారిని కట్టడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి దూకుడుగా వ్యవహరిస్తున్న బలగాలు అత్యాధునిక సాంకేతికతను వినియోగించి మావోయిస్టులను గుర్తిస్తున్నట్లు మాజీ మావోయిస్టులు చెబుతున్నారు.

మూగబోయిన మావోయిస్టుల కంచుకోట!

» పూవర్తికి చేరని హిడ్మా మృతదేహం

» కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న హిడ్మా తల్లి

» పూవర్తికి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి.. అడవిలో 3 గంటల పాటు ప్రయాణం



పూవర్తిలోని హిడ్మా ఇల్లు, రోదిస్తున్న హిడ్మా తల్లి (ముందు), బంధువు

చర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా వెలుగొందిన పూవర్తి.. మూగబోయింది. హిడ్మా ఎన్‌కౌంటర్‌తో ఆయన సొంతూరు పూవర్తిలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లాలోని పూవర్తి మావోయిస్టు పార్టీ రాజధానిగా 2024 వరకు వెలుగొందింది. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒకరు పార్టీలో పని చేశారు. మంగళవారం మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పూవర్తిలో నెలకొన్న పరిస్థితిని కవర్ చేసేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఆ గ్రామాన్ని సందర్శించారు. కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి.. ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు, కొౌరుగట్టు, కొండపల్లి, చిన్నబట్టిగూడెం గ్రామం మీదుగా 3 గంటల పాటు అడవిలో ప్రయాణించి పూవర్తికి చేరుకున్నారు. పూవర్తిలో 8 వీధులుండగా.. బండిపారలో హిడ్మా ఇల్లు ఉంది. అన్ని వీధుల్లో సగం ఇండ్లకు తాళాలే కనిపించాయి. కొందరు ఇళ్ల వద్ద దిగాలుగా కూర్చుని ఉన్నారు. మరికొంతమంది హిడ్మా ఇంటి వద్దకు చేరుకుని చెట్ల కింద కూర్చుని కనిపించారు. బుధవారం రాత్రి వరకు హిడ్మా మృతదేహం పూవర్తికి చేరుకోలేదు. నడవలేని స్థితిలో ఉన్న హిడ్మా తల్లి మాంజు.. ఇతర కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ కనిపించారు. హిడ్మా మృతిచెందిన విషయం సెల్‌ఫోన్‌లో చూశామని, ఫొటో చూశాక హిడ్మానే అని పోలీసులకు చెప్పామని గ్రామస్థులు చెప్పారు. హిడ్మా మృతదేహం గురువారం తీసుకొస్తారని తెలిపారు.

హిడ్మా కాదు దేవా..

హిడ్మా అసలు పేరు దేవా అని, హిడ్మా ఆయన తండ్రి పేరని గ్రామస్థులు చెప్పారు. హిడ్మా చిన్నప్పుడే తండ్రి అనారోగ్యంతో చనిపోయాడన్నారు. హిడ్మాకు అక్క బుద్రి, అన్న మూయా, చెల్లెల్లు కోసి, దేవే, ఉంగి ఉన్నారని.. ఓ ఎన్‌కౌంటర్‌లో అన్న చనిపోయాడని వెల్లడించారు. హిడ్మాను ఐదేళ్ల క్రితం చూశామని కొంతమంది.. గ్రామంలో క్యాంప్ పెట్టకముందు చూశామని మరికొందరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. హిడ్మా గ్రామానికి వచ్చినా బయట కనపడేవాడు కాదని, గతంలో భార్యతో వచ్చినప్పుడు చూశామని మరికొందరు చెప్పారు. గ్రామస్థులకు తన వంతుగా సాయం కూడా చేసేవాడని, ఆపద అంటే ఆదుకునేవాడని 60ఏళ్ల పైబడిన ఓ వృద్ధుడు తెలిపాడు. హిడ్మా ఇంటి పక్కన, మావోయిస్టుల సమావేశాలకు కట్టిన ఒక ఇల్లు, అతడి అన్న మృతి అనంతరం నిర్మించిన స్మారక స్థూపాన్ని కేంద్ర బలగాలు తొలగించాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.